www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 24-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 327 | వరంగల్

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి మ. 1.45 తదుపరి ద్వాదశి; నక్షత్రం: పూర్వాషాఢ రా. 6.59 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: రా2.49-4.23; దుర్ముహూర్తం: మ.12.51-1.37, మ.3.10-3.57; అమృతఘడియలు: మ.2.07-3.44; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.40, సూర్యాస్తమయం: 6.16

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రాష్ట్రంలో కొత్త మద్యం బ్రాండ్లు!



దరఖాస్తుల ఆహ్వానం.. 15వరకు గడువు

ఆ తర్వాత 10 రోజుల్లో.. ఆన్‌లైన్‌లో బహిరంగ విచారణ

బ్రాండ్లపై అభ్యంతరాలుంటే చర్యలు

కొత్త దేశీయ, విదేశీ మద్యానికి చాన్స్

ప్రస్తుతం రాష్ట్రంలో 53 కంపెనీల మద్యం

14



మధ్యప్రదేశ్‌లోని బాగేశ్వర్ ధామ్ మెడికల్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శంకుస్థాపన కార్యక్రమంలో మోదీ

హిందువులపై దాడి

అదే బానిస మనస్కుల అజెండా

సమాజ విభజన, ఐక్యత విచ్ఛిన్నమే వారి లక్ష్యం

విదేశీ శక్తుల అండదండలతో దేశాన్ని బలహీనపరిచే యత్నం

మహాకుంభమేళా విమర్శకులపై మోదీ ఆగ్రహం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాను విమర్శిస్తున్న ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. బానిస మనస్తత్వం ఉన్నవారు హిందూమత విశ్వాసాలపై అదే పనిగా దాడిచేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆదివారం మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్‌లో బాగేశ్వర్ ధామ్ మెడికల్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓ వర్గం నేతలు హిందూమతాన్ని అవహేళన చేస్తున్నారని, విదేశాల దన్నుతో దేశాన్ని బలహీనపరచాలని

మిగతా 2వ పేజీలో...

మోదీ, ట్రంప్, నేను మాట్లాడితే ప్రజాస్వామ్యానికి

ముప్పు అంటున్నారు

2

ఉదారవాదులవి ద్వంద్వ ప్రమాణాలు.. వారి అబద్ధాల్ని ప్రజలు నమ్మట్లేదు: ఇటలీ ప్రధాని మెలోనీ

టన్నెల్ నిండా బురద

సొరంగం లోపల చిక్కుకున్న వారి పరిస్థితిపై తీవ్ర ఆందోళన

టీబీఎం నుంచి 400 మీటర్ల వరకు కూరుకుపోయిన మట్టి, ఐరన్ షీట్లు

నిమిషానికి 3500 లీటర్ల దాకా సొరంగంలోకి వస్తున్న ఊటనీరు

సవాల్‌గా మారిన నీటి తొలగింపు

3 రోజులపాటు సహాయక చర్యలు కొనసాగితేనే పరిస్థితి కొలిక్కి!

ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఆర్మీ, హైడ్రా ఆధ్వర్యంలో సహాయక చర్యలు

2.5 మీటర్ల ఎత్తున పేరుకున్న బురద

సహాయక చర్యలపై సీఎం ఆరా

సీఎం రేవంత్‌కు రాహుల్ ఫోన్

కార్మికులను రక్షించేందుకు ఉన్న ఏ అవకాశాన్నీ వదులుకోవద్దని సూచన





ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు; సొరంగంలో భారీగా ఊట నీరు

మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూలు/అచ్చంపేట/ దోమలపెంట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగ మార్గంలో పైకప్పు కూలిన ఘటనలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. టన్నెల్ లోపల ఇద్దరు ఇంజనీర్లు, ఇద్దరు ఆపరేటర్లు, నలుగురు కార్మికులు చిక్కుకోవడంతో.. వారిని కాపాడేందుకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ బృందాలు, హైడ్రా, ఇండియన్ ఆర్మీ, స్పెషల్ బెటాలియన్ల ఆధ్వర్యంలో శనివారం రాత్రి 10.30 గంటల నుంచి సహాయక చర్యలు ప్రారంభమయ్యాయి. ఆదివారం సాయంత్రం వరకు మూడు బృందాలు లోపలికి వెళ్లాయి. అయితే సొరంగంలో దాదాపు 2.5 మీటర్ల నుంచి 3 మీటర్ల ఎత్తున బురద పేరుకుపోవడం, నిమిషానికి 3500 లీటర్ల వరకు ఊటనీరు వస్తుండటం, ప్రమాదం జరిగిన తర్వాత పేరుకుపోయిన నీరు నిల్వ ఉండటంతో

మిగతా 13వ పేజీలో...

ఆ 8 మంది పరిస్థితి ఆశాజనకంగా లేదు

చిక్కుకున్న వారిని పేర్లతో పిలిచినా వారి నుంచి స్పందన రావడం లేదు

టన్నెల్ లోపల భయానక పరిస్థితి.. 23-25 అడుగుల మేర శిథిలాలు

ఆ 42 మంది అదృష్టవంతులు.. నీళ్లతో సహాయక చర్యలకు ఆటంకాలు

ప్రధాని మోదీ, రాహుల్, సీఎం రేవంత్ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు

ప్రమాదాన్ని బీఆర్ఎస్ చిల్లర రాజకీయాలకు వాడొద్దు: ఉత్తమ్, జూపల్లి

13



విమాన గోపురం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

యాదగిరీశుడికి స్వర్ణ గోపుర శోభ

50.5 అడుగుల ఎత్తైన పంచతల గోపుర తాపడానికి.. 68కిలోల పసిడి వినియోగం

సీఎం రేవంత్ దంపతుల ప్రత్యేక పూజలు

5 రోజులుగా గుట్టపై జపాలు, పారాయణలు హోమాలతో ఉత్సాహపూరిత వాతావరణం

ఆదివారం దివ్య విమాన రాజగోపురానికి మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవం

సీఎం పర్యటనకు దేవాదాయ శాఖ మంత్రి, కమిషనర్, మంత్రుల గైర్హాజరుపై చర్చ

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి సీఎం

నేడు నిజామాబాద్, కరీంనగర్, మంచిర్యాల జిల్లాల్లో రేవంత్ పర్యటన

12





సచివాలయం ఐదో అంతస్తు రెయిలింగ్‌లో కొంత భాగం ఊడిన దృశ్యం; కిందపడ్డ పెచ్చులు (ఫైల్)

సచివాలయంలో పగుళ్లు!

భవనంలో చాలా చోట్ల ఉన్నాయ్

బయటకు అందంగా కనిపించేందుకు నట్లు, బోల్టులతో రెయిలింగ్‌ల ఏర్పాటు

వాటి ద్వారా వర్షపు నీరు చేరి తుప్పు పట్టి ఊడిపడిన జీఎఫ్ఆర్‌సీ ఫ్రేమ్

భవనం లోపల పిల్లర్ల ఫ్రేమ్‌లకు పగుళ్లు.. ప్రభుత్వానికి విచారణ కమిటీ నివేదిక

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయ నూతన భవనంలో చాలా చోట్ల పగుళ్లు వచ్చినట్లు తెలుస్తోంది. డిజైన్ కోసం నిర్మించిన పిల్లర్లకు అమర్చిన ఫ్రేమ్‌లతోపాటు కొన్ని గోడల్లోనూ ఈ పగుళ్లు వచ్చినట్లు సమాచారం. ఇటీవల సచివాలయం రెయిలింగ్ పెచ్చులు ఊడిపడిన ఘటనపై విచారణ జరిపిన కమిటీ.. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిసింది. "సచివాలయంలో చాలా చోట్ల పగుళ్లు ఉన్నాయి. కొన్ని పిల్లర్లకు అమర్చిన మోడల్ ఫ్రేమ్‌లకూ పగుళ్లు వచ్చాయి. బయటికి అందంగా కనిపించేందుకు అంతస్తుల వారీగా ఏర్పాటు చేసిన రెయిలింగ్‌లకు లోపలి వైపు నట్లు, బోల్టులను అమర్చారు. ఐదో అంతస్తు నుంచి ఊడిపడిన జీఎఫ్ఆర్‌సీ ఫ్రేమ్ లోపలివైపు కూడా నట్లు, బోల్టులతో

మిగతా 14వ పేజీలో...

బీజేపీని ఎలా ఎదుర్కొందాం?

ఏఐసీసీ సమావేశాల్లో కార్యాచరణ

ఏప్రిల్ 8, 9 తేదీల్లో కీలక సమావేశాలు

అహ్మదాబాద్‌లో ఖర్గే అధ్యక్షతన నిర్వహణ

హాజరవనున్న సోనియా, రాహుల్‌గాంధీ

2



ప్రస్తుతానికి కాంగ్రెస్‌లోనే..

పార్టీ వద్దనుకుంటే ప్రత్యామ్నాయాలున్నాయ్

దేశ, కేరళ ప్రయోజనాల కోసమే ప్రధాని మోదీపై, లెఫ్ట్ సర్కార్‌పై ప్రశంసలు

ఎప్పుడూ పార్టీ ప్రయోజనాల కోసమే మాట్లాడడం నా వల్ల కాదు: ఎంపీ థరూర్

విరాట్ విజయం

పాక్ ఖేల్ ఖతం!

ఆరు వికెట్లతో భారత్ విక్టరీ.. దాదాపు నాకౌట్‌కు రోహిత్ సేన!

రెండో ఓటమితో పాకిస్థాన్ సెమీస్ ఆశలు గల్లంతు?

చేజ్ మాస్టర్.. కింగ్ విరాట్ కోహ్లీ సెంచరీ(100 నాటౌట్)తో చెలరేగి.. చిరకాల ప్రత్యర్థి పాక్ పనిపట్టాడు. చాంపియన్స్ ట్రోఫీలో భారత్‌కు సెమీస్ బెర్త్ దాదాపు ఖరారు చేశాడు. టోర్నీలో పాక్ సెమీస్ ఆశలను దుబాయ్‌లోనే దాదాపుగా సమాధి చేసి.. 2017 టోర్నీ ఫైనల్‌లో ఆ జట్టు చేతిలో ఎదురైన ఓటమికి రిటర్న్ గిఫ్ట్ ఇచ్చేశాడు. ఆదివారం జరిగిన బ్లాక్‌బస్టర్ మ్యాచ్‌లో టీమిండియా 6 వికెట్ల తేడాతో పాక్‌పై గెలిచింది. వార్ వన్‌సైడ్‌లా కొనసాగిన మ్యాచ్‌లో విరాట్ సెంచరీ హైలైట్‌గా నిలవగా.. శ్రేయాస్ అయ్యర్(56), గిల్(46) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. రోహిత్ సేన సెమీస్ బెర్త్ దాదాపు ఖాయమవ్వగా.. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడిన డిఫెండింగ్ చాంపియన్ పాక్ కథ కరాచీకి చేరినట్టే..!! ఇక, ఈ మ్యాచ్‌లో కెరీర్‌లో 51వ సెంచరీ పూర్తి చేసిన విరాట్ కోహ్లీ.. వన్డేల్లో 14,000 పరుగుల మైలురాయిని దాటేశాడు.

11



BioAsia 2025 CATALYST OF CHANGE

రేపట్నుంచి హైదరాబాద్‌లో

బయోఏషియా

సదస్సును ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హెచ్ఐసీసీ వేదికగా రెండ్రోజుల పాటు కార్యక్రమాలు

50 దేశాలకు చెందిన 3 వేల మంది ప్రతినిధుల హాజరు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జీవ విజ్ఞాన రంగం(లైఫ్ సైన్సెస్)లోని పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు, విధాన రూపకర్తలను ఒక వేదికపైకి తీసుకొచ్చే బయో ఏషియా సదస్సుకు రంగం సిద్ధమైంది. 22వ బయో ఏషియా సదస్సు ఈ నెల 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా జరగనుంది. 50 దేశాలకు చెందిన దాదాపు 3,000 మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మిగతా 12వ పేజీలో...

గత వారం ఏం పని చేశారు?

రెండ్రోజుల్లోగా 5 పాయింట్లలో జవాబివ్వండి


అలా ఇవ్వకపోతే రాజీనామాగా పరిగణిస్తాం

అమెరికా ఫెడరల్ ఉద్యోగులకు మస్క్ మెయిల్

చట్టవిరుద్ధంగా తొలగిస్తే సవాలు చేస్తాం

అమెరికా ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నేతలు

ఎఫ్‌బీఐ ఉద్యోగులెవరూ స్పందించొద్దు: కాశ్



వాషింగ్టన్, ఫిబ్రవరి 23: అమెరికాలో ప్రభుత్వ ఉద్యోగులకు ఎలాన్ మస్క్ షాక్ ఇచ్చారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న మస్క్.. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించే విషయంలో దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే దాదాపు 20 లక్షల మందికి పైగా ఫెడరల్ ఉద్యోగులకు ఈ-మెయిల్స్ పంపారు. గడిచిన వారం రోజుల్లో ఎవరెవరు ఏం పని చేశారనే వివరాలను ఐదు బుల్లెట్ పాయింట్ల రూపంలో తెలియజేయాలని 'యూఎస్ ఆఫీస్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (ఓపీఎం)' నుంచి శనివారం పంపిన మెయిల్‌లో ఆదేశించారు. సవివరమైన

మిగతా 2వ పేజీలో...



త్వరలో భారత్, చైనాపై పరస్పర సుంకాలు

2

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పునరుద్ఘాటన

విదేశీ నేరస్థులను సాగనంపుతున్నామని వ్యాఖ్య



సీసీ టీవీ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య

ఎస్ఎంఎస్‌తో హాల్‌టికెట్

క్యూఆర్ కోడ్‌తో పరీక్ష కేంద్రం వివరాలు

పరీక్షలన్నీ సీసీ కెమెరాల నిఘాలో.. ఫిర్యాదుల స్వీకరణకు హెల్ప్‌డెస్క్

ఫోన్ నంబర్: 9240205555.. ఇంటర్ పరీక్షల్లో కొత్త సంస్కరణలు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణలో ఎదురవుతున్న పలు ఇబ్బందులు, సమస్యలను టెక్నాలజీతో పరిష్కరించేందుకు సిద్ధమైనట్లు ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించడంతోపాటు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. ఉదాహరణకు.. ఇప్పటిదాకా హాల్‌టికెట్లను ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ నుంచే డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉండేది. అయితే డౌన్‌లోడ్ తేదీ ప్రకటించినప్పుడు ఒకేసారి ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు డౌన్‌లోడ్‌కు ప్రయత్నించడంతో సాంకేతిక సమస్యలు వచ్చేవి. ఇకపై ఆ ఇబ్బంది లేకుండా నేరుగా ఇంటర్ బోర్డు నుంచి విద్యార్థుల మొబైల్‌కు ఎస్ఎంఎస్ లింక్ పంపి.. దానిపై క్లిక్ చేస్తే హాల్‌టికెట్

మిగతా 14వ పేజీలో...

రాజలింగమూర్తి హత్య

భూ వివాదాలతోనే..

వీడిన సామాజిక కార్యకర్త హత్యకేసు మిస్టరీ

10 మంది నిందితులు.. ఏడుగురి అరెస్టు

నిందితుల్లో బీఆర్ఎస్ నాయకుడు హరిబాబు

అతనితో సహా పరారీలో ముగ్గురు నిందితులు

భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే వెల్లడి

3



విలేకరులతో మాట్లాడుతున్న మృతుడి భార్య సరళ

నా భర్త హత్య 'కాళేశ్వరం' కేసు వల్లే..

3

ఇందులో బీఆర్ఎస్ నేతల ప్రమేయముంది

కేసీఆర్, కేటీఆర్ హస్తం కూడా ఉండొచ్చు

రాజలింగమూర్తి భార్య సరళ ఆరోపణలు

కర్ణాటకకు ఆర్టీసీ బస్సులు పంపేది లేదు

» మహారాష్ట్ర మంత్రి ప్రతాప్ సర్‌నాయక్

బెంగళూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కర్ణాటకకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడిపేది లేదని మహారాష్ట్ర రవాణాశాఖ మంత్రి ప్రతాప్ సర్‌నాయక్ స్పష్టం చేశారు. బెళగావిలో కేఎస్‌ఆర్టీసీ బస్సు కండక్టర్‌పై మరాఠీల దాడి తర్వాత తలెత్తిన వివాదం నేపథ్యంలో... ఆదివారం ముంబైలో మహారాష్ట్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. కర్ణాటక ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకునే వరకు బస్సు సర్వీసులను పంపేది లేదన్నారు. శుక్రవారం చిత్రదుర్గలో మహారాష్ట్ర ఆర్టీసీ డ్రైవర్‌కు మసిపూసిన అంశాన్ని ప్రస్తావించారు. మహారాష్ట్ర నుంచి కర్ణాటకకు వెళ్లే బస్సులు, డ్రైవర్, కండక్టర్లపై దాడిని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. ముందస్తు జాగ్రత్తగా బస్సు సర్వీసులు ఆపేశామన్నారు. రెండు రాష్ట్రాల మధ్య పరిస్థితి ఉద్రిక్తంగా ఉండడంతో బస్సు సేవలు తాత్కాలికంగా నిలిపివేశారు.

రాజీనామాకు సిద్ధం: కర్ణాటక హోంమంత్రి

బెంగళూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాయకత్వ మార్పు అంశం చర్చకు వస్తున్న తరుణంలోనే కర్ణాటక హోం మంత్రి పరమేశ్వర్ సంచలన ప్రకటన చేశారు. తుమకూరులో ఆదివారం కార్యకర్తలను ఉద్దేశించి హోం మంత్రి మాట్లాడుతూ.. 'మీరు పెద్ద మనసుతో నా రాజీనామా కోరితే అందుకు సిద్ధమన్నా'రు. ఇటీవల నియోజకవర్గంలో కార్యకర్తలు, ప్రజలతో తగిన సమయం కేటాయించేందుకు సాధ్యం కావడం లేదన్నారు. ఇందుకు క్షమాపణ కోరుతున్నానన్నారు. 'మీరు కోరితే హోం మంత్రి పదవికి రాజీనామా చేస్తా' అన్నారు. మూడు రోజుల క్రితం ఢిల్లీ వెళ్లి వచ్చిన పరమేశ్వర్ కీలకమైన హోం మంత్రి పదవికి రాజీనామా చేస్తాననడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

నేడు పీఎం కిసాన్ నిధుల విడుదల

న్యూఢిల్లీ, ఫిబ్రవరి23: పీఎం కిసాన్ నిధులు నేడు విడుదల కానున్నాయి. బిహార్ భాగల్పూర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 19వ విడత కింద రూ.22 వేల కోట్ల నిధులను విడుదల చేస్తారు. రైతన్నలకు ఏడాదిలో ఒక్కో విడత రూ.2 వేల చొప్పున మూడు విడతల్లో మొత్తం రూ.6 వేల సాయం అందించే ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2019 ఫిబ్రవరి 24న ప్రారంభించింది. ఇప్పటివరకు 11 కోట్ల మంది అన్నదాతలకు 18 వాయిదాల్లో రూ.3.46 లక్షల కోట్లను చెల్లించారు. ఈ పథకం ద్వారా మొత్తం 18 విడతల్లో తెలంగాణలో 30,77,426 మంది రైతన్నలకు రూ.627 కోట్లు చెల్లించారు.

పాక్ నుంచి బంగ్లాకు 50వేల టన్నుల బియ్యం

బంగ్లాదేశ్ ఏర్పడ్డ తర్వాత పాక్‌తో ప్రత్యక్ష వాణిజ్యం ఇదే తొలిసారి

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 23: పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల మధ్య ప్రత్యక్ష వాణిజ్య సంబంధాలు చిగురించాయి. 1971లో పాక్, బంగ్లాదేశ్‌లు విడిపోయిన అనంతరం మొదటిసారిగా ఈ దేశాల మధ్య ప్రత్యక్ష వాణిజ్యం ప్రారంభమైంది. ట్రేడింగ్ కార్పొరేషన్ ఆఫ్ పాకిస్థాన్ (టీసీపీ) ద్వారా 50వేల టన్నుల పాకిస్థాన్ బియ్యాన్ని కొనేందుకు ఈ నెల ప్రారంభంలో బంగ్లాదేశ్ అంగీకరించడంతో కుదిరిన ఒప్పందం ఇందుకు దారితీసింది. ఈ ఒప్పందం మేరకు ప్రభుత్వం ఆమోదించిన మొదటి కార్గో.. శనివారం కరాచీలోని పోర్ట్ ఖాసిమ్ నుంచి బంగ్లాదేశ్ పోర్ట్‌కు బయలుదేరింది. 1971లో తూర్పు పాకిస్థాన్ నుంచి విడిపోయి స్వతంత్ర దేశంగా బంగ్లాదేశ్ ఏర్పాటైంది. గత ఏడాది బంగ్లాదేశ్ ప్రధాని పదవి నుంచి షేక్ హసీనా తప్పుకోవడంతో యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైన విషయం తెలిసిందే. ఈ ప్రభుత్వం పాకిస్థాన్‌తో వాణిజ్య సంబంధాలకు చేతులు చాచడంతో పాక్ సానుకూలంగా స్పందిస్తోందంటున్నారు.

'గిరిజన అట్లాస్'ను రూపొందించండి: కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: 'గిరిజన అట్లాస్'ను రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను కోరింది. ప్రతి గిరిజన గ్రామంలో వారి జనాభా, సంస్కృతి, ఎంత భూమి సాగు చేస్తున్నారు, అటవీ ఉత్పత్తుల సేకరణకు ఎంతదూరం వెళుతున్నారు తదితర వివరాలను ఈ అట్లాస్‌లో పొందుపరచాలని సూచించింది. భూమి హక్కు కోసం చేసుకున్న దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో కేంద్రం ఈ సూచన చేసింది. అధికార వర్గాల సమాచారం ప్రకారం.. ఫిబ్రవరి 1 నాటికి దరఖాస్తుదారుల్లో 48.95 శాతం మందికి భూ హక్కు కల్పించారు. 36.43 దరఖాస్తులను తిరస్కరించగా.. 14.62% అపరిష్కృతంగా ఉన్నాయి. ఒడిసా 2018లోనే ఈ అట్లాస్‌ను రూపొందించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు విగతా రాష్ట్రాలు తయారుచేయాల్సి ఉంది.

శ్రీలంక జలాల్లో 32 మంది భారత జాలర్ల అరెస్ట్

కొలంబో, ఫిబ్రవరి 23: శ్రీలంక ప్రాదేశిక జలాల్లోకి అక్రమంగా ప్రవేశించారనే ఆరోపణలతో 32 మంది భారత జాలర్లను ఆదివారం ఆ దేశ నౌకాదళ అధికారులు అరెస్ట్ చేశారు. జాలర్లు వాడిన ఐదు పడవలను స్వాధీనం చేసుకున్నారు. శ్రీలంక జలాల్లోకి విదేశీ మత్స్యకార పడవలు రాకుండా నిరోధించేందుకు తరచూ నిర్వహించే ఆపరేషన్‌లో భారత జాలర్లు పట్టుబడినట్టు ఆ దేశ నౌకాదళం ఓ ప్రకటనలో తెలిపింది. అరెస్టయిన జాలర్లతో పాటు పడవలను శ్రీలంకలోని తలైమన్నార్ ఓడరేవుకు తరలించినట్టు వెల్లడించింది. భారత్, శ్రీలంక సంబంధాల్లో జాలర్ల అంశం వివాదాస్పదంగా మారుతోంది. ఈ ఏడాది శ్రీలంక జలాల్లోకి ప్రవేశించిన 131 మంది భారత జాలర్లను అరెస్ట్ చేసి, 18 పడవలను స్వాధీనం చేసుకున్నారు. 2024లో శ్రీలంక నౌకాదళం మొత్తం 529 మంది భారత జాలర్లను అరెస్ట్ చేసింది.

జేఈఈ మెయిన్ పేపర్ 2 ఫలితాలు విడుదల


» ఆర్కిటెక్చర్‌లో తెలంగాణ టాపర్‌గా సాకేత్ వేంపల్లి

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గత నెలలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్వహించిన జేఈఈ మెయిన్ పేపర్ 2 (బి-ఆర్కిటెక్చర్, బి-ప్లానింగ్) ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. మహారాష్ట్ర విద్యార్థి నీల్ సందేశ్ 100పర్సంటైల్‌తో బి-ఆర్కిటెక్చర్‌లో ఆలిండియా టాపర్‌గా నిలువగా.. తెలంగాణకు చెందిన సాకేత్ వేంపల్లి 99.9796122 పర్సంటైల్‌తో స్టేట్ టాపర్‌గా నిలిచారు. అలాగే బి-ప్లానింగ్‌లో మధ్యప్రదేశ్ విద్యార్థిని సునిధి సింగ్ 100పర్సంటైల్‌తో ఆలిండియా టాపర్‌గా నిలువగా.. తెలంగాణకు చెందిన మున్నూరునాయక్ అభ్యకౌటిల్య 99.7042375 పర్సంటైల్‌తో రాష్ట్ర టాపర్‌గా నిలిచారు. గత నెల 30న జరిగిన ఆర్కిటెక్చర్ పరీక్షకు దేశవ్యాప్తంగా 44,144 మంది, ప్లానింగ్ పరీక్షకు 18,596 మంది హాజరయ్యారు.

పాలస్తీనా వెస్ట్ బ్యాంక్‌లోకి ఇజ్రాయెల్ ట్యాంకులు

జెనిన్ (వెస్ట్‌బ్యాంక్), ఫిబ్రవరి 23: పాలస్తీనా, ఇజ్రాయెల్‌ల మధ్య మళ్లీ యుద్ధం కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. గాజా ప్రాంతంలో కాల్పుల విరమణ కుదిరినప్పటికీ, తాజాగా పాలస్తీనా ఆధీనంలోని వెస్ట్ బ్యాంక్‌లో యుద్ధం ఆరంభమయ్యే పరిస్థితులు ఉన్నాయి. ఆదివారం ఇజ్రాయెల్‌కు చెందిన యుద్ధ ట్యాంకులు వెస్ట్‌బ్యాంక్‌లోని జెనిన్‌కు వెళ్లాయి. 2002 తరువాత ఇజ్రాయెల్ ట్యాంకులు వెస్ట్‌బ్యాంక్‌కు వెళ్లడం ఇదే ప్రథమం. ఈ ఏడాదంతా దళాలు అక్కడే ఉంటాయని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇస్రాయెల్ కాట్జ్ ప్రకటించడం ప్రాధాన్యతను సంతరించుకొంది. గాజాలో కాల్పుల విరమణ ప్రకటించిన రెండు రోజులకే జనవరి 21న వెస్ట్‌బ్యాంక్ ఉత్తర ప్రాంతంలో దాడులు ప్రారంభించింది. ఇక్కడ సుమారు 40వేల మంది శరణార్థులు తలదాచుకుంటున్నారు.

ఢిల్లీ అసెంబ్లీ ప్రతిపక్ష నేతగా అతిశీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా మాజీ సీఎం అతిశీ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఆప్ శాసనసభాపక్ష భేటీలో పార్టీ ఎమ్మెల్యేలంతా ఈ మేరకు ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. ఎమ్మెల్యే సంజీవ్ ఝా.. అతిశీ పేరును ప్రతిపాదించగా, మిగిలిన వారంతా మద్దతు తెలిపారు. ఢిల్లీ ప్రతిపక్ష నేత ఒక మహిళ ఎన్నికవ్వడం ఇదే తొలిసారి. తనను నమ్మి, తనకు ఈ కీలక బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్‌కు, పార్టీ ఎమ్మెల్యేలకు అతిశీ ధన్యవాదాలు తెలిపారు. కాగా, మూడు రోజుల పాటు జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. కాగా, ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 70 స్థానాల్లో 48 స్థానాలు గెలుపొంది బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

గత వారం ఏం పని చేశారు?

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం, లింకులు లేదా అటాచ్‌మెంట్లు పంపొద్దని స్పష్టం చేశారు. సోమవారం రాత్రి 11.59 గంటల్లోపు సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. జవాబు ఇవ్వడంలో విఫలమైన వారిని రాజీనామా చేసినట్లుగానే పరిగణిస్తామని మస్క్ తేల్చిచెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆకాంక్షలకు అనుగుణంగానే ఈ ఆదేశాలు జారీ చేసినట్లు శనివారం మధ్యాహ్నం సోషల్ మీడియాలో వెల్లడించారు. ప్రత్యేక ప్రభుత్వ అధికారిగా, అధ్యక్షుడి సలహాదారుగా ఉన్న మస్క్‌కు ఫెడరల్ ఉద్యోగులను తొలగించే అధికారాలేమీ లేవని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. అమెరికాకు చెందిన అతి పెద్ద ఉద్యోగ సంఘం అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ జాతీయ అధ్యక్షుడు ఎవెరెట్ కెల్లీ దీనిపై స్పందిస్తూ.. ట్రంప్ తీసుకుంటున్న చర్యలు ఫెడరల్ ఉద్యోగుల పట్ల, దేశ ప్రజలకు అందించే క్లిష్టమైన సేవల పట్ల ఆయనకు ఉన్న అయిష్టతను సూచిస్తున్నాయని చెప్పారు. మస్క్ పంపిన మెయిల్ చాలా క్రూరమైందన్నారు. ఆయన ఆదేశాలతో ప్రభుత్వం చట్టవిరుద్ధమైన తొలగింపులకు పాల్పడితే వాటిని సవాలు చేస్తామని స్పష్టం చేశారు. తన జీవితంలో ఒక్కసారి కూడా నిజాయతీగా ప్రజలకు సేవ చేయని మస్క్‌తో తమ ఉద్యోగులకు విధుల గురించి చెప్పించడం అంటే వారిని అగౌరవపరచడమేనని పేర్కొన్నారు. మరోవైపు, మస్క్ నేతృత్వంలోని డోజ్ విభాగానికి ప్రత్యేక అధికారాలిస్తూ కార్యనిర్వాహక ఆదేశాలపై ట్రంప్ సంతకం చేశారు. ప్రతి ఏజెన్సీ ఉద్యోగుల తగ్గింపునకు ప్రణాళికలు చేపట్టాలని, అవసరమైన మేరకే నియామకాలు చేపట్టాలని అందులో పేర్కొన్నారు. అనంతరం డోజ్ పనితీరును ట్రంప్ ప్రశంసించారు.



మస్క్ చాలా మంచి పనిచేస్తున్నారని కొనియాడారు. ఆయన మరింత దూకుడుగా ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నట్లు వ్యాఖ్యానించారు. కాగా, 'ఈ వారంలో మీరేం పని చేశారు?' అనే ప్రశ్న మస్క్ తన సంస్థల్లో పనిచేసే ఉద్యోగులను కూడా అడిగారు. 2022లో ట్విటర్‌ను కొనుగోలు చేసేముందు ఆ సంస్థ సీఈవో పరాగ్ అగర్వాల్‌కు ఇదే ప్రశ్నను సంధించారు. అనంతరం ఆయన్ను సీఈవో పదవి నుంచి తప్పించిన సంగతి తెలిసిందే.

స్పందించనక్కర్లేదు: కాశ్ పటేల్

మస్క్ పంపిన మెయిల్‌పై ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ)కు 9వ డైరెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన కాశ్ పటేల్ భిన్నంగా స్పందించారు. ఆ మెయిల్‌కు స్పందించవద్దని ఎఫ్‌బీఐ సిబ్బందికి స్పష్టం చేశారు. "ఏం పనిచేస్తున్నారో తెలియజేయాలంటూ ఓపీఎం నుంచి ఎఫ్‌బీఐ ఉద్యోగులకూ మెయిల్ వచ్చి ఉండొచ్చు. ఎఫ్‌బీఐ నిబంధనల ప్రకారం ప్రస్తుతం దర్యాప్తు సంస్థలో సమీక్షల ప్రక్రియ జరుగుతోంది. ఏదైనా సమాచారం అవసరమైతే మేమే స్పందిస్తాం. ప్రస్తుతానికి ఉద్యోగులెవరూ మస్క్ మెయిల్‌కు జవాబు ఇవ్వాల్సిన అవసరం లేదు" అని కాశ్ ఎఫ్‌బీఐ ఉద్యోగులకు సందేశం పంపారు. అలాగే జాతీయ భద్రతా సంస్థ (ఎన్ఎస్ఏ) కూడా.. తాము తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ఎవరూ మస్క్ మెయిల్‌కు స్పందన తెలియజేయనక్కర్లేదని ఉద్యోగులకు సందేశం ఇచ్చింది.

ఓటింగ్ శాతం పెంపునకు.. యూఎస్‌ఎయిడ్ నిధులివ్వలే

» కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నివేదిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్(యూఎస్ఎయిడ్) భారత్‌లో ఓటింగ్ శాతం పెంపునకు ఎలాంటి నిధులు ఇవ్వలేదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అయితే.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఏడు ప్రాజెక్టులకు సహాయం చేసిందని ఓ నివేదికలో వెల్లడించింది. వ్యవసాయం-ఆహారభద్రత కార్యక్రమాలు, తాగునీరు-పారిశుద్ధ్యం-పరిశుభ్రత(వాష్), పునరుత్పాదక ఇంధన శక్తి, విపత్తు నిర్వహణ-ఆరోగ్యం, సుస్థిర అడవులు-వాతావరణ కార్యక్రమాలు, ఆవిష్కరణలపై భారత్ రూ.6,498 కోట్ల(750 మిలియన్ డాలర్లు) అంచనా వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టులకు యూఎస్ఎయిడ్ నుంచి రూ.825 కోట్లు(97 మిలియన్ డాలర్లు) అందినట్లు ఆ నివేదిక స్పష్టంచేసింది. కాగా.. భారత్‌లో ఓటింగ్ శాతం పెంచేందుకు యూఎస్ఎయిడ్ ద్వారా రూ.182 కోట్లు(21 మిలియన్ డాలర్లు) ఇచ్చినట్లు ట్రంప్ ఆరు రోజులుగా ఆరోపిస్తున్నారు.

లోకం తీరు



అవినీతి కేసుల్లో ప్రాథమిక విచారణ

తప్పనిసరి కాదు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: అవినీతి నిరోధక చట్టం కింద సంబంధిత కేసులో ప్రాథమిక విచారణ తప్పనిసరి కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నిందితులుగా ఉన్నవారు ప్రతికేసులోనూ ప్రాథమిక విచారణ కోరే హక్కు లేదని పేర్కొంది. అవినీతి నిరోధక చట్టం కింద నమోదైన కేసులు సహా మరికొన్ని కేసుల్లో ప్రాథమిక విచారణ అవసరమే అయినప్పటికీ క్రిమినల్ కేసులు నమోదైనప్పుడు ఇలాంటి విచారణ తప్పనిసరికాదని తెలిపింది. అదేవిధంగా సంబంధిత కేసుల్లో అందిన సమాచారాన్ని నిర్ధారించుకునేందుకు కూడా ప్రాథమిక విచారణ అవసరం లేదని, అయితే.. సదరు సమాచారం గుర్తించదగిన నేరం అవునో కాదో నిర్ధారించుకునేందుకు మాత్రమే ఉపయోగపడుతుందని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం కర్ణాటక లోకాయుక్త నమోదు చేసిన కేసు విచారణ సందర్భంగా ఈ నెల 17న ఇచ్చిన తీర్పులో వెల్లడించింది. కర్ణాటక హైకోర్టు వ్యవహరించిన తీరుపై ధర్మాసనం ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేసింది. కర్ణాటక లోకాయుక్త పోలీసు స్టేషన్‌లో ఓ ప్రభుత్వ ఉద్యోగిపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదైంది. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని పేర్కొంటూ ఎస్పీ ఆదేశాల మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే.. ప్రాథమిక విచారణ జరపకుండానే ఎఫ్ఐఆర్‌ను కట్టారంటూ కర్ణాటక హైకోర్టు గత ఏడాది మార్చిలో ఈ కేసును కొట్టివేసింది. హైకోర్టు చర్యను సవాల్ చేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ సందర్భంగా అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి, ఎఫ్ఐఆర్ కట్టే ముందు ప్రాథమిక విచారణ తప్పనిసరా? కాదా? అనే విషయాన్ని సుప్రీంకోర్టు పరిశీలించింది. నిందితుడిపై ఎఫ్ఐఆర్‌ను కొనసాగిస్తూ తీర్పు వెలువరించింది.

త్వరలో భారత్, చైనాపై పరస్పర సుంకాలు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పునరుద్ఘాటన



వాషింగ్టన్, ఫిబ్రవరి 23: భారత్, చైనా వంటి దేశాలపై త్వరలో పరస్పర సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. గతవారం ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా తాను చెప్పిన విషయాన్ని శుక్రవారం వాణిజ్య శాఖ కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పునరుద్ఘాటించారు. ఏ కంపెనీ అయినా, ఏ దేశమైనా అమెరికా వస్తువులపై ఎంతెంత సుంకాలు విధిస్తున్నాయో తాము కూడా అదే స్థాయిలో సుంకాలు విధించనున్నట్లు తెలిపారు. కొత్తగా పదవిలోకి వచ్చిన హోవార్డ్ దీనికి బాధ్యత వహించబోతున్నారని తెలిపారు. తాము న్యాయంగా ఉండాలని భావిస్తున్నామని, అందుకే 'పరస్పరం' అంటున్నామని చెప్పారు. మరోవైపు, అక్రమ వలసదారుల గురించి ట్రంప్ మాట్లాడుతూ... వారి వెళ్లగొట్టి దేశంలో పేరుకుపోయిన బురదను కడిగేయడానికి కృషి చేస్తున్నామని వ్యాఖ్యానించారు.

భారత్‌కు మరో 12 మంది వలసదారులు

తగిన అధికారిక పత్రాలు లేవన్న కారణంతో మరో 12 మంది భారతీయులను అమెరికా తిప్పి పంపించింది. వారు ఆదివారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్నారు. అక్రమ వలసదార్లు అన్న పేరుతో తొలుత అమెరికా ప్రభుత్వం 299 మంది భారతీయులను పనామా పంపించింది. అందులో 171 మంది తిరిగి వచ్చేందుకు అంగీకరించారు. వారిలో ప్రస్తుతం 12 మంది స్వదేశానికి వచ్చారు.

మేం మాట్లాడితే ప్రజాస్వామ్యానికి ముప్పా: మెలోనీ

ప్రపంచ వ్యాప్తంగా ఉదారవాదులు ద్వంద్వ ప్రమాణాలతో వ్యవహరిస్తున్నారని ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆరోపించారు. భారత ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్, అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలీ వంటి నాయకులు కొత్త ప్రపంచ సంప్రదాయవాద ఉద్యమాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని నొక్కిచెప్పారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వామపక్షాలు ఆందోళనలో ఉన్నాయని, ట్రంప్ విజయంతో వారి చిరాకు ఉన్మాదంగా మారిందని ఎద్దేవా చేశారు. 90వ దశకంలో టోనీ బ్లెయిర్, బిల్ క్లింటన్‌లు వామపక్ష ఉదారవాద నెట్‌వర్క్‌ను సృష్టించినప్పుడు ఉదారవాదులు వారిని రాజనీతిజ్ఞులుగా పిలిచేవారని మెలోనీ గుర్తుచేశారు. ఇప్పుడు మాత్రం మోదీ, ట్రంప్, మెలోనీ మాట్లాడితే ప్రజాస్వామ్యానికి ముప్పుగా పేర్కొంటున్నారని మండిపడ్డారు.

మయన్మార్ సైబర్ నేర కేంద్రాల నుంచి

162 మందికి విముక్తి

» ఇందులో తెలంగాణ, ఏపీ వారు 18 మంది



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మయన్మార్‌లో సైబర్ నేరాలకు పాల్పడే చైనా ముఠాల వద్ద బందీలుగా చిక్కుకున్న 162 మంది భారతీయులకు విముక్తి లభించింది. భారత అధికారుల ఒత్తిడితో స్పందించిన మయన్మార్ అధికారులు వారిని విడిపించారు. మయన్మార్ అధికారులు రక్షించిన వారిలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన వారు 18 మంది ఉన్నారు. పెద్ద మొత్తంలో జీతం వచ్చే ఉద్యోగమంటూ ఎర వేసి చైనా సైబర్ నేరాల ముఠాలు రిక్రూట్‌మెంట్ ఏజెన్సీల ద్వారా యువతను తరలిస్తున్నాయి. గోల్డెన్ ట్రయాంగిల్‌గా పిలవబడే మయన్మార్, లావోస్, థాయ్‌లాండ్, కంబోడియాలోని ప్రాంతాల్లో ఉన్న తమ స్థావరాలకు వారిని తీసుకెళ్లి బలవంతంగా సైబర్ నేరాలు చేయిస్తున్నాయి. గోల్డెన్ ట్రయాంగిల్ ప్రాంతాల్లో వెయ్యిమందికి పైగా భారతీయ యువకులు బందీలుగా ఉన్నట్టు సమాచారం. ఇలా ఓ ముఠా వద్ద బందీగా ఉన్న కరీంనగర్ జిల్లా రంగాపేటకు చెందిన కొక్కిరాల మధుకర్ రెడ్డి.. తమను రక్షించమంటూ ఇటీవల తన కుటుంబసభ్యులకు అతికష్టం మీద ఓ ఆడియో సందేశం పంపాడు. మయన్మార్‌లోని ఓ ప్రాంతంలో తమని బంధించి ఫోన్లు లాక్కొని సైబర్ నేరాలు చేయిస్తున్నారని తెలిపాడు. తామున్న ప్రాంతానికి సంబంధించిన లొకేషన్ కూడా షేర్ చేసి తమను విడిపించేందుకు ప్రయత్నించాలని కోరాడు. అతని కుటుంబసభ్యులు అధికారులను సంప్రదించగా విదేశీ వ్యవహారాల శాఖ అప్రమత్తమైంది. భారత ఎంబసీ వినతితో స్పందించిన మయన్మార్ అధికారులు మయన్మార్‌లోని మైవాడీ, మైయింగ్ ప్రాంతాల్లో సోదాలు చేసి 162 మందిని విడిపించారు.

నూనె వాడకం తగ్గించండి

ఊబకాయం సమస్య నివారణకు అదే చిట్కా

» మన్ కీ బాత్‌లో ప్రధాని నరేంద్ర మోదీ

» 'ఊబకాయం'పై సందేశాలు పంపిన నీరజ్ చోప్రా, నిఖత్ జరీన్‌కు ప్రశంస

న్యూఢిల్లీ, ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 23: ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న ఊబకాయం సమస్య నివారణకు ప్రధాని మోదీ ఓ చిట్కా చెప్పారు. ఆహారంలో నూనె వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ప్రతి నెలా చివరి ఆదివారం ఆకాశవాణిలో ప్రసారమయ్యే 'మన్ కీ బాత్' కార్యక్రమంలో భాగంగా ఈ ఆదివారం 119వ సంచికలో ఆయన ప్రసంగించారు. ఊబకాయంపై క్రీడాకారులు బాక్సర్ నిఖత్ జరీన్, జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా పంపిన సందేశాలను వినిపించి వారిని అభినందించారు. అలాగే, గిరిజన భాష పరిరక్షణకు ఆదిలాబాద్‌కు చెందిన తొడసం కైలాశ్ అనే ఉపాధ్యాయుడు చేస్తున్న కృషిని ప్రత్యేకంగా కొనియాడారు. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ రోజు తన సోషల్ మీడియా ఖాతాల బాధ్యతను దేశంలోని స్ఫూర్తిదాయక మహిళలకు అప్పగిస్తానని ప్రకటించారు. ఊబకాయంపై ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "పది శాతం నూనె వాడకం తగ్గించండి. ఆ విషయం పది మందికి చెప్పండి. ఆ పది మంది ఇంకో పది మందికి సవాల్ విసరాలి. ఇలా నూనె వాడకాన్ని తగ్గించాలి. ఇందుకోసం ప్రతి నెలా వంట నూనె కొనుగోలు చేసేటప్పుడే ఎప్పటికంటే పది శాతం తక్కువగా కొనుగోలు చెయ్యాలి. ఒలింపిక్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా మాదిరిగా ఆరోగ్య సంరక్షణకు ఆహార నియమావళిని పాటించాలి. ఆరోగ్యవంతమైన దేశ నిర్మాణంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి" అని అన్నారు. ఊబకాయం ఆందోళనకరమైన సమస్య అని, నూనె వాడకాన్ని తగ్గించాలని నీరజ్ చోప్రా, నిఖత్ జరీన్ తమ సందేశాల్లో పిలుపునిచ్చారు. మరోవైపు, విద్యార్థులకు ప్రధాని మోదీ సందేశం ఇస్తూ.. "జాతీయ సైన్స్ దినోత్సవం (28వ తేదీ) సందర్భంగా ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు పరిశోధనా లేబొరేటరీలు, ప్లానిటోరియాలను, అంతరిక్ష కేంద్రాలను సందర్శించి.. ఒకరోజు శాస్త్రవేత్తగా గడపాలి. పుస్తక పరిజ్ఞానానికి అతీతంగా ప్రాక్టికల్ పరిజ్ఞానం పెంచుకోవాలి" అని అన్నారు.

తొడసం కైలాశ్ శభాష్



ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు తొడసం కైలాశ్ గిరిజన భాష పరిరక్షణకు చేస్తున్న కృషిని ప్రధాని ఈ సందర్భంగా కొనియాడారు. గిరిజన మాండలికం పరిరక్షణకు, 'కొలామి' భాషలో గీతానికి స్వరరచన చేసేందుకు కైలాశ్ ఏఐని వినియోగించారని ప్రశంసించారు. ఏఐ వినియోగం భారత్ మరింత పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. తొడసం కైలాస్.. మహాభారత్ పుస్తకాన్ని కేవలం 3నెలల్లో గోండు భాషలోకి అనువదించారు. రామకృష్ణ మఠం వారు ఐదు సంపుటాల్లో వెలువరించిన బాలల మహా భారతాన్ని కూడా గోండులోకి అనువదించారు. గోండు భాషలో ఒక యూట్యూబ్ చానెల్ కూడా నడుపుతున్నారు.



ఛత్తర్‌పూర్‌లోని బాలాజీ గుడిలో మోదీ పూజలు

హిందువులపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

చూస్తున్నారని మండిపడ్డారు. మహాకుంభమేళా నిర్వహణ ప్రతి ఒక్కరినీ విస్మయానికి గురిచేస్తోందన్నారు. ఇది భావి తరాలకు ఐక్యతాచిహ్నంగా నిలుస్తుందని తెలిపారు. 'హిందూ విశ్వాసాన్ని ద్వేషించేవారు శతాబ్దాలుగా అక్కడక్కడా ఉంటూనే ఉన్నారు. వీరికి మద్దతివ్వడం ద్వారా విదేశీ శక్తులు కూడా మన దేశాన్ని, మతాన్ని బలహీనపరచాలని చూస్తున్నాయి. సమాజాన్ని విభజించి ఐక్యతను బద్దలు కొట్టడమే వారి ఎజెండా' అని మోదీ విమర్శించారు. కుంభమేళాలో తొక్కిసలాట ఘటనపై మమత, అఖిలేశ్, ఖర్గే విమర్శలు చేసిన నేపథ్యంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. మహాకుంభమేళాను విజయవంతం చేయడంలో పారిశుద్ధ్య కార్మికులు, పోలీసుల కృషి ఎనలేనిదన్నారు. వేల మంది వైద్యులు, వలంటీర్లు అంకిత భావంతో, సేవాస్ఫూర్తితో పనిచేస్తున్నారని కొనియాడారు.

ప్రస్తుతానికి కాంగ్రెస్‌లోనే ఉన్నా



తిరువనంతపురం, ఫిబ్రవరి 23: ప్రస్తుతానికి కాంగ్రెస్‌లోనే ఉన్నానని, తన సేవలను వినియోగించుకోకూడదని పార్టీ భావిస్తే గనుక తనకూ ప్రత్యామ్నాయాలు ఉన్నాయని కాంగ్రెస్ సీనియర్ ఎంపీ శశి థరూర్ తేల్చిచెప్పారు. అయితే, పార్టీ మారుతున్నట్టు వచ్చిన వార్తలను ఆయన ఖండించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను కలవడాన్ని, అలాగే, కేరళలోని వామపక్ష ప్రభుత్వ విధానాలను శశి థరూర్ ప్రశంసిస్తూ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన నేపథ్యంలో తాజాగా మలయాళం పోడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న కేరళలో కొత్త ఓటర్లను ఆకర్షించడం ద్వారా పార్టీని విస్తరించాలని పిలుపునిచ్చారు. లేనిపక్షంలో వరుసగా మూడోసారి కేరళలో ప్రతిపక్షంలోనే పార్టీ కూర్చోవాల్సి ఉంటుందని తేల్చిచెప్పారు. కేరళలో పార్టీకి నాయకత్వం లోపించిందనే తన అభిప్రాయాన్ని పార్టీలోని ఇతర నేతలూ సమర్థిస్తున్నారన్నారు. కేరళ సీఎం పదవికి తాను అర్హుడినని పునరుద్ఘాటించారు. స్వతంత్ర సంస్థలు నిర్వహించిన ఒపీనియన్ పోల్స్. కేరళ కాంగ్రెస్‌లో తననే ముందు వరుసలో నిలిపినట్టు చెప్పారు. కాగా, మోదీని, వామపక్ష ప్రభుత్వాన్ని ప్రశంసిస్తూ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన నేపథ్యంలో ఈనెల 18న ఢిల్లీలో పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని శశిథరూర్ కలిశారు.

బీజేపీని ఎలా ఎదుర్కొందాం?

» ఏఐసీసీ సమావేశాల్లో కార్యాచరణ.. ఏప్రిల్ 8, 9 తేదీల్లో కీలక భేటీలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: అధికార బీజేపీని ఎదుర్కొనే వ్యూహాలకు కాంగ్రెస్ పదును పెడుతోంది. ఏప్రిల్‌లో జరగనున్న ఏఐసీసీ కీలక సమావేశాల్లో దీనికి సంబంధించి నిర్దిష్ట కార్యాచరణ రూపొందించే దిశగా ఆ పార్టీ అడుగులు వేస్తోంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా ఏప్రిల్ 8, 9 తేదీల్లో ఏఐసీసీ కీలక సమావేశాలను నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. కేంద్రంలోని బీజేపీ సర్కారు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ఎదురయ్యే సవాళ్లు, రాజ్యాంగం, దాని విలువలపై ఆ పార్టీ చేస్తున్న దాడులను ఎదుర్కొనే వ్యూహాలపై ఈ సమావేశాల్లో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించింది. గతేడాది డిసెంబరులో కర్ణాటకలోని బెళగావిలో జరిగిన నవ సత్యాగ్రహ భేటీలో తీసుకున్న నిర్ణయాల మేరకు ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం 'ఎక్స్' వేదికగా తెలిపారు. ఏప్రిల్ 8న సీడబ్ల్యూసీ సమావేశం.. 9న ఏఐసీసీ ప్రతినిధుల సమావేశం ఉంటుందన్నారు. ఈ భేటీలకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షత వహిస్తారని.. పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, జాతీయ కార్యాలయ ఆఫీస్ బేరర్లు, ఏఐసీసీ ప్రతినిధులు, సీనియర్ నేతలు ఇందులో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సమావేశాలు దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ నేతలను ఒక్క చోటకు చేర్చే కీలక వేదికవుతాయన్నారు. అలాగే సామాన్యుల ఆందోళనలు పరిష్కరించడానికి, దేశానికి బలమైన ప్రత్యామ్నాయ దృష్టిని ప్రదర్శించడానికి.. కాంగ్రెస్ సామూహిక సంకల్పాన్ని చాటేందుకు దోహదపడతాయని వెల్లడించారు.



పొల్లాచ్చి రైల్వేస్టేషన్‌లో

హిందీ నేమ్ బోర్డుకు తారు

చెన్నై, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానం ద్వారా హిందీని నిర్బంధంగా అమలు చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ తమిళనాడు రాష్ట్రం పొల్లాచ్చిలో డీఎంకే న్యాయవిభాగం సభ్యులు ఆదివారం ఆందోళన చేపట్టారు. పొల్లాచ్చి రైల్వే స్టేషన్ నేమ్‌బోర్డులో హిందీ భాషలో ఉన్న స్టేషన్ పేరుకు తారుపూశారు. ఆ తర్వాత రైల్వేస్టేషన్ ఎదుట నిలిచి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డీఎంకే కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసుకుంటూ వెళ్లిపోయిన పావుగంట కల్లా రైల్వే అధికారులు హిందీ తెలిసిన పెయింటర్‌ను తీసుకువచ్చి నేమ్‌బోర్డుపై తారుపూసిన చోట పసుపురంగు పెయింట్ పూసి, ఆ చోట మళ్లీ హిందీలో స్టేషన్ పేరు రాయించారు.

గ్రీన్ ఫీల్డ్‌పై మెట్రో రైల్!

అత్యాధునిక ఫ్యూచర్‌సిటీ కారిడార్.. భూమిపై 18 కి.మీ., భూగర్భంలో 2 కి.మీ.

- ఔటర్ రింగ్‌రోడ్డు వెంట 14 కి.మీ. మార్గం
- వచ్చే నెలాఖరులోగా పార్ట్-బీ కారిడార్ల డీపీఆర్


ప్రతిపాదిత మార్గంలో భూములను పరిశీలిస్తున్న ఎన్వీఎస్ రెడ్డి, ఇంజనీర్లు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైలు రెండో దశ విస్తరణలో కీలకమైన స్కిల్ యూనివర్సిటీ(ఫోర్త్‌సిటీ) కారిడార్‌ను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించాలని భావిస్తోంది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి 40 కిలోమీటర్ల మార్గాన్ని కేవలం 40 నిమిషాల్లో చేరుకునే విధంగా ప్రాజెక్టును నిర్మించనున్నారు. ఈ మార్గంలో 18 కిలోమీటర్లు గ్రీన్‌ఫీల్డ్‌లో భూమిపై(ఎట్‌గ్రేడ్)నే రైలు వెళ్లేవిధంగా డిజైన్ చేస్తున్నారు. మొత్తం 40 కిలోమీటర్లలో దాదాపు సగ భాగం సాధారణ రైలు మాదిరిగా భూతలంపై మెట్రో పరుగులు తీయడం ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. మరోవైపు 1,000-1,500 ఎకరాల ప్రభుత్వ భూమిలో అంతర్జాతీయ స్థాయి హబ్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మెట్రో పార్ట్-ఏలోని 5 కారిడార్లకు సంబంధించిన డీపీఆర్‌ను హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్(హెచ్ఏఎంఎల్) నాలుగు నెలల క్రితమే కేంద్ర ప్రభుత్వానికి పంపించగా.. దీనిపై అధికారులు అధ్యయనం చేస్తున్నారు. అయితే రెండో దశలో ప్రతిపాదించిన శంషాబాద్ ఎయిర్‌పోర్టు-స్కిల్‌వర్సిటీ(40 కిలోమీటర్లు), జేబీఎస్-మేడ్చల్(24 కిలోమీటర్లు), జేబీఎస్-శామీర్‌పేట(21 కిలోమీటర్లు) డీపీఆర్ తయారీపై హెచ్ఏఎంఎల్ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తోంది. భూసేకరణ సమస్యలు ఎక్కడున్నాయి? స్టేషన్లను ఎక్కడ ఏర్పాటు చేయాలి? ఎలివేటెడ్ కారిడార్లకు వచ్చే అడ్డంకులు, తదితర అంశాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నారు. ఇందులో భాగం గా ఆదివారం హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అధికారులు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి మీర్‌ఖాన్‌పేట్‌లో నిర్మాణంలో ఉన్న స్కిల్ యూనివర్సిటీ సర్వే చేశారు. కొంగరకలాన్ దాటిన తర్వాత సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో.. వారంతా కాలినడకన కొండలు, గుట్టలు దాటుకుని వివిధ అంశాలను పరిశీలించారు.

పరిశీలనలో అధ్యయనం చేసిన అంశాలు..

- శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి వెళ్లే మెట్రో మార్గం 40 కిలోమీటర్లు ఉంటుంది. ఈ మార్గం ఎయిర్‌పోర్టు టర్మినల్ వద్ద మొదలై.. కొత్తగా ఏర్పాటు చేయనున్న మెట్రో రైల్ డిపో పక్క నుంచి ఎయిర్‌పోర్టు సరిహద్దు గోడ వెంబడి ఎలివేటెడ్ మార్గంగా.. మన్సాన్‌పల్లి రోడ్డు మీదుగా 5 కిలోమీటర్లు ముందుకు సాగిన తర్వాత.. పెద్ద గోల్కొండ ఓఆర్ఆర్ ఎగ్జిట్‌కి చేరేలా డిజైన్ చేస్తున్నారు.
- ఎయిర్‌పోర్టు నుంచి ఎయిర్‌పోర్టు కార్గో వరకు 2 కిలోమీటర్లను అండర్‌గ్రౌండ్‌లో నిర్మించనున్నారు. కార్గోస్టేషన్ వద్ద డిపోనుఏర్పాటు చేయనున్నారు.
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనలకు అనుగుణంగా బహదూర్‌గూడలో ఉన్న దాదాపు 1,000-1,500 ఎకరాల ప్రభుత్వ భూమిలో అంతర్జాతీయ స్థాయి హబ్‌ను తీర్చిదిద్దేందుకు బహదూర్‌గూడా, పెద్ద గోల్కొండలో రెండు మెట్రోస్టేషన్లను అత్యంత ఆకర్షణీయంగా అభివృద్ధి చేయనున్నారు.
- పెద్దగోల్కొండ ఓఆర్ఆర్ ఎగ్జిట్ నుంచి తుక్కుగూడ ఎగ్జిట్ మీదుగా రావిర్యాల్ ఎగ్జిట్ వరకు దాదాపు 14 కిలోమీటర్ల పొడవున మెట్రో మార్గాన్ని ఎలివేటెడ్‌గా, ఓఆర్ఆర్‌లో మెట్రోరైల్‌కి కేటాయించిన భాగంలో.. తక్కువ ఎత్తులో కారిడార్‌ను నిర్మించాలని భావిస్తున్నారు.
- రావిర్యాల్ ఎగ్జిట్ నుంచి ఇప్పటికే నిర్మాణంలో ఉన్న స్కిల్ యూనివర్సిటీ వరకు దాదాపు 22 కిలోమీటర్లు కొంగరకలాన్, లేమూర్, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజాగూడా, మీర్‌ఖాన్‌పేట్ వరకు హెచ్ఎండీఏ సంస్థ 100 మీటర్ల(328 అడుగులు) వెడల్పున నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి మధ్యలో 22 మీటర్ల(72 అడుగులు)ను మెట్రో రైల్‌కి కేటాయించారు. అయితే ఇక్కడ కేటాయించిన రోడ్డు మధ్య స్థలంలో మెట్రో రైల్ కారిడార్ 'ఎట్ గ్రేడ్'(భూతలంపై) 18 కిలోమీటర్ల మేరకు నిర్మించనున్నారు.
- ఈ విశాలమైన రోడ్డు మధ్యలో.. అదే లెవెల్‌లో మెట్రో రైలు ఉంటే దానికి ఇరువైపులా మూడు లేన్ల చొప్పున ప్రధాన రహదారి ఉంటుంది. మెట్రోను, ప్రధాన రహదారిని విభజిస్తూ ఆకర్షణీయమైన చెట్లతో గ్రీనరీని అభివృద్ధి చేయనున్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా రెండు సర్వీస్ రోడ్లను ఏర్పాటు చేస్తారు.
- దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో ఓఆర్ఆర్ నిర్మిస్తున్నపుడు.. ఓఆర్ఆర్‌లో అంతర్భాగంగా భవిష్యత్‌లో నిర్మించబోయే మెట్రోకు తగినంత స్థలాన్ని కేటాయించాలని తాను చేసిన ప్రతిపాదనను అంగీకరించి 20 మీటర్లు మెట్రోకి కేటాయించినట్లు ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. అప్పట్లో అనేక మంది ఓఆర్ఆర్, మెట్రో వంటి బృహత్ ప్రణాళికలు కాగితలకే పరిమితమవుతాయని, అవి ఆచరణ సాధ్యం కాదని అపహాస్యం చేశారని, ఇప్పుడు ఓఆర్ఆర్, మెట్రో రెండూ కార్యరూపందాల్చాయని గుర్తుచేశారు.
- నగరంలో రూ. 22 వేల కోట్లతో 69 కిలోమీటర్ల మేరకు మెట్రో మొదటిదశను పీపీపీ మోడల్‌లో పూర్తి చేశామని, ఇప్పుడు సీఎం దార్శనికతతో హెచ్ఎండీఏ, టీజీఐఐసీ, మెట్రోరైల్ సంస్థలు సంయుక్తంగా కృషిచేసి, రెండోదశను పూర్తిచేస్తాయని ఎన్వీఎస్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. రెండో దశలోని పార్ట్-బీలో ఉన్న మేడ్చల్, శామీర్‌పేట్ కారిడార్లతోపాటు ఫ్యూచర్ సిటీ మెట్రో డీపీఆర్‌ను మార్చి నెలాఖరులోగా పూర్తిచేసి, రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని వివరించారు.

ఎయిర్‌పోర్టు- స్కిల్ వర్సిటీ మార్గం..

మొత్తం దూరం	: 40 కి.మీ.
స్టేషన్ల సంఖ్య	: 16
భూగర్భ మార్గం	: 2 కి.మీ.
ఎలివేటెడ్ మార్గం	: 6 కి.మీ.
ఓఆర్ఆర్ వెంట ఎలివేటెడ్	: 14 కి.మీ.
ఎట్ గ్రేడ్(భూమిపై నిర్మాణం)	: 18 కి.మీ.
ప్రధాన స్టేషన్లు	: ఎయిర్‌పోర్టు, ఎయిర్‌పోర్టు కార్గో, బహదూర్‌గూడ, పెద్ద గోల్కొండ, తుక్కుగూడ, రావిర్యాల్, కొంగరకలాన్, రాచలూరు, గుమ్మడవెల్లి, స్కిల్ యూనివర్సిటీ

కేవలం 40 నిమిషాల్లో ఫ్యూచర్‌సిటీకి..

ఎయిర్‌పోర్టు నుంచి 40 నిమిషాల్లో ఫ్యూచర్‌సిటీకి చేరుకునే విధంగా కారిడార్‌ను నిర్మించాలని అధికారులు భావిస్తున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి మొదలవుతున్న కారిడార్ రావిర్యాల మీదుగా, ఓఆర్ఆర్ వెంట వెళ్లే విధంగా డిజైన్ చేస్తున్నారు. ఫ్యూచర్‌సిటీని కాలుష్యరహిత గ్రీన్‌సిటీగా తీర్చిదిద్ది, ప్రపంచంలోనే అద్భుత నగరాల వరసలో చేర్చే విధంగా సర్కారు చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు హెచ్ఎండీఏ, టీజీఐఐసీలతో కలిసి హెచ్ఏఎంఎల్ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. ఫ్యూచర్‌సిటీ కి అనువుగా గ్రీన్ కారిడార్లను అభివృద్ధి చేసి, అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి త్వరితగతిన ఫ్యూ చర్ సిటీకి చేరుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

మీ డబ్బులు మీకిస్తాం!

- మా సంస్థ గురించి మంచి రివ్యూలు రాయండి
- లింక్డ్‌ఇన్‌లో 'ఫాల్కన్' చైర్మన్ పోస్ట్
- కేసుల నుంచి బయటపడేందుకు యత్నం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రూ.850 కోట్ల ఫాల్కన్ మోసం కేసులో నిందితులు కొత్త ఎత్తుగడ వేస్తున్నారు. పోలీసుల చేతికి చిక్కకముందే కేసుల నుంచి బయటపడేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. పోంజీ స్కీముల ద్వారా వందల కోట్లు కొల్లగొట్టిన ఫాల్కన్ నిర్వాహకులు బాధితులను మచ్చిక చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. తాము మోసం చేయలేదని, మంచి రివ్యూలు ఇస్తే తిరిగి వ్యాపారం ప్రారంభించి లాభాలు ఇస్తామంటూ బాధితులను మభ్యపెట్టాలని చూస్తున్నారు. లింక్డ్‌ఇన్ ద్వారా సందేశాలు పంపి బాధితులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఫాల్కన్ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ అమర్‌సింగ్ వారం క్రితం లింక్డ్‌ఇన్‌లో పోస్ట్ ద్వారా స్పందించాడు. సంస్థ నిర్వాహకుల గురించి జరుగుతున్న ప్రచారాన్ని ఖండించాడు. 'ఫాల్కన్‌పై జరుగుతున్న ప్రచారాన్ని నమ్మకండి, మేము షేర్లు, ఆస్తులు అమ్మి అయినా కస్టమర్లకు రావాల్సిన డబ్బులు ఇస్తాం. కస్టమర్లకు రీపేమెంట్ చేసేందుకు యత్నిస్తున్నాము. ఎక్కడికీ పారిపోలేదు, కస్టమర్ల మెయిల్స్‌కు స్పందిస్తున్నాము. ఫాల్కన్ గురించి మంచి రివ్యూలు ఇవ్వండి. తిరిగి బిజినెస్ ప్రారంభిస్తాం' అని అమర్‌సింగ్ లింక్డ్‌ఇన్ ద్వారా కోరాడు. దీనికి స్పందించిన బాధితులు తాము ఎట్టి పరిస్థితుల్లో నమ్మమని స్పష్టంచేశారు. జీవితాంతం కష్టపడి సంపాదించిన సొమ్మును కాజేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న మొత్తాలను చెల్లించాలని మరికొందరు డిమాండ్ చేశారు.

ఆస్తి కోసం అన్నను చంపిన చెల్లెళ్లు

- వంద గజాల స్థలం కోసం కర్రలతో దాడి
- జగిత్యాల జిల్లాలో దారుణం

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వంద గజాల స్థలం కోసం అన్నపై కర్రలతో దాడి చేసి హతమార్చారు ఇద్దరు చెల్లెళ్లు. ఈ ఘటన జగిత్యాల జిల్లాలో జరిగింది. జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన జంగిలి బసవయ్య-లక్ష్మికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు. చిన్న కుమారుడు ఇరవై ఏళ్ల క్రితమే మృతి చెందాడు. పెద్ద కుమారుడు శ్రీనివాస్(52) ఆర్టీఏ ఏజెంట్‌గా పని చేస్తూ హన్మాన్‌వాడలో నివాసం ఉంటూ తల్లిదండ్రుల ఆలనా పాలనా చూస్తున్నాడు. బసవయ్య పెద్ద కూతురు భారతపు వరలక్ష్మి భర్త చాలా ఏళ్ల క్రితం మృతిచెందగా సోదరుడు శ్రీనివాస్ కుటుంబంతోనే జీవిస్తోంది. చిన్న కూతురు వొడ్నాల శారదకు భర్తతో తగాదాలు రావడంతో అన్న ఇంటి పక్కనే అద్దె ఇంటిలో ఉంటోంది. బసవయ్య-లక్ష్మి దంపతులకు ఇల్లుతో పాటు పోచమ్మవాడలో వంద గజాల స్థలం ఉంది. వరలక్ష్మి, శారద తమకు ఆ స్థలాన్ని రాసి ఇవ్వాలని కోరుతూ తండ్రి, సోదరుడు శ్రీనివాస్‌ను అడిగారు. వారు ఒప్పుకోకపోవడంతో కొన్ని ఏళ్ల నుంచి గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయంలో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం శ్రీనివాస్ తన తల్లిదండ్రులకు భోజనం అందించేందుకు పోచమ్మవాడకు వెళ్లాడు. అక్కడే ఉన్న వరలక్ష్మి, శారద స్థలం కోసం శ్రీనివాస్‌తో వాగ్వాదానికి దిగారు. ఇద్దరు కలిసి కర్రతో తలపై దాడిచేశారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన శ్రీనివాస్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. నిందితులు పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం.

అనుమానాస్పదంగా ఇద్దరి ఆత్మహత్య

కొండపాక, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుని ఓ మహిళ, పురుషుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సిద్దిపేట జిల్లా కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి శివారులో శనివారం రాత్రి జరిగింది. హైదరాబాద్ నుంచి ఆటోలో ఓ మహిళ, పురుషుడు తిమ్మారెడ్డిపల్లి శివారులోని హోటళ్ల వద్ద శనివారం రాత్రి దిగారు. చెట్ల పొదల్లోకి వెళ్లి కిరోసిన్ ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నారు. స్థానికులు మంటలు ఆర్పి, పోలీసులకు సమాచారం ఇచ్చి.. అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అప్పటికే మహిళ మృతి చెందింది. పురుషుడిని సిద్దిపేట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.



భూ వివాదాలతోనే రాజలింగమూర్తి హత్య

- వీడిన సామాజిక కార్యకర్త హత్యకేసు మిస్టరీ
- 10 మంది నిందితులు.. ఏడుగురి అరెస్టు
- బీఆర్ఎస్ నేత సహా పరారీలో ముగ్గురు నిందితులు

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లిలో సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి హత్య కేసు మిస్టరీ వీడింది. భూ వివాదాలే హత్యకు కారణమని పోలీసులు తేల్చారు. 10మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఏడుగురు నిందితులను ఆదివారం అరెస్టు చేశారు. కేసు వివరాలను ఎస్పీ కిరణ్ ఖరే విలేకరులకు వెల్లడించారు. రాజలింగమూర్తిని భూపాలపల్లికి చెందిన రేణికుంట్ల సంజీవ్, పింగిళి సేమంత్ అలియాస్ బబ్లూ, మోరె కుమార్, కొత్తూరి కిరణ్ అలియాస్ కుమార్ హత్య చేశారని చెప్పారు. వీరికి రేణికుంట్ల కొమురయ్య, దాసారపు కృష్ణ, రేణికుంట్ల సాంబయ్య, పుల్లా నరేశ్, పుల్లా సురేశ్‌తో పాటు భూపాలపల్లి మునిసిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు సాయం చేశారని వెల్లడించారు. హరిబాబు, నరేశ్, సురేశ్ పరారీలో ఉన్నారు. సంజీవ్ ఏ1గా, బబ్లూ ఏ2గా ఉన్నారు. బీఆర్ఎస్ నాయకుడు, మున్సిపల్ కౌన్సిలర్ హరిబాబు ఈ కేసులో ఏ8 నిందితుడిగా ఉన్నట్లు ఎస్పీ వివరించారు. రాజలింగమూర్తి హత్యకు రెండు భూవివాదాలే ప్రధాన కారణంగా గుర్తించినట్లు ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న సర్వే నెంబర్ 319లో 2.25 ఎకరాల భూమి విషయంలో ఏ1 నిందితుడిగా ఉన్న సంజీవ్ కుటుంబానికి, రాజలింగమూర్తికి మధ్య వివాదం నడుస్తోంది. సంజీవ్ లింగమూర్తిపై కక్షగట్టి ఎప్పటికైనా రాజలింగమూర్తిని చంపేస్తానని తన సన్నిహితుల దగ్గర చెప్పేవాడు. ఇదే క్రమంలో భూపాలపల్లిలోని ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న సర్వే నం.323లో.. హనుమకొండకు చెందిన ఓ అడ్వకేట్‌కు చెందిన 16 గుంటల భూమి విషయంలో రాజలింగమూర్తి, హరిబాబు మధ్య వివాదం నడుస్తోంది. తమ భూమిని రాజలింగమూర్తి మోసపూరితంగా ఆయన పేర రాయించుకున్నారని, ఆయన్ను చంపేస్తానని సంజీవ్ గతంలో హరిబాబుకు చెప్పాడు. దీంతో, రాజలింగమూర్తి తనకు కూడా శత్రువు కాబట్టి అతడిని చంపేస్తే బెయిల్ ఖర్చులు, మిగతా ఖర్చులు ఏమైనా ఉంటే చూసుకుంటానని సంజీవ్‌కు హరిబాబు మాటిచ్చాడు. సంజీవ్ రెండు నెలల కింద తన బంధువు మోరె కుమార్‌తో కలిసి వరంగల్‌లోని కాశీబుగ్గ ప్రాంతంలో రెండు కత్తులు, ఒక రాడ్డు కొనుగోలు చేశాడు.

ఈ నెల 19న హత్య

ఈ నెల 19న ఓ కేసు విషయంలో సంజీవ్ కోర్టుకు హాజరయ్యాడు. అక్కడ రాజలింగమూర్తిని చూసి కోపోద్రిక్తుడయ్యాడు. తన సహచరులకు ఫోన్ చేసి 'ఈ రోజే లింగమూర్తిని చంపేద్దాం' అని పురమాయించాడు. ఈ క్రమంలో ఆ రోజు సాయంత్రం 6:45 గంటలకు రాజలింగమూర్తి భూపాలపల్లిలో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నిందితులు నలుగురు కత్తులతో దాడిచేశారు. రాజలింగమూర్తి అక్కడికక్కడే చనిపోయాడు. కాగా, హత్యకు ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న హరిబాబు, నరేశ్, సురేశ్‌లను త్వరలోనే పట్టుకుంటామని, వారి కోసం 2 ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు.

విశాఖలో 'లోకల్ బాయ్' నాని అరెస్టు

- బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేశాడని అభియోగం

విశాఖపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేశాడనే అభియోగంపై విశాఖకు చెందిన సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ వాసుపల్లి నాని అలియాస్ 'లోకల్ బాయ్' నానిని సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. నగరానికి చెందిన ఓ యువకుడు డఫాబెట్, ఫ్యారీమ్యాచ్, మహదేవ్‌బుక్, రాజాబెట్ వంటి ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల్లో ఇప్పటికే రూ.2 కోట్లు వరకు పోగొట్టుకొని అప్పుల పాలయ్యాడు. ఈ సమయంలో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చంటూ నాని ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తూ యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల్లో వీడియో అప్‌లోడ్ చేశాడు. దీనిపై ఆ యువకుడు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటికే తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ లోకల్‌బాయ్ నానిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు తక్షణం వీడియోలను తొలగించాలని ఆదేశించిన విషయం పోలీసుల దృష్టికి వచ్చింది. దీంతో సైబర్ క్రైమ్ పోలీసులు నానిని అరెస్ట్ చేసి శనివారం రాత్రి రిమాండ్‌కు తరలించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- విద్యుదాఘాతంతో అన్నదాత మృతి

కూసుమంచి, మూడుచింతలపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా లో అప్పుల బాధతో ఆదివారం ఓ రైతు ఆత్మహత్య చేసుకోగా.. మేడ్చల్ జిల్లాలో విద్యుదాఘాతంతో మరో రైతు మృతి చెందాడు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని తుర్కగూడెంలో బుర్ర దర్గయ్య(28) కుటుంబ అవసరాలకు అప్పులు చేసిన దర్గయ్య వాటిని తీర్చలేక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట్ మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన బుద్ధి వెంకటేశ్(40) పొలంలో పనులు చేస్తుండగా కొడుకు సృజన్ తండ్రికి సాయం చేయసాగాడు. ఈ క్రమంలో పొలంలో వేలాడుతున్న విద్యుత్ వైర్లు సృజన్‌కు తగిలి షాక్‌కు గురయ్యాడు. కొడుకును కాపాడే ప్రయత్నంలో వెంకటేశ్‌కు విద్యుత్ షాక్ తగిలింది. స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తీవ్రగాయాలైన సృజన్‌ను ఆస్పత్రికి తరలించారు.

నా భర్త హత్య 'కాళేశ్వరం' కేసు వల్లే..

- రాజలింగమూర్తి భార్య సరళ

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి హత్య కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసు వ్యవహారం వల్లే జరిగిందని ఆయన భార్య నాగవెల్లి సరళ అన్నారు. ఆదివారం భూపాలపల్లి పట్టణం ఫక్కీర్‌గడ్డలోని తన నివాసంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఈ హత్యలో బీఆర్ఎస్ నేతల ప్రమేయం ఉందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ హరిబాబుతో పాటు కేసీఆర్, కేటీఆర్‌ల ప్రమేయం ఉందని అనుమానంగా ఉన్నారు. కాళేశ్వరం నిర్మాణంలో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని బీఆర్ఎస్ పెద్దలపై తన భర్త కేసు వేశారని, ఆ కేసులో ఆయనకు అనుకూలంగా తీర్పు వస్తుందనే ఉద్దేశంతోనే ఆయనను హత్య చేశారని ఆమె ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకుని తమ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భూవివాదం కారణంగానే హత్య జరిగిందనడం అవాస్తవమన్నారు. తన భర్త హత్య కేసును సీబీసీఐడీకి అప్పగించాలని సరళ డిమాండ్ చేశారు.

హైకోర్టు సిటింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

రాజలింగమూర్తి హత్య కేసును హైకోర్టు సిటింగ్ జడ్జితో విచారణ చేయించాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య డిమాండ్ చేశారు. రాజలింగమూర్తి కుటుంబాన్ని మానవ హక్కుల వేదిక నాయకులు ఆదివారం పరామర్శించారు. హత్యలో బీఆర్ఎస్ రాజకీయ ప్రముఖుల హస్తం ఉందని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో మానవ హక్కుల వే దిక నిజనిర్ధారణ బృందం వివరాలను సేకరించినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రధాన అనుచరుడు హరిబాబు ఈ హత్య కేసులో కుట్రదారుడిగా ఉన్నాడన్నారు. రాజలింగమూర్తిని చంపాల్సిన అవసం హరిబాబుకు లేదని, బీఆర్ఎస్ అధినాయకులే అవినీతి విచారణ నుంచి తప్పించుకోవడానికి హరిబాబుతో హత్య చేయించారని రాజలింగమూర్తి భార్య కూడా ఆరోపిస్తున్నారని చెప్పారు.



వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

చెన్నై బుక్‌ఫెయిర్‌ను చూసి నేర్చుకోవాలి!

తెలుగు జాతి మనది... నిండుగ వెలుగు జాతి మనది అని పాడుకున్నంత మాత్రాన భాష బల పడదు. మనకు గుర్తింపైన మన భాష ఎదగాలంటే స్థిరపడాలంటే బలపడాలంటే సాహితీ వేత్తలు, మేధావులు, సృజనకారులు బతకాలి. వారికి తమ ఆలోచనలను ప్రకటించుకొనే అవకాశాలు, ఆ ఆలోచనలకు అక్షర రూపాన్ని ఇవ్వగల సామాజిక, ఆర్థిక వాతావరణం ఉండాలి. తమిళ భాష కోసం 'తమిళనాడు ఇంటర్నేషనల్ బుక్‌ఫెయిర్' ఈ పని సమర్థంగా చేస్తున్నది.



గత మూడేళ్లుగా తమిళనాడు ప్రభుత్వం చెన్నైలో నిర్వహిస్తున్న 'ఇంటర్నేషనల్ బుక్‌ఫెయిర్' ఈ సంవత్సరం జనవరి 16–18 తేదీల్లో జరిగింది. తమిళ సాహిత్యాన్ని ప్రపంచానికి విస్తరించడం, ప్రపంచ సాహిత్యాన్ని తమిళులకు అందించడం దీని లక్ష్యం. ఈ ఉత్సవంలో అనేక సదస్సులు, గోష్ఠులు జరిగాయి. ఎంపికైన రచయితలు, అనువాదకులు, ప్రచురణకర్తలు వీటిలో పాల్గొన్నారు.

ప్రభుత్వం ఈ ఉత్సవానికి ఎంత ప్రాధాన్యత ఇచ్చిందంటే అక్కడి సాంస్కృతిక మంత్రి, విద్యా మంత్రి, పుస్తక ప్రచురణ సంస్థల డైరెక్టర్లు, ఆఖరికి ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా ఈ సభల్లో పాల్గొన్నారు. ముగింపుగా శశిధరూర్ చక్కని ఉపన్యాసం ఇచ్చారు. భాషల అనుసంధానం అనువాదాలతో సాధ్యమని, ఆలోచనలను అనుసంధానించి, అభివృద్ధి కాముక పథంలో నడవాలంటే సాహిత్యంలో అనువాద ప్రక్రియకి పెద్ద పీట వేయాలని ఆయన చెప్పారు. ఈ ఏడాది 64 దేశాలు ఈ ఫెస్టివల్‌లో భాగస్వాములయ్యాయి. వచ్చే ఏడాది వంద దేశాలకు వ్యాపించాలన్నది లక్ష్యం! దాదాపు 1100 రచనలను అనువాదం చేయడానికి సంతకాలు చేసుకున్నారు. అమెరికా, ఇంగ్లాండ్, జర్మనీ తదితర యూరోపియన్ దేశాలు, ఆఫ్రికా దేశాలు ఇందులో ప్రధానంగా ఆసక్తిని కనబరిచాయి.

అనువాదాల వల్ల తమిళ దళిత సాహితీవేత్త ఇమయం ఫ్రాన్స్‌లో ప్రాచుర్యం పొందారట. దళిత స్త్రీల అణిచివేతను, ధిక్కార స్వరాన్ని వినిపించే ఇమయం పుస్తకం ఫ్రెంచ్ భాషలో 'లే పేరే'గా ప్రసిద్ధి పొందింది. ఒక తమిళ రచయిత ఫ్రాన్స్‌లో చిరపరిచితుడయ్యాడు. హిందీ, బెంగాలీ, మలయాళం, కన్నడ రాష్ట్రాల నుండి వచ్చిన ప్రతినిధులు తమిళం నుంచి తమ తమ భాషల్లోకి చేసిన అనువాదాలను వివరించారు. తమ భాషల నుండి తమిళంలోకి జరిగిన అనువాదాలను కూడా చర్చించారు. ప్రఖ్యాత తమిళ రచయిత్రి లక్ష్మి అనువాదాలు చేసేటప్పుడు తమిళ సాంప్రదాయాలను వివరించడంలో అనువాదకులు నిర్లక్ష్యం చేయకూడదని గట్టిగా పట్టుబట్టారు. అనువాదం అంటే కథ చెప్పడం మాత్రమే కాదని, సంస్కృతిని, అలవాట్లను, ఆచారాలను కూడా ప్రతిబింబించాలని అన్నారు.

భాషకు సంబంధించి ఇప్పటికే ద్రవిడ ఉద్యమం వలన తమిళనాడు ప్రభుత్వం అక్కడి సైన్ బోర్డులన్నీ తమిళం లోనే ఉండాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో తమిళ భాషనే వాడాలని తీసుకున్న నిర్ణయాలను కచ్చితంగా అమలు చేస్తున్నది. బడులలో తమిళం నేర్చుకోవడం తప్పనిసరి చేసి, తమిళ భాషా ఉపాధ్యాయులకు మంచి వేతనం ఇస్తూ ఎనలేని గౌరవం అందిస్తున్నది. రచయితలకు పారితోషికాలను ఏటేటా పెంచుతున్నది. లైబ్రరీలను ప్రోత్సహిస్తున్నది. లైబ్రరీలకు పుస్తకాలు అందజేస్తున్నది. అదనంగా ఇప్పుడు చేసిన ఉత్సవం రచయితలకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చేదిగా ఉంది. దానికి కొనసాగింపుగా ఈ అనువాద ఉద్యమం.

ఈ ఏడాది ఉత్సవంలో ప్రాచీన సాహిత్యం, వాడుక భాష కవిత్వం, కథ, నవల; దళిత, స్త్రీవాద సాహిత్యాలతో పాటుగా తమిళంలో సృష్టించబడుతున్న కొత్త పదాలు, డిక్షనరీల వంటి అంశాలు చర్చకు వచ్చాయి. పరిశోధనలకి ఆ ప్రభుత్వం చక్కటి అవకాశం ఇస్తున్నది. ఈ ఏడు జరిగిన చర్చలో ఒక పండితుడు, పరిశోధకుడు సంస్కృతంలోని 470 పదాలు తమిళంలోనివని రుజువు చేశారు. ఈ మధ్యనే జరిగిన తవ్వకాలలో దాదాపు బి.సి.3500 ఏళ్ల కిందటే తమిళనాడులో ఇనుము వాడకం జరిగినట్టు బయటపడింది. తమిళ శిలా ఫలకాలు దొరికాయి. ఈ ఉత్సవంలో ఈ అంశాలపై చర్చ జరిగింది.

ఇంతటి కోలాహలంలో తెలుగు స్వరం మూగపోవడం బాధాకరం. ఇక్కడి ఏ చర్చలోను ఏ వేదిక పైనా మన ప్రాతినిధ్యం లేదు. మనం కూడా తమిళ సాహిత్యాన్ని తర్జుమా చేసుకుంటున్నాం. మన సాహిత్యం కూడా తమిళంలోకి అనువాదం అవుతూనే ఉంది. కానీ ఏ వేదిక మీదా మనం కనిపించలేదు. భాష బతకాలంటే రచయితలకు అవకాశాలు ఉండాలి. ఆ ప్రాపకం ప్రభుత్వమే ఇవ్వాలి. రచయితలను అనువాదకులను ప్రచురణకర్తలను ఒకచోట చేర్చాలి. అందుకు ప్రభుత్వం అండదండలు ఇవ్వాలి. భాషాభిమానం గురించి గొప్పలు చెప్పకోకుండా, పూని ఏదైనా చేసినప్పుడే తెలుగు భాష బతుకుతుంది. వెలుగుతుంది. స్థిరపడుతుంది. జాతి గర్వంగా నిలబడుతుంది.

అనువాదాల వల్ల తమిళ దళిత సాహితీవేత్త ఇమయం ఫ్రాన్స్‌లో ఎంతో ప్రాచుర్యం పొందారట. దళిత స్త్రీల అణిచివేతను, ధిక్కార స్వరాన్ని వినిపించే ఇమయం పుస్తకం ఫ్రెంచ్ భాషలో 'లే పేరే'గా ప్రసిద్ధి పొందింది. ఒక తమిళ రచయిత ఫ్రాన్స్‌లో చిరపరిచితుడయ్యాడు.



■ కె. ఉషారాణి

నీడలు కాదు, సమవుజ్జీలు

ఆర్. వసుంధరాదేవి, ఆచంట శారదాదేవి, శివరాజు వెంకట సుబ్బలక్ష్మి, అబ్బూరి ఛాయాదేవి, కె. రామలక్ష్మి – వీళ్ళందరి మధ్యా ఒక సామ్యం ఉంది. వారి భర్తలైన ఆర్.ఎస్. సుదర్శనం, ఆచంట జానకీరామ్, బుచ్చిబాబు, అబ్బూరి వరదరాజేశ్వరరావు, ఆరుద్రలకు తెలుగు సాహితీ ప్రపంచంలో ఒక విశిష్ట స్థానం ఉంది. అయినప్పటికీ వాళ్ళు భర్తచాటు భార్యల్లాగా ఉండిపోలేదు. రచయిత్రులుగా మర్రి చెట్ల నీడన కూడా మొలకలెత్తారు. శాఖోపశాఖలుగా విస్తరించారు. తమకంటూ ఒక అస్తిత్వం సాధించుకున్నారు.

ఆర్. వసుంధరాదేవి కథలుగా అందుబాటులో ఉన్నది నలభై ఎనిమిది కథలు మాత్రమే. కొన్ని రచనలకు ఏకబిగిన చదివించే లక్షణం ఉంటుంది. కానీ ఈ నలభై ఎనిమిది కథలను మాత్రం ఏకబిగిన చదవలేం. ఒక్కో కథ పూర్తవగానే మనసు ఏదో తెలీని భారంతో నిండిపోతుంది. సాంద్రతతో బరువెక్కిన లోతైన పదాలు, వాక్యాలు, ఆ బరువునీ, దిగులునీ మన గుండె లోతుల్లోకి ప్రతిష్ఠిస్తాయి. చదువుతున్నంతసేపూ మనకే తెలియని ఒక నిర్వేదంలో చిక్కుకుపోయి ఊపిరాడనివ్వని గాఢమైన అనుభూతికి లోనవుతాం. ఒక పక్క అమృతం, ఒక పక్క హాలాహలంగా ఆలోచన రెండు రెండుగా విడిపోతుంటుంది. "ఈ మానవజాతి ఎదుటి మనిషితోనూ, అతని సుఖదుఃఖాలతోనూ, కష్టనిష్ఠూరాలతోనూ సంబంధం కోల్పోవడాన రోగగ్రస్తమై పోతున్నది. మానవజాతిని ఏడ్చే నవ్వే మనుషులుగా, ఎదుటివాళ్ళను అర్థంచేసుకునే వాళ్ళుగా ఉండనీ స్వామీ" (పెంజీకటికవ్వల) లాంటి వాక్యాలు, పదబంధాలు ఆర్. వసుంధరాదేవి ప్రతిభకు, భావ వ్యక్తీకరణకు నిదర్శనం. శారదాదేవి కథల్ని కథలనే దానికన్నా ఆలోచనా శకలాలు అనవచ్చు. ఒక విషయం గురించి ఆలోచన ప్రారంభమై క్రమంగా విస్తరించి చివరికి కథగా మారిపోతుంది. అందుకే కె. రామలక్ష్మి శారదాదేవి కథల్ని 'లౌడ్ థింకింగ్' అంటారు.

ఆచంట శారదాదేవి కథలు ఎక్కడో ఆకాశం లోంచి ఊడిపడ్డట్టు ఉండవు. దిగజారిపోతున్న మానవ సంబంధాలు, కుటుంబ సంబంధాలు, నైతిక విలువలు సమాజపు పోకడలు – వీటి చుట్టూ కథలు నడుస్తుంటాయి. ఎక్కడో సముద్ర గర్భంలో మొదలైన అల



తన ప్రయాణం మొదలుపెట్టి ఉవ్వెత్తున కెరటంలా ఎగసిపడి తీరంచేరడం ఎంత సహజంగా క్రమబద్ధంగా జరిగి పోతుందో శారదాదేవి కథ ఎత్తుగడ, నడక అంతే సహజంగా జరిగిపోతుంది. సమస్యలు వస్తుంటాయి. పోతుంటాయి. కానీ జీవితం మాత్రం అలాగే ఉంటుంది. జీవన క్రమంలో ఎదురైన సమస్యలను ఓర్పుతో నేర్పుతో పరిష్కరించుకోవడంలోనే మనిషి ప్రతిభ దాగుంటుంది అనే భావన అనేక కథల్లో అంతర్లీనంగా ప్రవహిస్తుంటుంది. 'కారుమబ్బులు', 'ఇరుగూ పొరుగూ', 'ప్రేమ పెళ్ళి', 'పగడాలు', 'పారిపోయిన చిలక', 'నిద్రలేని రాత్రి', 'తెల్లార్తే ముహూర్తం' లాంటి కథలన్నీ ఏ కథకు ఆ కథ ఒక ఆణిముత్యం.

శివరాజు వెంకట సుబ్బలక్ష్మి దాదాపు యాభై కథల వరకూ రాశారు. మొదట మొదట తనకు కథలు రాయడం అంత అలవాటు లేదని, బుచ్చిబాబు గారి కోసం ఇంటికి వచ్చే స్నేహితులు, అతిథులు 'మీరేం చేస్తుంటారు' అని అడుగుతుండడంతో చిన్నగా కథలు రాయడం ప్రారంభించానని చెప్పే శివరాజు వెంకట సుబ్బలక్ష్మి మంచి చిత్రకారిణి కూడా. సుబ్బలక్ష్మిగారి కథలన్నీ ఒక స్త్రీ హృదయంలోంచి వచ్చే కథలు. స్త్రీలు మాత్రమే రాయగలిగిన కథలు. పురుషుడు ఎంత ప్రతిభావంతుడైనా స్త్రీ స్వభావాన్ని తనకు అర్థమైన రీతి లోనే ఆవిష్కరించగలడు. ఒక స్త్రీ మాత్రమే మరొక స్త్రీ నిగూఢమైన అంతరంగ లోతుల్ని వెదికి పట్టుకోగలదు. ఆ రకంగా శివరాజు సుబ్బలక్ష్మి కథలు మధ్యతరగతి స్త్రీల మనో విశ్లేషణ కథలని చెప్పుకోవచ్చు. 'అదృష్టరేఖ', 'నీలంగాటు అయ్యగారు', 'తీర్పు', 'కావ్య సుందరి కథ', 'ఒడ్డుకు చేరిన కెరటం', 'మనోవ్యాధికి మందుంది', 'శివరాజు సుబ్బలక్ష్మి కథలు' లాంటి ఆమె నవలలు, కథల్లోని పాత్రలన్నీ సమస్యల్ని సహనంతో ఎదుర్కొంటాయి తప్ప ఆత్మహత్య పరిష్కారం అనే దిశగా పయనించవు.

అబ్బూరి ఛాయాదేవి అబ్బూరి వరదరాజేశ్వరరావు ఛాయ, ప్రచ్ఛాయ కాకుండా అబ్బూరి ఛాయాదేవిగా స్వయంసిద్ధ రచయిత్రి. ఛాయాదేవిపై చలం, జిడ్డు కృష్ణమూర్తి ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. అందుకే ఎంతో సంక్లిష్టమైన జిడ్డు కృష్ణమూర్తి రచనల్ని కూడా ఆమె ఎంతో ప్రతిభావంతంగా, మూలంలోని అర్థం, భావం ఏ మాత్రం చెడకుండా అచ్చతెలుగులో అనువాదం చేసి విమర్శకుల ప్రశంసలు సైతం అందుకున్నారు. 'తన మార్గం' అనే కథా సంకలనానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న అబ్బూరి ఛాయాదేవి మధ్య తరగతి కుటుంబాలలోని స్త్రీలు ఎదుర్కొనే సమస్యలు, పురుషాధిక్య సమాజంలో అడుగడుగునా స్త్రీలు ఎదుర్కొనే వివక్ష ప్రధానంగా కథలు రాయడమే కాకుండా ఆ అనాచారాలన్నిటినీ ధైర్యంగా ప్రశ్నించాలని అంటారు. ఆడపిల్లల పెంపకంలోనూ, మగపిల్లల పెంపకంలోనూ వివక్ష చూపిస్తూ వివాహం అయిన తర్వాత బోన్సాయి మొక్కలానే స్త్రీల రెక్కల్ని కూడా కత్తిరించి 'భార్య' అనే బిరుదు తగిలించి ఆమెను కూడా బోన్సాయి మొక్కలా తయారు చేయడాన్ని తప్పు పడతారు ఛాయాదేవి ('బోన్సాయి బ్రతుకు'). తండ్రి అంటే భయం తప్ప తండ్రి ప్రేమ, ఆత్మీయ స్పర్శ తెలియని కూతురి వేదనీ; భర్తల ఆధిపత్యం కింద నలిగిపోయే భార్యల అంతర్మథనాన్నీ... ఇలా ప్రశ్నించడానికి అవకాశం వచ్చిన ఏ సందర్భాన్నీ ప్రశ్నించకుండా వదిలిపెట్టరు ఛాయాదేవి.

'తెలుగు స్వతంత్ర'లో సబ్ ఎడిటర్‌గా కెరీర్‌ను ప్రారంభించిన కె. రామలక్ష్మి ఆరుద్ర సతీమణి గానే కాకుండా కె. రామలక్ష్మిగానే సుప్రసిద్ధులు. తొంభై రెండేళ్ళ జీవితంలో రామలక్ష్మి 'మెరుపు తీగె', 'అవతలి గట్టు', 'ఆంధ్రనాయకుడు', 'మానని గాయం', 'నా కూతురు ఫెమినిస్ట్' తదితర నవలలు; 'ఎ సర్టిఫికెట్', 'అందుకో ఈ ప్రేమలేఖ', 'అందమైన పొరుగు', 'అద్దం', 'అదెక్కడ' లాంటి అసంఖ్యాక కథలతో తెలుగు సాహితీ ప్రపంచంలో శాశ్వతంగా స్థానం సంపాదించుకున్నారు. సంప్రదాయకతకు, ఆధునికతకు మధ్య సంధియుగంలోని మధ్యతరగతి కుటుంబాలు, ఆ కుటుంబాల్లోని ఆడపిల్లలు, భార్యలు ఎదుర్కొన్న అనేక సమస్యల గురించి, స్త్రీల హక్కుల గురించి, స్త్రీల ఇంటి చాకిరికి గుర్తింపు లేకపోవడం గురించి ప్రశ్నిస్తారు రామలక్ష్మి. కేవలం రచనలకే పరిమితం కాకుండా మహిళా సంక్షేమ సంస్థలతో కూడా కలసి పనిచేసిన రామలక్ష్మి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలసింది ఒకటుంది. 1970 ప్రాంతాల్లో ఆంధ్ర పత్రిక సచిత్ర వారపత్రికలో సుదీర్ఘంగా నడిచిన కె. రామలక్ష్మి 'ప్రశ్నలు–జవాబులు' శీర్షిక గురించి. ఎవరన్నా కొంటె ప్రశ్నలు వేస్తే అంతే చురుక్కు మనిపించేలా సమాధానం ఇచ్చేవారు. ఆ ఒక్క పేజీ పాఠకుల మొహాల్లో నవ్వుల పువ్వులు పూయించేది.

1960, 70 దశకాన్ని ఒక రకంగా మహిళా రచయితల దశకంగా చెప్పుకోవచ్చు. పాఠకుల్ని అందమైన ఊహాలోకంలో కలల ప్రపంచంలో విహరింపచేసే రచనలు ఒకవైపు, అపుడపుడే మొలకెత్తుతున్న స్త్రీ అస్తిత్వపు స్పృహ, చైతన్యం, అన్నిటినీ ప్రశ్నించే ధోరణులతో కూడిన రచనలు మరోవైపు– ఈ రెండు ధోరణులు సమాంతరంగా ప్రయాణించే సాహిత్య వాతావరణం కొత్తగా ఏర్పడింది. యద్దనపూడి సులోచనారాణి, కోడూరి కౌసల్యాదేవి, పోల్కంపల్లి శాంతాదేవి తదితర రచయిత్రులు మొదటి వర్గం కాగా ఆర్. వసుంధరాదేవి, ఆచంట శారదాదేవి, మాలతి చందూర్, తురగా జానకీరాణి, కళ్యాణ సుందరీ జగన్నాథ్, రంగనాయకమ్మ, వాసిరెడ్డి సీతాదేవి, కె. రామలక్ష్మి, అబ్బూరి ఛాయాదేవి, పి. శ్రీదేవి తదితరులు రెండో వర్గం.

నిజానికి అప్పట్లో యద్దనపూడి తదితరుల రచనా ధోరణే ప్రధాన ప్రవాహంగా, అన్ని రకాల ఆకర్షణలు, ఆదరణలు కలిగి ఉండేది. ఆకాశమార్గాన ప్రయాణించే ఆ సాహిత్యాన్ని భూమార్గం పట్టించి రంగనాయకమ్మ, కె. రామలక్ష్మి, ఆర్. వసుంధరాదేవి తదితరులు ఆచార సంప్రదాయాల పేరుతో, మాతృత్వం పేరుతో, ఆదర్శ గృహిణి పేరుతో స్త్రీల చుట్టూ కమ్మిన మాయా మోహపు తెరలను, బంగారు సంకెళ్ళను ఛేదించడానికి అహర్నిశలూ కృషి చేశారు. 60, 70 దశకాలలోని స్వర్ణయుగపు రోజులు అంతరించి తర్వాత కొంత కాలానికి రచయిత్రుల రచనలను హేళన చేసి చిన్నచూపు చూసే ఒక కొత్త పరిణామం తలెత్తినపుడు ఈ రెండో వర్గపు రచయిత్రులే ఆ అపప్రథ నుంచీ, అవమానం నుంచీ తప్పించి ఒక రకంగా రచయిత్రుల గౌరవానికి ప్రాణ ప్రతిష్ఠ కలిగించారని చెప్పుకోవచ్చు. అందుకే ఆర్.ఎస్. సుదర్శనం ఉన్నంత వరకూ ఆర్. వసుంధరా దేవి, ఆచంట జానకిరామ్ ఉన్నంత వరకూ ఆచంట శారదాదేవి, బుచ్చిబాబు ఉన్నంత వరకూ శివరాజు వెంకట సుబ్బలక్ష్మి, అబ్బూరి వరద రాజేశ్వరరావు ఉన్నంత వరకూ అబ్బూరి ఛాయాదేవి, ఆరుద్ర ఉన్నంత వరకూ కె. రామలక్ష్మి కూడా ఉంటారు. అయితే వాళ్ళ వెనక ఛాయలుగా, ప్రచ్ఛాయలుగా కాదు. వాళ్ళ పక్కనే సరి సమానంగా, సమాంతరంగా.

■ జి. లక్ష్మి

✆ 94907 35322



శివరాజు వెంకట సుబ్బలక్ష్మి



ఆర్. వసుంధరాదేవి



కె. రామలక్ష్మి



ఆచంట శారదాదేవి



అబ్బూరి ఛాయాదేవి


ఇస్మాయిల్ మాటతో సాహసించాను

నా మొదటి పుస్తకం

సిద్ధార్థ




కవిత్వం నన్ను నేను, నా లోపలి నానో (nano) విశాల, plural బ్రతుకు గమనం కోసం రాశాను. అద్దాల్లేని reflection కోసం కూడా. నీళ్ళు అడుగంటిపోయిన ఎండుదిబ్బల్లో కుంటల్లో ఈత వంటిది కవిత్వం అని తెలిసొచ్చింది, మొదటి కవిత్వం పుస్తకం వేసిన తర్వాతే (1994). ఒక సాయంత్రం గోదావరి ట్రెయిన్ ఎక్కుతూ మా పెద్దన్న కవి ఇస్మాయిల్ తల నిమురుతూ చెప్పిన వాక్యం నన్ను కవిత్వం అచ్చు వెయ్యడానికి ముందుకు తోసింది. "కవిత్వం నీ స్వంతం కాదు. నీదీ కాదు. అచ్చు వేసి కాలం లోకి విసిరి పారేసి... ట్రెయినెక్కి వెళ్ళిపో" అన్న ఇస్మాయిల్ గొంతు ఇప్పటికీ నన్ను వెంటాడుతూనే ఉంది. ఆ వాక్యాలే నన్ను 'దీపశిల'ను అచ్చు వేయడానికి సాహసంతో ముందుకు తోశాయి. దాని కంటే ముందు మునుపటేడులో వరుసగా నాపై కురిసిన విధ్వంస విదారక అనుభవ దినాలు... రంజని అత్యుత్తమ కవిత్వ పురస్కారాలు. శ్రీ కల్లూరి భాస్కరంగారు, కె. శ్రీనివాస్‌గారు... కవిత్వ ఎంపికల్లోని గ్రూపు రాజకీయాల కుట్రలపై సాహిత్య మాఫియా కదలికల గురించి లక్డీకాపూల్ ఇరానీ హోటల్స్ ఛాయ్ ముచ్చట్లలో చాంద్ బిస్కట్లను ముంచుకుంటూ తిన్న దినాలు, మొదటి పుస్తకం వేసేందుకు పటం గట్టి ముందుకు తోసినాయి. 'నెల నెలా వెన్నెల' కర్త కర్మ క్రియ పూజ్యులు శ్రీ సి.వి. కృష్ణారావు గారి సత్సంగం, సుమనశ్రీ గారి సోపతి అప్పటి అస్తిత్వ రోదనల ఆపతి నన్ను 'దీపశిల' వేయటానికి పురికొల్పాయి. నా కవిత్వానుభవ జీవితమ్మీద హిమోహ రాగ సమ్మోహనం చేసిన వద్దెర చండీదాస్ అంటే ఇష్టం నాకు. బుచ్చిబాబును తన లోనాభిలో చుట్టుకొని తనదైన కవిత్వ వచనాన్ని దిద్దుకొని పాఠకానుభవానికి తాత్త్విక కల్పనను శృతిపరిచిన చండీదాస్‌తో.. నాలుగు మాటలు 'దీపశిల' కవిత్వం మీద రాయించాలన్న కోరికను ఎమ్మెస్ నాయుడుతో ఎక్స్‌ప్రెస్ చేసాను. అది వాస్తవమయ్యింది. తిరుపతిలో భవానీపురా లోని అపార్ట్‌మెంట్‌లో వొకే వొక్క గదిలో మంచం మీద స్పైనల్ ఇంజురీకి ట్రీట్‌మెంట్ తీసుకుంటూ పడుకొని ఉన్న తనని కలిసి నా హైదరాబాదీయతను పంచుకున్నాను. అనాహతనాద ప్రస్తావన, గీతాదేవి స్వప్నరాగలీనల పాత్రల నా పాఠకానుభవాన్ని పంచుకున్నాను. నా కవిత్వమ్మీద కొన్ని మాటలు రాయమన్నాను. కవిత్వం తనకు అర్థం కాదన్నాడాయన. రెండు మూడు కవితలు చదివాను. అవి వినగానే.. పడుకునే విన్న ఆయన కండ్లల్లోంచి కన్నీళ్ళు వొలికిపోతుండడం ఇప్పటికీ మర్చిపోలేను. నేను ఇంటికి చేరుకున్న రెండు రోజుల్లోనే 'మహాహం'గా తన



ముందుమాట చేరుకుంది. దానిని తన లిపి లోనే పలకరించాను. మా పాఠకుల అన్న నాళేశ్వరం శంకరం, బోనగిరి ఆంజనేయులు, అసుర తత్త్వకత్వల విచారం, మెరుపుల మలుపులూ, ఏలె లక్ష్మణ్ స్వచిత్రరేఖల గాత్రాలూ, హైద్రాబాదీ ఆబాదీ ఫొటోల జీవ వాద్యకారుడు గోవిందన్నా, నున్నా నరేశ్, పసునూరి శ్రీధర్ బాబూ, ముక్కామల చక్రధర్, చల్లా రామఫణుల కవిత్వ పఠనాల గజల్ ముషాయిరాలూ, హెచ్చార్కేల, 'గుల్షన్' స్నేహాల నుంచి, అలా నా కవిత్వ ప్రస్థానం మొదలయింది పయిలంగా అభద్రంగా.. నాపరాళ్ళను పరుసుకుంటూ వేసుకుంటూ, చింతలగతిని గీసుకుంటూ, మోసుకుంటూ, నడిచి నిలిచిందే నా మొదటి పుస్తకం 'దీపశిల'. దీని కతల కమామీషంతా తెలుగు పాఠకానుభవానికింకా మూసిన కిటికీ రెప్ప అనే తోస్తుంటుంది నాకు.

✆ 73306 21563



డ్రాయింగ్ బుక్

దశాబ్దాల క్రితం
బాల్యంలో బ్రష్‌ను ముంచి
డ్రాయింగ్ బుక్‌లో
పచ్చని చెట్లూ గుట్టలూ
ఆ పక్క ప్రవహిస్తున్న నదీ
అందంగా గీసాను
అంతా మెచ్చుకున్నారు

ఇవ్వాళ ఇంట్లో దేనికోసమో
అటక మీదినుంచి
దుమ్ముపట్టిన ఓ పాత ముల్లె
తీశాను

విప్పి చూద్దును కదా
అందులో నా చిన్నప్పటి
పాత డ్రాయింగ్ బుక్ కనబడింది

ఉత్సాహంగా పేజీ తిప్పాను
ఎండిపోయిన చెట్లూ
కరిగిపోయిన గుట్టలూ
ఆ పక్కనే పారుతున్న
కన్నీళ్ళూ కనిపించాయి

నా ముఖం వాడిపోయింది

■ వారాల ఆనంద్

మఖ్దూమ్ మొహియుద్దీన్ పురస్కారం

సిటీ కాలేజ్ మఖ్దూమ్ మొహియుద్దీన్ జాతీయ పురస్కారం (2025) ప్రదానోత్సవ సభ ఫిబ్రవరి 24 ఉ.11గంటలకు హైదరాబాద్ లోని ప్రభుత్వ సిటీ కళాశాల ఆజామ్ హాల్లో జరుగుతుంది. పురస్కార స్వీకర్త నలిమెల భాస్కర్. అధ్యక్షత పి. బాలభాస్కర్, ముఖ్య అతిథి వెలుదండ నిత్యానందరావు, అతిథులు దేవులపల్లి అమర్, యాకూబ్, అన్నవరం దేవేందర్.

కోయి కోటేశ్వర రావు

మాడభూషి రంగాచార్య కథా పురస్కారం

మాడభూషి రంగాచార్య స్మారక కథా పురస్కారానికి పి. శ్రీనివాస్ గౌడ్ 'మార్జినోళ్ళు' కథా సంపుటి ఎంపిక అయ్యింది. పురస్కార ప్రదాన సభ ఫిబ్రవరి 25 సా.5.30గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. అధ్యక్షులు సుధామ, ముఖ్య అతిథి విహారి, పుస్తక పరిచయం నాళేశ్వరం శంకరం. ముగ్గురు సీనియర్ రచయిత్రుల కథా విశ్లేషణ సంకలనం 'నేటి కాలపు మేటి రచయితలు' పుస్తకావిష్కరణ కూడా ఉంటుంది.

మాడభూషి లలితాదేవి

కొలకలూరి పురస్కారాలు

కొలకలూరి సాహిత్య పురస్కారాల ప్రదానం కార్యక్రమం ఫిబ్రవరి 26 సా.6గంటలకు ఎన్టీఆర్ ప్రాంగణం, తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. జూకంటి జగన్నాథం, టేకుమళ్ళ వెంకటప్పయ్య, గడ్డం మోహనరావు పురస్కారాలు స్వీకరిస్తారు. ముఖ్యఅతిథి డి. మాణిక్య వరప్రసాద్, అధ్యక్షత కొలకలూరి మధుజ్యోతి, విశిష్ట అతిథి కొలకలూరి సుమకిరణ్. పి.వాసు, ఎ. అనురాధ, యం. సుబ్బరాజు పరిశోధన సన్మానం అందుకుంటారు.

కొలకలూరి ఇనాక్

'తడి ఆరని వాక్యమొకటి' కవితా సంపుటి

సుధామురళి తొలి కవిత్వ సంపుటి 'తడి ఆరని వాక్యమొకటి' ఆవిష్కరణ మార్చ్ 2 ఉ.10గంటలకు నెల్లూరు టౌన్ హాల్‌లో జరుగుతుంది. ప్రసేన్, విమల, ముక్కామల చక్రధర్, శ్రీరామ్ పుప్పాల, గోపాల్ సుంకర, పెరుగు రామకృష్ణ, ఈతకోట సుబ్బారావు ప్రసంగిస్తారు.

ముక్కామల చక్రధర్

'నేల తడుముతూనే' కవితా సంపుటి

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాలు – తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గుండెల్లి ఇస్తారి కవితా సంపుటి 'నేల తడుముతూనే' ఆవిష్కరణ మార్చ్ 2 ఉ.10గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఆవిష్కర్త నందిని సిధారెడ్డి, అధ్యక్షత కందుకూరి శ్రీరాములు, విశిష్ట అతిథి నాళేశ్వరం శంకరం, ఆత్మీయ అతిథులు రూప్ కుమార్ డబ్బీకార్, కొండపల్లి నీహారిణి, ధూళిపాళ అరుణ, బెల్లంకొండ సంపత్ కుమార్.

కందుకూరి శ్రీరాములు

కథానికల పోటీ

భూపతి చంద్ర స్మారక సంస్థ నిర్వహిస్తున్న కథానికల పోటీకు సమకాలీన సామాజిక సమస్యలను ప్రతిబింబించే ఇతివృత్తాలతో, సున్నితమైన వ్యంగ్య, హాస్యాలతో కూడిన కథానికలను పంపాలి. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు. ఐదు ప్రోత్సాహక బహుమతులు ఒకొక్కరికి రూ.1,000. కథానికలను మార్చ్ 10లోగా చిరునామా: సమన్వయకర్త, 'భూపతి చంద్ర' స్మారక కథానికల పోటి, ఆనంద నిలయం, ఇం.నం. 1-5-1020/4, బి.ఆర్. రావు నగర్, ఓల్డ్ ఆల్వాల్, సికింద్రాబాద్ – 500010కు పంపాలి. వివరాలకు ఫోన్: 9963616999.

ఎమ్.ఎల్. కాంతారావు

కథా సంపుటాలకు ఆహ్వానం

'వెన్నెల సాహితీ పురస్కారం– 2024' కోసం 2023, 2024 సంవత్సరాలలో ప్రచురించిన కథా సంపుటాలు నాలుగు కాపీలను మార్చ్ 31లోగా పంపాల్సిన చిరునామా: పర్కపెల్లి యాదగిరి, ఇం.నెం.17-3-86/35, జ్యోతి నిలయం, వినాయక్ నగర్ రోడ్ 2, సిద్దిపేట – 502103. వివరాలకు ఫోన్: 9299909516. సిద్దిపేటలో జరుగు కార్యక్రమంలో నగదు పురస్కారం అందుతుంది.

వెన్నెల సాహితీ సంగమం



ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న బండి సంజయ్

వరి వద్దంటే కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి..

- ఆ పార్టీని గెలిపిస్తే 14 నెలల్లో ఏం ఒరిగింది?
- కాళేశ్వరంను సర్వనాశనం చేసింది బీఆర్ఎస్, కాంగ్రెస్‌లే..
- కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఏమయ్యాయి..
- ఎమ్మెల్సీగా బీజేపీయేతర అభ్యర్థులను గెలిపిస్తే కాంగ్రెస్ గూటికే...
- ఎమ్మెల్సీ ప్రచారంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

6



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

పక్కా ప్లాన్‌తోనే హత్య

- వీడిన రాజలింగమూర్తి హత్య కేసు మిస్టరీ
- రెండు భూ వివాదాలే హత్యకు కారణం
- రెండు నెలల ముందే స్కెచ్.. అదును చూసి దాడి
- పది మందిపై కేసు నమోదు
- ఏడుగురి అరెస్టు, పరారీలో ముగ్గురు
- వివరాలు వెల్లడించిన భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

6

'రిజర్వేషన్ల'పై గుబులు



- స్థానిక ఎన్నికల్లో మారనున్న సమీకరణాలు
- జడ్పీ నుంచి సర్పంచ్ వరకు ఇదే తీరు
- ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు మళ్లీ ఉండవు
- పూర్తి స్పష్టత లేక నేతల్లో తర్జనభర్జన
- ఆశావహుల్లో పెరుగుతున్న అయోమయం
- రొటేషన్ పద్ధతి రిజర్వేషన్లతో మారుతున్న నాయకుల తీరు

హనుమకొండ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల రిజర్వేషన్లు మారనుండడంతో ఆశావహుల్లో సమీకరణలు మారుతున్నాయి. పంచాయతీ ఎన్నికలకన్నా ముందే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరగనున్నట్టు తెలుస్తుండడంతో ప్రాదేశిక ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న నేతలు రిజర్వేషన్ల విషయంలో తర్జనభర్జన పడుతున్నారు. తాము పోటీ చేయదలుచుకున్న స్థానం దేనికి రిజర్వేషన్ అవుతుందో స్పష్టత లేక సందిగ్ధ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు గత ప్రభుత్వం రెండు విడతలుగా వర్తించేలా 2018లో పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకువచ్చింది. అయితే డిసెంబర్‌లో నిర్వహించిన శాసనసభ సమావేశాల్లో పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు - 2024 ఆమోదం పొందటంతో ఒకే దఫా మాత్రమే రిజర్వేషన్లు అమలు కానున్నది. ఫలితంగా ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు మారనున్నాయి. దీంతో ప్రాదేశిక ఎన్నికల్లో పోటీ చేయాలని ఉత్సాహపడుతున్న నేతల్లో కొత్త రిజర్వేషన్లు ఎలా ఉంటాయోననే ఆసక్తి నెలకొన్నది. రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు మారనుండడంతో తమ పంథాను మార్చుకుంటున్నారు. రిజర్వేషన్ల కేటాయింపుల్లో తొలుత ఎస్టీలకు రిజర్వు స్థానాలు కేటాయిస్తారు. ఎస్టీ తర్వాత స్థానంలో రొటేషన్ పద్ధతిలో ఎస్సీ, అనంతరం బీసీకి రిజర్వు చేస్తారు. ఈ లెక్కన జడ్పీటీసీ, ఎంపీటీసీతో పాటు జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవుల రిజర్వేషన్లలో మార్పులు ఉండనున్నాయి.

అప్పట్లో రెండు నెలల ముందే..

ప్రాదేశిక నియోజకవర్గాల పాలకవర్గాల గడువు కిందటేడు జూలై 4వ తేదీతో ముగిసింది. నిజానికి పాలకవర్గాల గడువు ముగియగానే మూడు నెలల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. కానీ గత ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వాయిదా వేస్తూ వచ్చింది. నిజానికి ఇదే ప్రభుత్వం అంతకుముందు 2019లో అప్పటి వర్గాల గడువు ఐదేళ్లు ముగియకముందే.. రెండు నెలల ముందు గానే అంటే మే 15న ప్రాదేశిక ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసింది. దీంతో అప్పుడు ఎన్నికైన కొత్త పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టడానికి రెండు నెలలు వేచి ఉండాల్సి వచ్చింది. 2019లో కొలువుదీరిన పాలక వర్గాల ఐదేళ్ల గడువు 2014 జూలైలో ముగిసిన వెంటనే ఎన్నికలు జరగకపోవడంతో అప్పటి నుంచి జిల్లా పరిషత్‌లు, ఎంపీటీసీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది.

మొదలైన కసరత్తు

జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల ఎన్నికల నిర్వహణకు కసరత్తు మొదలైంది. ఈ స్థానాల ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ముసాయిదా తుది జాబితాల ప్రచురణ ఈనెల 15వ తేదీతో ముగిసింది. ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల నియామకం కూడా పూర్తయింది. సిబ్బందికి శిక్షణ కూడా ఇస్తున్నారు. ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు తలమునకలై ఉన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు ఎప్పుడైనా నిర్వహించడానికి జిల్లా యంత్రాంగాలు సర్వసన్నద్ధంగా ఉన్నాయి.

పునర్విభజనతో..

2019లో ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగి జడ్పీలు కొలువు దీరిన తర్వాత తదనంతర కాలంలో కొన్ని జిల్లాలు, మండలాల పునర్విభజన జరిగింది. దీంతో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో మార్పు జరిగింది. ఒక జిల్లాలో ఉన్న జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు మరో జిల్లా పరిధిలోకి వెళ్లాయి. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాలు హనుమకొండ, వరంగల్ జిల్లాలుగా మారడం, ములుగు జిల్లా కొత్తగా ఏర్పాటు కావడం ఇందుకు ఉదాహరణ. అయితే అప్పటికే జిల్లా పరిషత్తులు, మండల పరిషత్తులు కొలువు తీరడంవల్ల అవి ఇప్పటివరకు పాత జిల్లాల పరిధిలోనే కొనసాగుతూ వస్తున్నాయి. ఇప్పుడు ప్రాదేశిక ఎన్నికలను కొత్తగా చేరిన జడ్పీటీసీలు, ఎంపీటీసీలను కలుపుకొని ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది.

పునర్విభజనకు ముందు..

పునర్విభజనకు ముందు హనుమకొండ అర్బన్ జిల్లాలో 7 జడ్పీటీసీలు ఉండేవి. అవి హసన్‌పర్తి, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్, వేలేరు, ధర్మసాగర్, ఐనవోలు. పునర్విభజన ఫలితంగా ఐదు మండలాలు ఆత్మకూరు, శాయంపేట, దామెర పరకాల, నడికుడ మండలాలు హనుమకొండ జిల్లా పరిధిలోకి వచ్చాయి. దీనితో ఈ జిల్లాలో జడ్పీటీసీ స్థానాల సంఖ్య 12కు పెరిగింది. అలాగే అంతకు ముందు ఎంపీటీసీలు 86 ఉండేవి. కొత్త మండలాలు వచ్చి చేరడంతో వీటి సంఖ్య ప్రస్తుతం 130కి చేరింది. మూడేళ్ల కిందట మండలాల పునర్విభజనతో రెండు మండలాలు సీరోలు, ఇనుగుర్తి మహబూబాబాద్ జిల్లాలో చేరాయి. దీంతో ఈ జిల్లాలో జడ్పీటీసీల సంఖ్య 16కు చేరింది. ఎంపీటీసీ స్థానాల సంఖ్య 198కి చేరింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోకి గోరికొత్తపల్లి వచ్చి చేరింది. దీంతో ఈ జిల్లాలో జడ్పీటీలు, ఎంపీటీసీల స్థానాలు పెరిగాయి.





జడ్పీటీసీలు, ఎంపీటీసీలు

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో 71 జడ్పీటీసీలు, 1,030 ఎంపీటీసీలు ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో ప్రస్తుతం 12 జడ్పీటీసీలు, 102 ఎంపీటీసీలు, 210 జీపీలు ఉన్నాయి. వరంగల్ జిల్లా పరిధిలో 11 జడ్పీటీసీలు, 134 ఎంపీటీసీలు, 325 జీపీలు, జనగామ జిల్లా పరిధిలో 12 జడ్పీటీసీలు, 128 ఎంపీటీసీలు, 281 జీపీలు, మహబూబాబాద్ జిల్లా పరిధిలో 16 జడ్పీటీసీలు, 198 ఎంపీటీసీలు, 461 జీపీలు, ములుగు జిల్లా పరిధిలో 8 జడ్పీటీసీలు, 72 ఎంపీటీసీలు, 150 జీపీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలో 11 జడ్పీటీసీలు, 102 ఎంపీటీసీలు, 240 జీపీలు ఉన్నాయి.

బీజేపీకి తొత్తులుగా బీఆర్ఎస్ నాయకులు

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో మతోన్మాదులకు బీఆర్ఎస్ పరోక్ష మద్దతు
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

న్యూశాయంపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీఆర్ఎస్ నాయకులు బీజేపీకి తొత్తులుగా మారారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు విమర్శించారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం పార్టీ జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీనివాస్‌రావు హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేయకుండా మతోన్మాదులకు సహకరిస్తోందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు పరోక్షంగా సహకరిస్తూ వారి గెలుపునకు మద్దతునిస్తున్నారన్నారు. మరోవైపు ప్రజావ్యతిరేక తను నిండా మూటగట్టుకున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. కాంగ్రెస్ పార్టీకి కమ్యూనిస్టులు సహకరిస్తున్నారని కమ్యూనిస్టులపై అక్కసు వెళ్లగక్కుతున్నారన్నారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టుల గురించి మాట్లాడే నైతిక అర్హత కేసీఆర్‌కు లేదన్నారు. దేశంలో సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా గ్రామ గ్రామాన సీపీఐ శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, మంచాల రమాదేవి, మద్దెల ఎల్లేష్, కర్రె లక్ష్మణ్, ఉట్కూరి రాములు, కొట్టెపాక రవి తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రద్దు చేసినట్లు కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణి రద్దు విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి కలెక్టరేట్‌కు రావొద్దన్నారు. వచ్చే సోమవారం యథావిధిగా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

వరంగల్‌లో..

వరంగల్ కలెక్టరేట్: ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈ వారం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయం గమనించి కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.

నేడు బల్దియాలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్: నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ వారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు.



నజర్ పట్నాల భక్తుల సందడి

మల్లన్న శైవక్షేత్రంలో భక్తుల సందడి

ఐనవోలు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి సమీపించిన వేళ.. ఐనవోలు మల్లికార్జునస్వామి వారాంతపు జాతరకు ఆదివారం వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం రాత్రి వరకు ఆలయం కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఆకాశమే పందిరిగా ఆరుబయట విడిదిచేశారు. స్వామి వారికి ఉదయం మేలుకొలుపు తర్వాత శైవాగమ పద్ధతిలో అర్చకులు విశేష అభిషేకాలు కల్యాణం నిర్వహించి రుద్రాభిషేకాలు జరిపారు. ఆయా జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో నజర్, చెలక పట్నాలు వేసి బోనం వండి స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఒగ్గు పూజారులు నజర్, చిల్క పట్నాల వద్ద పూర్వీకులను స్తుతించారు. ఆపదల నుంచి గట్టెక్కించి కోర్కెలు తీర్చమని మల్లన్నను భక్తులు వేడుకున్నారు. మొక్కుల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు భక్తులు ఒడి బియ్యం, వస్త్రాలు, ముత్తైదు సామగ్రిని ముట్టచెప్పగా కొందరు రథసేవను నిర్వహించారు. రథంలో ఉత్సవవిగ్రహాలను పెట్టి ఆలయం చుట్టూ లాగుతూ ప్రదక్షిణలు చేశారు. ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.



గజ్జెల లాగులు పూసల అంగిలతో భక్తులు





రిటైర్మెంట్‌లో గోల్‌మాల్

అంగన్‌వాడి హెల్పర్ల వయస్సు నిర్ధారణలో అవకతవకలు

- 65 ఏళ్లు నిండని వారికి సైతం ఉద్యోగ విరమణ
- తక్కువ వయస్సున్నా.. ఏళ్లు నిండినట్లు అధికారుల చిత్రీకరణ
- వైద్య పరంగా వయస్సు నిర్ధారణ పరీక్షలకు హెల్పర్లు
- పరీక్షల్లో తక్కువ వయస్సు ఉన్న వారి గుర్తింపు
- వైద్య విభాగ నిర్ధారణ సర్టిఫికెట్లను పట్టించుకోని అధికారులు

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ హెల్పర్ల ఉద్యోగ విరమణల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయి. హెల్పర్ల రిటైర్మెంట్ వయస్సును అధికారులే తమ ఇష్టారాజ్యంగా నిర్ధారిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 65 ఏళ్లు పూర్తయితే హెల్పర్ల రిటైర్మెంట్ జరగాలి. అయితే ఈ వయస్సు కంటే తక్కువగా ఉన్న వారిని సైతం అధికారులు రిటైర్మెంట్ అయినట్లుగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ వ్యవహారంలో అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల్లో కొందరు డబ్బులు ఇచ్చిన వారికి తక్కువ వయస్సు నమోదు, ఇవ్వనివారిని 65 ఏళ్లు నిండినట్లుగా నమోదు చేసి ఆ మేరకు రిటైర్మెంట్ చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మరో విషయం ఏమిటంటే.. వైద్యపరమైన పరీక్షలతో తమ వయస్సు 65 ఏళ్లు నిండలేదని నిరూపించుకున్న హెల్పర్ల నుంచి జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇచ్చిన వారిని విధుల్లోకి తీసుకుంటూ.. ఇవ్వని వారిని పక్కన పెడుతున్నారనే ప్రచారం జరుగుతోంది. మొత్తంగా అంగన్‌వాడీ హెల్పర్ల రిటైర్మెంట్‌లో కొందరు జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది గోల్‌మాల్ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వయస్సు నిర్ధారణకు వైద్య పరీక్షలు

రిటైర్మెంట్ వివాదాస్పదంగా మారడం, హెల్పర్లు నిలదీయడంతో చివరకు అధికారులు వయస్సు నిర్ధారణ కోసం వైద్య రంగాన్ని ఆశ్రయించారు. ఈ మేరకు కాకతీయ మెడికల్ కళాశాలలో వైద్యులు నిర్ధారణ పరీక్షలు జరిపారు. ఫోరెన్సిక్, టాక్సీకాలజీ విభాగంలోని వైద్యులు హెల్పర్ల శారీరక పటుత్వం, దంతాలు, రేడియోలాజికల్ పరీక్షల వంటి ప్రమాణాల ద్వారా హెల్పర్ల వయస్సును నిర్ధారించారు. ఆ మేరకు వయస్సు ధృవీకరణ పత్రాన్ని కూడా జిల్లా సంక్షేమ శాఖ అధికారులకు పంపించారు. ఈ పరీక్షల్లో చాలా మంది హెల్పర్లకు వయస్సు 65 ఏళ్ల కంటే తక్కువగానే ఉన్నట్లు వైద్య పరీక్షల ద్వారా నిర్ధారణ జరిగింది. అధికారులు నిర్ధారించిన వయస్సు విషయం లోపాయికారిక ఉన్నట్లు బహిర్గతమైంది.

65 ఏళ్లు నిండకుండానే..

అంగన్‌వాడీ హెల్పర్ల రిటైర్మెంట్ వయస్సు 65 ఏళ్లు. అయితే ఉమ్మడి జిల్లాలో వందల సంఖ్యలో ఈ వయస్సు నిండని హెల్పర్ల రిటైర్మెంట్‌ను అధికారులు ప్రకటించారు. రిటైర్మెంట్ తదుపరి వచ్చే రూ.లక్ష వివరాలను కూడా తెలియచేశారు. అయితే తమకు ఇంకా 65 ఏళ్లు నిండలేదని, ఎలా రిటైర్ చేస్తారంటూ అన్యాయానికి గురైన హెల్పర్లు అధికారులను ఆశ్రయించి తమ గోడును వెల్లగక్కారు. ఇందులో కొందరు అధికారులు కొంతమంది నుంచి గుట్టుచప్పుడు కాకుండా డబ్బులు దండుకొని వ్యవహారాన్ని సరి చేస్తామని చెప్పినట్లు సమాచారం. సాధారణంగా హెల్పర్లలో అత్యధిక శాతం 7వ తరగతి కంటే ఎక్కువగా చదివిన వారే ఉన్నారు. వీరిలో చాలామంది పుట్టిన తేదీ వివరాలు సక్రమంగా లేవు ఆధార్ కార్డులోనూ వయస్సు తప్పుగా నమోదు జరిగింది. అధికారులు మాత్రం ఆధార్‌కార్డు పుట్టిన తేదీనే ప్రమాణికంగా చేసుకొని రిటైర్మెంట్ చేస్తున్నట్లు హెల్పర్లకు తెలియచేశారు. ఇందులో డబ్బులు దండుకునే ప్రణాళికతో ఉన్న అధికారులు ఇతర సిబ్బంది, దళారులు హెల్పర్లకు ఆధార్ కార్డులో పుట్టిన తేదీ వివరాలను సరి చేయించి వయస్సు తక్కువగా వేస్తామని ఆశచూపి ఆ మేరకు దండుకున్నట్లు ప్రచారంలో ఉంది.

నిర్ధారణ జరిగినా తాత్సారమే..

వైద్య విభాగం పరంగా 65 ఏళ్ల కంటే తక్కువ వయస్సు గల హెల్పర్ల గుర్తింపు జరిగింది. అయినా అధికారులు మాత్రం వీరిని విధుల్లోకి తీసుకోవడం లేదు. ఈ పరిణామాలతో హెల్పర్లు ఆవేదన చెందుతున్నారు. తమ ఉద్యోగాలు కొనసాగింపు విషయంలో ఆందోళనతో ఉన్నారు. వేతనం కూడా అందక సతమతమవుతున్నారు. ఇక అధికారులు, సిబ్బంది, దళారులు మాత్రం వయస్సు నిర్ధారణ జరిగినా.. డబ్బులు ముట్టజెప్పితే పనులు చక్కబెడుతామనే బేరసారాలు జోరుగా నడుపుతున్నారు. కొందరు హెల్పర్లు డబ్బులు ఇచ్చి కూడా ఇంకా పని జరగకపోవడంతో గందరగోళానికి గురవుతున్నారు. ఈ వ్యవహారంలో తమకు న్యాయం చేయాలని హెల్పర్లు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం ఉండడం లేదు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

ఉపాధ్యాయ, అధ్యాపకుల సంక్షేమమే ధ్యేయం

టీచర్స్ జేఏసీ ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ, అధ్యాపకుల సంక్షేమమే తన ధ్యేయమని టీపీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ టీచర్స్ జేఏసీ ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ, కాళోజీ జంక్షన్, అంబేడ్కర్ జంక్షన్ నుంచి భవానీనగర్, వడ్డెపల్లి మీదుగా ఎన్జీవోస్ కాలనీలోని రోజ్‌గార్డెన్ వరకు టీచర్స్ జేఏసీ నాయకులతో కలిసి భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. అనంతరం రోజ్ గార్డెన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే జీవో 317 వల్ల స్థానికత కోల్పోయిన వారికి స్థానికత కల్పించేందుకు కృషి చేస్తానని అన్నారు. స్పౌజ్‌లకు అంతర్ జిల్లా, కేంద్ర ప్రభుత్వ స్పౌజ్‌లకు హైదరాబాద్ స్పౌజ్‌లకు ఇప్పించడంతోపాటు మ్యూచ్‌వల్ బదిలీల వల్ల సర్వీస్ కోల్పోయిన ఉపాధ్యాయులకు సర్వీస్ ఇప్పించడం తన కర్తవ్యమని పేర్కొన్నారు. 2003 డీస్సీ ఉపాధ్యాయులకు 57/4, 57/5 మెమోలను అమలు చేయిస్తూ పూర్తిగా సీపీఎస్‌ను ఓపీఎస్‌లోకి మార్పించడమే తన ప్రధాన ఎన్నికల ఎజెండా అని హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఎయిడెడ్ స్కూళ్లు, కాలేజీలను ప్రభుత్వంలో మెర్జ్ చేయించి వారికి 010, హెల్త్‌కార్డులు ఇప్పిస్తానని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల, అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఓరుగల్లు డిక్లరేషన్

ఓరుగల్లు డిక్లరేషన్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆదివారం ప్రకటించారు. వరంగల్ భద్రకాళి అమ్మవారి సాక్షిగా డిక్లరేషన్ ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. రాబోయే రెండు విద్యాసంవత్సరాల కాలంలో డిక్లరేషన్‌లో పొందుపర్చిన అంశాలను పరిష్కరించకపోతే ఇదే భద్రకాళి అమ్మవారి పాదాల సాక్షిగా తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. వచ్చే దసరా లోపు ఏకీకృత సర్వీస్ రూల్స్ ఈ ప్రభుత్వాన్ని ఒప్పించి సాధిస్తానని పేర్కొన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు 2.60 లక్షల మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరే విధంగా సీపీఎస్ రద్దు చేయించి పూర్వ పెన్షన్ విధానాన్ని అమలు చేయించేందుకు కృషి చేస్తానని అన్నారు. వేసవి సెలవులలో బదిలీలు జరిగేలా క్యాలెండర్ ప్రకటిస్తానని చెప్పారు. అన్ని గురుకులాల్లో పనిచేస్తున్న జేఎల్/డీఎల్/ ప్రిన్సిపాళ్లకు గెజిటెడ్ హోదా కల్పించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. గురుకుల ఉద్యోగులకు 010 వేతనాలు, ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యేలా టైం టేబుల్‌లో మార్పు చేయిస్తానని స్పష్టం చేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 వేతనాలు, హెల్త్ కార్డులు, హిందీ సబ్జెక్టుల్లో పీజీటీ, జేఎల్ పోస్టులు మంజూరు చేయిస్తానని తెలిపారు. మహిళా ఉపాధ్యాయులు చైల్డ్ కేర్ లీవ్ వాడుకోవడంలో ఉన్న అంక్షలను తొలగిస్తూ సర్వీస్ కాలంలో ఎప్పుడైనా వాడుకునేలా అవకాశాన్ని కల్పించేందుకు పాటుపడుతానని తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు చక్రవర్తుల శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, మోతీలాల్, శ్రావన్, రాజేంద్రాచారి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్లాన్‌తోనే హత్య

- వీడిన రాజలింగమూర్తి హత్య కేసు మిస్టరీ
- పది మందిపై హత్య కేసు నమోదు
- ఏడుగురి అరెస్టు, పరారీలో ముగ్గురు
- వివరాలు వెల్లడించిన భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే



విలేఖరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): భూ వివాదాల్లో జోక్యం చేసుకోవడం, కోర్టులను ఆశ్రయించడమే సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి ప్రాణాలకు ముప్పును తెచ్చిపెట్టింది. ఆయన హత్యకు రెండు భూవివాదాలే కారణమని పోలీసులు తేల్చారు. ఈ కేసులో పది మంది ఉండగా వీరిలో బీఆర్‌ఎస్ నేత, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రమేయం ఉందని పోలీసులు గుర్తించారు. రాజలింగమూర్తి హత్యకు రెండు నెలల కిందటే పక్కా ప్లాన్ వేశారని, అదును చూసి ఆయనపై దాడి చేసి చంపారని పోలీసుల విచారణలో తేలింది. ఈ మేరకు భూపాలపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో కేసు పూర్వపరాలను ఎస్పీ కిరణ్ ఖరే వెల్లడించారు.

భూపాలపల్లి పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న సర్వే నెంబర్ 319లోని 2.25 ఎకరాల భూమి విషయంలో ఏ1 నిందితుడిగా ఉన్న రేణికుంట్ల సంజీవ్, వారి కుటుంబీకులకు వివాదం నడుస్తోంది. నిందితుల కుటుంబీకుల నుంచి మోసపూరితంగా రాజలింగమూర్తి కొంతభూమిని తన పేరు మీద రాయించుకున్నాడు. అప్పటి నుంచి నిందితుల కుటుంబ సభ్యులతో తగాదా నడుస్తోంది. ఈ విషయంలో ఇరువురు కోర్టుకు సైతం వెళ్లారు. దీంతో రేణికుంట్ల సంజీవ్ కక్షగట్టాడు. లింగమూర్తిని చంపేస్తే మనకు భూమి వస్తుందని, అదును కోసం ఎదురు చూస్తున్నానని తమ కుటుంబ సభ్యులు, బంధువులతో తరచూ చెప్పేవాడు. ఇదే క్రమంలో భూపాలపల్లిలోని ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న 323 సర్వే నెంబర్‌లోని 16 గుంటల భూమి విషయంలో హనుమకొండకు చెందిన అడ్వకేట్‌కు సంబంధించిన భూమి విషయంలో రాజలింగమూర్తి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ హరిబాబు మధ్య వివాదం నడుస్తోంది. చనిపోయిన లాయర్ తరఫున ఆ భూమి విషయంలో హరిబాబుతో రాజలింగమూర్తికి గొడవలు జరుగుతున్నాయి. తనకు జరిగిన అన్యాయంపై రాజలింగమూర్తిని చంపేస్తానని గతంలో సంజీవ్ అనేకసార్లు హరిబాబుకు చెప్పి ఉన్నాడు. రాజలింగమూర్తి తనకు కూడా శత్రువు కాబట్టి అతడిని చంపేస్తే బెయిల్ ఖర్చులు, మిగతావి ఏమైనా ఉన్నా చూసుకుంటానని సంజీవ్‌కు హరిబాబు మాటిచ్చాడు. దీంతో అప్పటి నుంచి రాజలింగమూర్తిని హత్య చేసేందుకు సంజీవ్ అదును కోసం ఎదురు చూస్తున్నాడు.

కాశీబుగ్గలో కత్తులు, రాడ్డు కొనుగోలు

లింగమూర్తిని ఎప్పటికైనా హతమార్చాలనే కక్షితోనే ఉన్న సంజీవ్ రెండు నెలల కిందటే తన బంధువు మోరే కుమార్‌లతో కలిసి వరంగల్‌లోని కాశీబుగ్గ ప్రాంతంలో రెండు కత్తులు, ఒక రాడ్డు కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి లింగమూర్తి కదలికలను గమనిస్తూ వచ్చారు. ఈ నెల 19న ఓ కేసు విషయంలో సంజీవ్ కోర్టుకు హాజరయ్యాడు. ఆ సమయంలో రాజలింగమూర్తి ఆయనకు తారసపడినట్లు ఎస్పీ తెలిపారు. దీంతో కోపోద్రిక్తుడైన సంజీవ్ ఇదివరకే చర్చించిన తన బంధు మిత్రులకు ఫోన్ చేసి ఈ రోజు ఎలాగైనా రాజలింగమూర్తిని చంపుదామని చెప్పాడు. రాజలింగమూర్తి వెంట వస్తూ అతడి కదలికలు గమనించి తనకు సమాచారం ఇవ్వాలని దాసరి కృష్ణ, నరేష్‌కు పురమాయించాడు. సంజీవ్‌తో పాటు కొత్తూరి కిరణ్, మోరే కుమార్, పింగిలి సేమంత్ నలుగురు సంజీవ్ ఇంటి దగ్గర దాచిన కత్తులు, రాడ్లను తీసుకొని రాజలింగమూర్తి ఇంటికి సమీపంలో మాటు వేశారు. ఈ క్రమంలో సాయంత్రం 6:45 గంటల సమయంలో రాజలింగమూర్తి భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్ నుంచి ద్విచక్ర వాహనంపై బయల్దేరి వెళ్తుండగా ఈ విషయాన్ని సంజీవ్‌తోపాటు మిగిలిన ముగ్గురికి దాసరి కృష్ణ తెలిపాడు. దీంతో నిందితులు నలుగురు రాజలింగమూర్తిపై ఒక్కసారి దాడిచేశారు. ద్విచక్రవాహనంపై నుంచి పడిపోయిన రాజలింగమూర్తి కళ్లలో కారం చల్లి పొట్ట భాగంలో కత్తితో పొడవగా పేగులు బయటకు వచ్చి అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. రాజలింగమూర్తి మృతి చెందాడని నిర్ధారించుకున్న నిందితులు ద్విచక్ర వాహనంపై పరకాల వైపు వెళ్లిపోయారు.

కాగా, రాజలింగమూర్తి హత్య కేసులో పది మంది పాత్ర ఉందని గుర్తించామని ఎస్పీ వివరించారు. వీరిలో భూపాలపల్లి పట్టణానికి చెందిన రేణికుంట్ల సంజీవ్, పింగిళి సేమంత్ అలియాస్ బబ్లూ, మోరే కుమార్, కొత్తూరి కిరణ్ అలియాస్ కుమార్ హత్యచేసిన వారిలో ఉన్నారని తెలిపారు. వీరికి రేణికుంట్ల కొమురయ్య, దాసరపు కృష్ణ, రేణికుంట్ల సాంబయ్యపాటు మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, పుల్లా నరేష్, పుల్లా సురేష్ ఉన్నారని వెల్లడించారు. కొత్త హరిబాబుతో పాటు పుల్లా నరేష్, పుల్లా సురేష్ పరారీలో ఉండగా మిగిలిన ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్ పంపించినట్లు ఎస్పీ తెలిపారు. రేణికుంట్ల సంజీవ్ ఏ1గా, పింగిళి సేమంత్ అలియాస్ బబ్లూ ఏ2గా, మోరే కుమార్ ఏ3, కొత్తూరి కిరణ్‌అలియాస్ కుమార్ ఏ4, రేణికుంట్ల కొమురయ్య ఏ5, దాసరపు కృష్ణ ఏ6, రేణికుంట్ల సాంబయ్య ఏ7, కొత్త హరిబాబు ఏ8, పుల్లా నరేష్ ఏ9, పుల్లా సురేష్ ఏ10 నిందితులుగా ఉన్నారని వివరించారు. రాజలింగమూర్తి హత్యకు ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రెండు కత్తులు, ఒక రాడ్‌తో పాటు ఐదు మోటర్ సైకిళ్లు, ఏడు మొబైల్ ఫోన్లు, రక్తపు మరకలు ఉన్న దుస్తులను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పరారీలో ఉన్న కొత్త హరిబాబు, పుల్లా నరేష్, పుల్లా సురేష్‌ను త్వరలోనే పట్టుకుంటామని, వారి కోసం రెండు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని ఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ కిరణ్‌ఖరే అభినందించారు.

వరి వద్దంటే కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి..

- కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఏమయ్యాయి..
- ఎమ్మెల్సీ ప్రచారంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న బండి సంజయ్

మిల్స్‌కాలనీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వరి వేయవద్దన్న కేసీఆర్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన వరంగల్ జిల్లా బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రసంగించారు. వరి వేస్తే రైతులకు ఉరేనన్న కేసీఆర్‌కే ప్రజలు ఓటుతో ఉరి వేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలో సాగునీరు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే నన్నారు. రైతులు వరిని కాక గంజాయిని సాగు చేయాలా? అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరితో రాష్ట్రంలో వ్యవసాయం చేయాలంటే రైతులు భయపడుతున్నారని అన్నారు. కాళేశ్వరాన్ని కేసీఆర్ సగం మింగేస్తే, మిగతా సగాన్ని కాంగ్రెస్ సర్కార్ మింగేసిందన్నారు. కృష్ణా జలాలను పక్క రాష్ట్రం తీసుకుపోతుంటే కాంగ్రెస్ ఏమీ చేయలేకపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌కాలంలో ప్రజల పక్షాన పోరాడిన తనపై 109 కేసులు పెట్టించారని, హిందీ ప్రశ్నాపత్రం లీకేజీ కేసు బనాయించి జైల్ అయ్యారని ఎద్దేవా చేశారు. అంతేగాకుండా 5వేల మంది బీజేపీ కార్యకర్తలపై రౌడీషీట్లు తెరిచారని అన్నారు. ఎన్నికల హామీలైన ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శాసనసభ ఎన్నికల్లో తెలంగాణ సమాజం బీజేపీని మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మనకు ఓట్లు వేయని వారి కోసం మనమెందుకు పోరాడాలని కార్యకర్తలు అడుగుతుంటే సమాధానం చెప్పలేకపోతున్నామన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించి 14 నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదని బండి సంజయ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ హామీలైన ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఆరింటిలో ఒక్కటైనా ఇప్పటివరకు అమలు చేశారా? అని నిలదీశారు. 25వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. 50వేల ఉద్యోగాలను ఎలా భర్తీ చేస్తుందో అర్థం కావడం లేదన్నారు. ఉపాధ్యాయ సంఘాలు పాలకపార్టీలకు కొమ్ముకాస్తూ వారి సమస్యలను గాలికొదిలేస్తున్నాయని ఆరోపించారు. టీఎన్జీవోలు పైరవీల కోసం ప్రగతి భవన్‌కు వెళుతున్నారని విమర్శించారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై పోరాడేది బీజేపీయేనని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కావాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం 15 శాతం కమీషన్ అడుగుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కరువయ్యారని ఎద్దేవా చేశారు. రిటైర్డ్ అయితే ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇవ్వాల్సి వస్తుందని కేసీఆర్ 58 సంవత్సరాల ఉద్యోగ విరమణ వయస్సును 61 ఏళ్లకు పెంచితే.. అదే బాటలో రేవంత్ సర్కారు 65 ఏళ్లకు పెంచేందుకు ప్రయత్నాలు ప్రారంభించారని అన్నారు. ఇలాగైతే నిరుద్యోగులకు ఉద్యోగాలు ఎలా వస్తాయో ఆలోచించాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోతామని తెలుసుకుని సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి వస్తున్నారని, కానీ రాహుల్ వచ్చినా బీజేపీ అభ్యర్థులే గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కేజీబీవీల ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత, సీఆర్టీల వేతనం రూ.32వేలు, ఎస్‌వోల వేతనం రూ.52వేలు పెంపు చేయించేది బీజేపీనేనని హామీ ఇచ్చారు. ఉద్యోగులకు పెద్ద మొత్తంలో ట్యాక్స్ మినహాయింపును ఇచ్చింది మోదీ సర్కారేనన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకొని శాసనమండలి వేదికగా సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. బీజేపీయేతర అభ్యర్థులను గెలిపిస్తే వారు కాంగ్రెస్ గూటికి చేరడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి, వాగ్దేవి కళాశాలల చైర్మన్ దేవేందర్‌రెడ్డి, నాయకులు కొండేటి శ్రీధర్, రావు పద్మ, సంతోష్‌రెడ్డి, విజయ్‌చందర్‌రెడ్డి, కాశీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

భార్య, అత్తమామలపై దాడి కేసులో నిందితుడి అరెస్టు

భార్య కాపురానికి రాకపోవడమే కారణమన్న పోలీసులు

మట్టెవాడ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): భార్యతో పాటు అత్తమామలపై దాడి చేసిన నిందితుడు కోట చంద్రశేఖర్‌ను వరంగల్ పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను ఆదివారం సాయంత్రం వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తన కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. వరంగల్ శంభునిపేట ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్ రాడ్ బైండింగ్‌తో పాటు పెయింటింగ్ వర్క్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో వరంగల్ పోచమ్మమైదాన్‌కు చెందిన పల్లవిని పెద్దల అంగీకారంతో 2022 ఆగస్టులో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఏడాది వయసున్న బాబు ఉన్నాడు. తర్వాత చంద్రశేఖర్ మద్యానికి బానిసై భార్య పల్లవితో తరుచూ గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో భార్య పల్లవి తల్లిదండ్రులు, పెద్ద మనుషులు చంద్రశేఖర్‌ను మందలించినప్పటికీ మార్పు కనిపించలేదు. దీంతో ఆరునెలల కిందట భార్య కొడుకును తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. తర్వాత ఆమెను తిరిగి తీసుకురావడానికి ప్రయత్నించినా రాకపోవడంతో పాటు వేరే వ్యక్తితో సన్నిహితంగా ఉంటోందన్న అనుమానంతో ఎలాగైనా ఆమెను చంపాలని చంద్రశేఖర్ నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం మాంసం కోసే కత్తి కొనుగోలు చేసి ఫిబ్రవరి 20న మధ్యాహ్నం అత్తగారి ఇంటికి వెళ్లి పల్లవిపై విచక్షణారహితంగా దాడిచేశాడు. అడ్డువచ్చిన అత్త అనిత, మామ వీరస్వామిని సైతం కత్తితో గాయపరిచి పారిపోయాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఆదివారం పాపయ్యపేట చమన్ వద్ద చంద్రశేఖర్‌ను అరెస్టు చేశారు. అతడి వద్ద కత్తిని స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ టి.గోపి, ఎస్‌ఐలు సాంబయ్య, విఠల్, క్రైమ్‌పార్టీ సిబ్బంది విజయ్‌కాంత్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వైద్యుడిపై హత్యాయత్నం కేసులో పురోగతి

పోలీసుల అదుపులో అనుమానితులు?

మట్టెవాడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పథకం ప్రకారమే డాక్టర్ సుమంత్‌రెడ్డిపై హత్యాయత్నం జరిగినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఈనెల 20వ తేదీన డాక్టర్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డ ఇద్దరు నిందితులను ఆదివారం సంగారెడ్డిలో అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారి వద్ద ద్విచక్రవాహనాన్ని కూడా స్వాధీన పర్చుకొని వరంగల్‌కు తీసుకొచ్చినట్లు సమాచారం. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన వ్యక్తితోపాటు సంగారెడ్డి ప్రాంతానికి చెందిన మరో వ్యక్తి ఇద్దరు కలిసి బుల్లెట్‌పై కాజీపేటకు వచ్చి పథకం ప్రకారమే డాక్టర్ సుమంత్‌రెడ్డిపై దాడి చేశారని, నెంబర్ ప్లేట్ లేని వాహనంపై హెల్మెట్ ధరించి పరారయ్యారని తెలిసింది. ఈ విషయంలో కూపీ లాగిన పోలీసులకు ఆదివారం సంగారెడ్డికి వెళ్లి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇందులో ఒక ప్రభుత్వ ఉద్యోగి ఉన్నట్లు సమాచారం.

గుభాళించిన ఓరుగల్లు పేరిణి

కాకతీయ వారసుడి వివాహ వేడుకలో ప్రదర్శన



కాకతీయ వారసుడి చేత సత్కారం అందుకుంటున్న కళాకారులు

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లును కేంద్రంగా చేసుకొని 400 ఏళ్ల సుదీర్ఘపాలన చేసిన కాకతీయుల వంశానికి చెందిన వారసుడు కమల్‌చంద్ర బంజ్‌దేవ్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఖజురహోలో వైభవంగా నాగోడ్ యువరాణి భువనేశ్వరిని వివాహమాడిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి పొద్దుపోయే వరకు నేత్రపర్వంగా చంద్రబంజ్‌దేవ్ రాజ్‌మహల్ ప్రాంగణంలో జరిగిన రిసెప్షన్ వేడుకల్లో ఓరుగల్లు కళాకారుల పేరిణి నాట్యం గుభాళించింది. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆదేశానుసారం నగరంలోని విద్యారణ్య ప్రభుత్వ నృత్య సంగీత కళాశాల పేరిణి అధ్యాపకురాలు నవ్యజా, ఓరుగల్లు నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమి నిర్వాహకులు పేరిణి రంజిత్‌కుమార్ బృందం ప్రదర్శించి పేరిణి ప్రదర్శన ఆహ్వానితులను మంత్రముగ్ధులను చేసింది. ఏకధాటిగా 45 నివిషాలపాటు కాకతీయు వైభవం, పల్నాటి బొబ్బిలి, చోళ్ల వంశానికి అనేకమంది రాజవంశీయులు నాటి కాకతీయ వైభవం అయిన పేరిణి నృత్యాన్ని చూసి కళాకారుల వద్దకు వచ్చి అభినందించడమే కాకుండా మన ఓరుగల్లు కళాకారులతో ప్రత్యేకంగా ఫొటోలు దిగడం ఆటోగ్రాఫ్‌లు తీసుకోవడం విశేషం. గజ్జల రంజిత్ ప్రత్యేకంగా రూపొందించిన జయము జయము కాకతీయ అంశంతో ప్రదర్శన ప్రారంభించినంతసేపు పాల్గొన్న ప్రతీ ఒక్కరి కరతాళ ధ్వనులతో మార్మోగింది. స్వయంగా పెళ్లికొడుకు అయిన కమల్‌చంద్ర కళాకారులను పేరుపేరునా సత్కరించారు. లోహిత్, గురుదేవ్, సంతోష్, ప్రశాంత్, పల్నాటి శ్రీజ, రామచరణి, గడ్డం శ్రీవిద్య, గాదె వర్ష, సమీక్ష, రుత్విక, వైష్ణవి, లక్ష్మీప్రసన్న, చరిష్మా తదితర కళాకారులు ఈ బృందంలో పేరిణి లాస్యం ప్రదర్శించారు. కాకతీయుల సాంస్కృతిక పర్యాటక ప్రదేశాల మీద పరిశోధన చేసిన డాక్టర్ కుసుమ సూర్యకిరణ్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

హాస్యమే ప్రధానంగా వీడేం మగవాడండీ బాబు నాటిక

వర్ధన్నపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వర్ధన్నపేట పట్టణంలోని భారతీయ నాటక కళా సమితి ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి 51వ ఆహ్వాన నాటికల పోటీలు ఆదివారం రాత్రి రెండో రోజు కళాంజలి హైదరాబాద్ వారి 'వీడేం మగవాడండీ బాబు, రెండో ప్రదర్శనగా ది అమెచ్యూర్ డ్రమటిక్ అసోసియేషన్ చిలుకలూరిపేట వారి వర్క్ ఫ్రం హోం నాటికలు ప్రదర్శించారు. ఈ రెండు నాటికలు ప్రజలను ఆకట్టుకోవడంతోపాటు ఆలోచింప చేశాయి. హాస్యమే ప్రధాన అంశంగా రాయబడిన నాటిక ఒక మగాణ్ణి నువ్వేం మగాడివిరా... వాడేం మగాడు అని కొందరు అంటుంటారు. ఆటల్లో ఓడిపోతే వీడేం మగాడు అంటారు. చదువుల్లో ఓడిపోతే.., ఉద్యోగం రాకపోతే నువ్వేం మగాడు అంటారు. సకాలంలో పెళ్లికాకపోతే.. పిల్లల్ని కనకపోతే వాడేం మగాడు అంటారు. మగాడి జీవితం బతుకులో సగం మగాడ్నని నిరూపించుకోవడంతోనే సరిపోతుంది. అది ఒక మగాడికి ఎంత బాధ కలిగిస్తుందో.. సాటి మగవాడికి మాత్రమే తెలుస్తుంది అనేది ప్రధాన అంశంగా తీసుకుని రాయబడిన నాటిక. కథాపరంగా రాజారావు కుమారుడైన గోవింద్‌ను కొందరు మగాడు కాదు అంటారు. అతడు మగాడు అనిపించుకోవడం కోసం సృష్టించిన ఓ అందమైన అబద్ధమే ఈ నాటికలో ప్రధాన అంశం.



వీడేం మగవాడండీ బాబు నాటికల్లో ఓ సన్నివేశం

నాటిక మొత్తం ఫన్, విట్, జోకులతో నిండి ఉంటుంది. ఎవరినీ గాయపరచదు. అందరు హాయిగా... ఆనందంగా చూసి నవ్వుకోవడమే ఈ నాటిక ప్రధాన ఉద్దేశ్యం.

వర్క్ ఫ్రమ్ హోమ్

ప్రతీ మనిషిలోను ఏదో ఒక ప్రతిభ దాడిగి ఉంటుంది. తమ మనసుకి నచ్చిన పనిలో మమేకమైనపుడు అది మొగ్గతొడిగి వెల్లివిరుస్తుంది. ఆ ప్రతిభే మరోసారి చిక్కుల్లోకి నెట్టి పరీక్షిస్తుంది. ఆ చిక్కులను అధిగమించి అప్రతిహతంగా దూసుకుపోయేవాడే విశ్వాన్నిసైతం ఒడిసిపట్టగలడు, అనుకున్నది సాధించగలడు. సాధారణ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సుధీర్ వంటల్లో నిష్ణాతుడు. అతివలకన్నా అద్భుతంగా రుచికరమైన వంటలు చేసే ప్రావీణ్యం అతని సొంతం. గమ్మత్తేమిటంటే వంట చేయమంటే ఆసక్తిలేని సౌమ్య అతడికి అర్ధాంగి రావడం. కాఫీ కలపడం కూడా నేర్చుకోని భార్యతో కొత్త కాపురం మొదలు పెడతాడు. దానికి తోడు తన పెళ్లి కుదిర్చిన స్నేహితుడు కిరణ్ సరదాగా చేసిన పని అతన్ని కష్టాల్లోకి నెడుతుంది. ఐనప్పటికీ వర్క్ ఫ్రమ్ హోంకు అనుమతి తీసుకుని ఒక పక్కవంట, మరో పక్క ఉద్యోగంతో సతమతమవుతుంటాడు. అదేం పట్టని భార్య సౌమ్య భర్త వంట ప్రావీణ్యాన్ని బంధువులకు చేరవేస్తూ బిజీగా ఉంటుంది. వారంతా వీరి కొత్త కాపురాన్ని పరామర్శించే పేరుతో వచ్చి పోతుండడంతో వారికి మర్యాదలు చేయలేక, మరో వైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించలేక ఒత్తిడికి లోనవుతాడు. చివరకు సాహసించి ఉద్యోగానికి రాజీనామా చేసి సౌమ్యలక్ష్మీ హోంఫుడ్స్ పేరుతో కొత్త స్టార్టప్ ప్రారంభిస్తాడు. వర్క్ ఫ్రంహోం అనే ఈనాటిక ఆద్యంతం చక్కని హాస్య సన్నివేశాలతోసరదాగా సాగి స్ఫూర్తిదాయకంగా ముగుస్తుంది.



ఇండస్ వేడుకల్లో రాకేశ్‌రెడ్డి దంపతులు(ఫైల్)

ఆధ్యాత్మిక సేవలో ఇండస్

మహాశివరాత్రి వేళ పలు కార్యక్రమాలు

శివతత్వాన్ని బోధించడమే లక్ష్యంగా నిర్వహణ



ఇండస్ వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ తమిళిసై (ఫైల్)

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఏటా మహాశివరాత్రి పర్వదినం వస్తుందంటే చాలు.. ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహించే ఇండస్ ఫౌండేషన్ ఓరుగల్లు ప్రజలకు యాదికొస్తుంది. ఏటా శివరాత్రికి హనుమకొండలోని హయగ్రీవాచారి మైదానంలో ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించే వేడుకలు నగరవాసుల మదులను స్ఫూరిస్తాయి. ఐదేళ్లుగా మహాశివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనాన్ని వైభవంగా నిర్వహిస్తున్న ఇండస్ ఫౌండేషన్.. ఈ ఏడాది కూడా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఓరుగల్లు వైభవాన్ని ఆధ్యాత్మిక, సాంస్కృతి, కళావైభవాన్ని చాటుతూ వైభవంగా అనేక మంది భిన్న రంగాల ప్రముఖులను నగరానికి రప్పించి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తుండటం గమనార్హం. ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేశ్‌రెడ్డి రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నప్పటికీ ఓరుగల్లు సాంస్కృతిక వైభవాన్ని ముందుకు తీసుకెళ్లడం, 400 ఏళ్ల నాటి కాకతీయుల కళావైభవంపై భవిష్యత్ తరాల వారికి అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2020లో తొలిసారిగా హయగ్రీవాచారి మైదానంలో ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టగా.. ప్రముఖ సినీ నటుడు, రచయిత తనికెళ్ల భరణి, శశిధర్‌శర్మ, భాస్కరయోగి లాంటి ప్రముఖులు పాల్గొన్నారు. 2021లో కరోనా వల్ల కార్యక్రమాలకు అంతరాయం కలగ్గా.. 2022లో గరికిపాటి నర్సింహారావు, బ్రహ్మశ్రీ గంగాధరశాస్త్రీ పాల్గొన్నారు. 2023లో అప్పటి గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఇండస్ ఫౌండేషన్ వేడుకలను ప్రారంభించిన క్రమంలో ఈ ఇండస్ కార్యక్రమాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అప్పుడు శతసహస్ర అవధాని మాడుగుల నాగఫణిశర్మ ప్రవచనం, జేడీ లక్ష్మీనారాయణ లాంటి ప్రముఖులు హాజరయ్యారు. 2024లో రాధా మనోహర్‌దాస్, బ్రహ్మశ్రీ గంగాధర శాస్త్రీ పాల్గొన్నారు.

ఇక ఈ ఏడాది మహాశివరాత్రి పర్వదినాన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్.రంగరాజన్, స్వామి ప్రణవనందాదాస్, ప్రముఖ కవి, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర్‌రావుల ప్రవచనాలు, కవిత్వ ప్రసంగాలను ఏర్పాటు చేశారు. ఓరుగల్లు కళా వైభవంపై తెలంగాణ కవి దేశపతి శ్రీనివాస్ ప్రసంగం, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య బృందం యక్షగాన కచేరి, యువ సినీ గేయరచయిత అనంత శ్రీరామ్‌తో దేశభక్తి సందేశం, ఓరుగల్లులో పురుడుపోసుకున్న పేరిణి శివతాండవ ప్రదర్శన ఉంటాయి. లింగోద్భవ సమయంలో పరమశివుడి అనుగ్రహం కోసం సప్తహారతి నిర్వహిస్తున్నారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సామాజిక, క్రీడా, కళా రంగాలకు చెందిన 8మంది ప్రముఖులకు కాకతీయ పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. అలాగే సినీ గాయకుడు శ్రీక్రిష్ణ, తెలంగాణ మట్టిపాటల గాయకుడు మాట్ల తిరుపతి, పల్లెపాటల గాయని శిరీష, బుల్లితెర యాంకర్ సత్యభామ స్వాతి, అమ్మతనం ఉట్టిపడేలా పల్లెపాటలకు ప్రాణం పోస్తున్న బిక్షమమ్మ, అనితాయాదవ్ లాంటి కళాకారులతో జాగరణ ఉండే భక్తుల కోసం 12 గంటలపాటు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



ఆధ్యాత్మికం

గానం చేస్తున్న తనికెళ్ల భరణి



శివతత్వాన్ని ప్రబోధింపజేయడమే లక్ష్యం

శివభక్తులైన కాకతీయులు 400ఏళ్లపాటు పరిపాలించి.. వందలాది శివాలయాలు, రామప్ప, వేయిస్తంభాల గుడిలాంటి అత్యద్భుత శిల్పకళా సంపదను వారసత్వంగా అందించారు. వారి స్ఫూర్తిని ముఖ్యంగా శివతత్వాన్ని నేటి యువతకు భావితరాలకు అందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. కళలు, సాహిత్యం, జానపదాలు, ఆధ్యాత్మికానికి పెట్టింది పేరైన ఓరుగల్లు కీర్తిని దేశవ్యాప్తంగా తెలియజెప్పడమే మా లక్ష్యం.

- ఏనుగుల రాకేశ్‌రెడ్డి, ఇండస్ ఫౌండేషన్

ప్రత్యేక ఆకర్షణగా ఇండస్ కార్యక్రమాలు



ప్రతీ శివరాత్రికి ఇండస్ ఫౌండేషన్ చేస్తున్న ఆధ్యాత్మిక సేవలు అద్భుతం. ఆ రోజున వరంగల్ నగరంలో జరిగే కార్యక్రమాలతో పాటు ఇండస్ నిర్వహించే కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. 2020 నుంచి ఏటా ఈ కార్యక్రమాల విజయవంతంలో భాగస్వామ్యం అవుతున్నందుకు సంతోషంగా ఉంది.

- శేషు, భద్రకాళి ఆలయ చైర్మన్

సిరులు కురిపిస్తున్న పొగాకు

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం

- పంటపై సాగుకు ఆసక్తి చూపుతున్న అన్నదాతలు
- జనగామ జిల్లాలో పెరుగుతున్న విస్తీర్ణం





ఆరబెట్టిన పొగాకు దొర్నాలు

రఘునాథపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పొగాకు పంట రైతులకు సిరులు కురిపిస్తోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తుండడంతో జనగామ జిల్లాలో పొగాకు సాగు ఏటికేడు పెరుగుతోంది. స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లి, పాలకుర్తి, దేవరుప్పుల, నర్మెట, లింగాలఘణపురం, కొడకండ్ల మండలాల్లో రైతులు ఎక్కువగా పొగాకు సాగు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 1250 మంది రైతులు ఆరువేల ఎకరాలలో సాగు చేశారు. క్వింటా పొగాకు రూ.15,500ధర పలుకుతోంది. ఎకరాకు సుమారు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుండడంతో రూ.25 వేల నుంచి రూ.30 వేల ఖర్చు వస్తుంది. అంటే సుమారుగా ఎకరం పొగాకు పంట సాగు చేసిన రైతుకు అన్ని ఖర్చులు పోను రూ.1.20లక్షల ఆదాయం వస్తోందని పొగాకు రైతులంటున్నారు.

పొగాకు సాగు చేసే గ్రామాలు..

రఘునాథపల్లి మండలంలోని కుర్చపల్లి, గబ్బెట, కోడూరు, రామన్నగూడెం, కన్నాయిపల్లి, గోవర్ధనగిరి, స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని ఛాగల్లు, రాఘవపురం, అక్కరాజుపల్లి, శివరెడ్డిపల్లి, మీదికొండ, ఇప్పగూడెం, నర్మెట, లింగాలఘణపురం మండలంలోని నేలపోగుల, గుమ్మడవెల్లి, బండ్లగూడెం తదితర గ్రామాల్లోని రైతులు పొగాకును ఎక్కువ సాగు చేస్తారు.

రఘునాథపల్లిలో కొనుగోలు కేంద్రం..

రైతుల నుంచి పొగాకు పంటను కొనేందుకు చేసేందుకు వీఎస్‌టీ ఆధ్వర్యంలో రఘునాథపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రైతులు పొగాకు ఉత్పత్తులకు నాణ్యత, రంగును బట్టి క్వింటాకు రూ.12 వేల నుంచి రూ.15,500 వరకు ధర పలుకుతోంది. దళారులు లేకపోవడంతో మోసాలు జరగడం లేదని రైతులు చెబుతున్నారు. పెట్టుబడులు పోను ఎకరానికి సగటున రూ.1.10 లక్షల వరకు ఆదాయం వస్తోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పొగాకు సాగే మేలు



నేను రెండు ఎకరాల్లో పొగాకు సాగు చేశాను. ఇప్పటివరకు 10 క్వింటాళ్ల పొగాకును అమ్మగా రూ.1.40 లక్షలు వచ్చాయి. ఇంకా 10 నుంచి 12 క్వింటాళ్ల పొగాకు పంట చేతికి రావాల్సిఉంది. ఇతర పంటలకు అవసరమైన పెట్టుబడులు పొగాకుకు అవసరం ఉండదు.అందుకే ఇతర పంటలకన్న పొగాకు సాగే మేలు..

- ఉత్తేపు కుమార్, బండ్లగూడెం

తక్కువ పెట్టుబడి..



పొగాకు పంటకు ఇతర పంటలతో పోలిస్తే తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభం వస్తోంది. 15 ఏళ్ల నుంచి పొగాకు సాగు చేస్తున్నాను .పొగాకుకు ఎక్కువ సాగు నీరు, రసాయన ఎరువుల వాడకం ఉండక పోవడం వల్ల తక్కువ పెట్టుబడి మాత్రమే అవసరముంటుంది. నేను 3 ఎకరాలలో పొగాకు సాగు చేశాను. పెట్టుబడి రూ.90 వేలు పోను రూ.2.20 లక్షల ఆదాయం లభించడం అంటే కేవలం పొగాకు సాగుతోనే సాధ్యం.

- పుట్టల గట్టయ్య, ఇప్పగూడెం



రఘునాథపల్లిలో కొనుగోలుకు సిద్ధంగా ఉన్న పొగాకు బేళ్లు

బతుకు బండిని లాగుతున్న ముద్రణ జీవులు

పాలకులు మారినా ప్రింటర్స్‌లో కానరాని ప్రగతి

- తమ జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఆశతో ఎదురుచూపు
- నేడు ప్రపంచ ప్రింటర్స్ డే సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం



మానుకోటలో ఆఫ్‌సెట్ ప్రింటింగ్ మిషన్‌ను నడుపుతున్న యాజమాని నక్క నాగార్జున



జాన్‌గూటెన్ బర్గ్ చిత్రపటం

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూసి.. చూసి వారి కళ్లు కాయలు కాచాయి. రాష్ట్రాలు మారినా (సిద్ధించిన).. పాలకులు మారిన ప్రింటర్స్ జీవితాల్లో వెలుగులు నిండడం లేదు. సీజనల్ వ్యాపారంతో ఆరునెలలు మాత్రం పని దొరకడం. మిగతా ఆరునెలలు పని లభించక ఖాళీగా ఉండడంతో వారికి కుటుంబ పోషణ కష్టతరంగా మారుతోంది. అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సిన దైన్యస్థితి నెలకొంది. రోజురోజుకు నిత్యావసర సరుకుల ధరలు, గృహా, దుకాణాల అద్దెలు పెరగడంతో వారు అష్టకష్టాలు పడుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఎటు పాలుపోని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఉన్న పనిని వదిలేయలేక కొత్త పని చేద్దామంటే పెట్టుబడికి ఆర్థిక స్థోమతలేక ముద్రణ పనిలోనే మగ్గుతూ అవస్థలు పడుతున్నారు. ప్రింటింగ్ పితామహుడు జాన్ గూటెన్ బర్గ్ జయంతి ఫిబ్రవరి 24 ప్రపంచ ప్రింటర్స్ డేను పురస్కరించుకుని ప్రింటింగ్ ప్రెస్ యాజమానులు, కార్మికుల కష్టాలపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

లెటర్ ప్రెస్‌తో ముద్రణరంగంలో నూతన శకం

జర్మనీ దేశానికి చెందిన ప్రింటింగ్ పితామహుడు సర్ జోహన్స్ గూటెన్ బర్గ్ ఆలోచన, పట్టుదల 1450వ సంవత్సరంలో ముద్రణ రంగానికి నాంది పలికాయి. పాత తరం ఆచార వ్యవహారాలు, సం స్కృతి, సంప్రదాయాలు, నాగరికత, రాజకీయ, సాంస్కృతిక, విద్యా, వైజ్ఞానిక రంగాలకు చెందిన విషయాలను భావితరాలకు అందించడంలో ముద్రణారంగం ప్రముఖపాత్ర పోషిస్తోంది. ఇనుకతిన్నెలపై అక్షరాలు రాసుకోవడం, చెక్క పలకలపై బొగ్గుతో, నల్లని పలకలపై సుద్దముక్కలతో, కాగితాలపై సిరాతో రాయడం మొదలైంది. పూర్వకాలంలో తాళపత్ర గ్రంథాలు తాటి ఆకులపై ఘంటం అనే మేకులాంటి ఆయుధంతో గీరుతూ ఓ గ్రంథాన్ని తయారు చేసేవారు. అయినా అందులో రాసిన విజ్ఞానాన్ని నలుగురికి పంచలేకపోగా దాన్ని భద్రపరిచేందుకు ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇది గమనించిన జాన్ గూటెన్‌బర్గ్ పూర్వ విజ్ఞానాన్ని భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ముద్రణాయంత్రాన్ని కనుగొన్నారు.విడి అక్షరాలతో ముద్రించే లెటర్‌ప్రెస్‌ను కనుగొని ముద్రణ రంగంలో నూతన శకానికి నాందిపలికారు. ఇనుప రాడ్లతో అక్షరాలుగా చెక్కి వాటిని వరుస క్రమంలో పేర్చి తద్వారా అవసరమైన పుస్తకాలను తయారు చేసేవారు. సదరు ప్రింటింగ్‌పై ఏరోజు కారోజు వార్తలను అందించే దినపత్రికలను సైతం ముద్రించారు. కంప్యూటర్ రంగం అంటుబాటులోకి వచ్చాక లెటర్‌ప్రెస్ నుంచి ఆఫ్‌సెట్ ప్రింటింగ్ స్థాయికి ఎదిగింది. అంతటితో ఆగకుండా మల్టీకలర్ ప్రింటింగ్‌ను కూడా అవలీలగా ముద్రిస్తున్నారు. తద్వారా గంటలో వేలకొద్ది పత్రాలను ముద్రించడంతో పాటు ప్రజా అవసరాలకు ఉపయోగపడే పుస్తకాలను అందిస్తోంది.

సంక్షేమ పథకాలు..

రోజు రోజుకు సాంకేతికాభివృద్ధి చెంది ప్రజల అవసరాలకనుగుణంగా అతితక్కువ సమయంలో ఎక్కువగా ముద్రణా జరుగుతుందే తప్ప, వాటిని ముద్రించే ప్రింటింగ్ ప్రెస్ యజమానులు, కార్మికుల జీవనస్థితిగతుల్లో మాత్రం మార్పు కన్పించడం లేదు. రోజురోజుకు వారి జీవన, ఆర్థిక స్థితి గతులు వెనక్కి నెట్టబడుతున్నాయంటే అతిశయోక్తి కాదు. పొద్దంతా కష్టపడ్డప్పటికి వారి కుటుంబాలు గడవని దైన్యదుస్థితి నెలకొంది. ఎందరికో విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను ముద్రించే ప్రింటర్లు అభివృద్ధికి ఆమెడదూరంలో ఉన్నారు. స్వరాష్ట్రం సిద్ధిస్తే తమ బతుకులు మారుతాయని ఆశపడి తాము సైతం అంటూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమాల్లో ముందుండి పోరాటాలు నిర్వహించారు. స్వరాష్ట్రం ఏర్పాటై దశాబ్ద కాలం గడిచి పోయినా, పాలకులు మారినా ప్రింటర్స్ జీవన ప్రమాణాలు మెరుగు పడలేదు. పాలకులు స్పందించి ప్రింటర్లను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరుతున్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, దుకాణాల నిర్వహణకు బ్యాంకు రుణాలు అందించడంతో పాటు షాపులకు ఉచిత విద్యుత్ అందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పడిపోతున్న మిర్చి ధరలు

- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- వ్యాపారులు కుమ్మక్కై తగ్గిస్తున్నారని ఆరోపణ
- ఎగుమతులు లేకపోవడమే కారణమంటున్న వ్యాపారులు
- గతేడాది కొన్నదే స్టోరేజీల్లో మూలుగుతోందని ఆవేదన
- ప్రభుత్వమే ఆదుకోవాలంటున్న రైతులు



వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మిర్చి బస్తాలు

వరంగల్ వ్యవసాయం, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): వరంగల్ (ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్లో మిర్చి ధరలు రోజురోజుకూ పడిపోతున్నాయి. పెట్టిన పెట్టుబడి, వచ్చిన దిగుబడి, మార్కెట్లో పలుకుతున్న ధర చూస్తే ఏ మాత్రం పొంతనలేకుండా పోతోందని, ఇలాగే కొనసాగితే అప్పులపాలవడం ఖాయమని రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్లో వ్యాపారులందరు కుమ్మక్కై మిర్చి ధరలు తగ్గిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కానీ, ఎగుమతులు తగ్గడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు.

గతంలో కొన్న మిర్చి ఇప్పటికీ కోల్డ్ స్టోరేజీల్లో మూలుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2023లో క్వింటా మిర్చి రూ.99వేలకు చేరడంతో 2024లో రైతులు అధికంగా సాగుచేశారని, దీంతో ధరలు కనిష్టంగారూ.20 వేలకు పడిపోయాయని, అపుడు కొనుగోలు చేసి కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేశామని అంటున్నారు. కానీ, ఇతర దేశాలకు ఎగుమతులు లేకపోవడంతో ప్రస్తుతం గరిష్టంగా రూ.18వేలు, కనిష్టంగా రూ.10వేలు పలుకుతోందని, ఈ నేపథ్యంలో ఉన్న సరుకును ఏం చేయాలో పాలుపోవడం లేదని ఆందోళన చెందుతున్నారు. పక్క రాష్ట్రం గుంటూరులో ఇటీవల మిర్చి ధరలు తగ్గడంతో రైతులు ఆందోళన చేశారని, వెంటనే ప్రభుత్వం స్పందించి కేంద్ర వ్యవసాయశాఖతో మాట్లాడిందని, గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారని గుర్తుచేశారు. ఆ దిశగా తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఆదుకోవాలి..

మిర్చి రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. విత్తనం వేసినప్పటి నుంచి మిర్చి మార్కెట్‌కు చేరేంత వరకు ఖర్చు ఎంతైంది..? రైతు శ్రమ ఎంతుంది..? లెక్క కట్టి గిట్టుబాటు ధర నిర్ణయించాలని కోరుతున్నారు.

ఆందోళన చెందుతున్న వ్యాపారులు

గతేడాది కొన్న సుమారు పది లక్షల మిర్చి బస్తాలు కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేసి ఉన్నాయని, ఈ ఏడాది కూడా ఎగుమతులు లేకపోవడంతో ధరలు తగ్గుముఖం పడుతున్నాయని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

వరంగల్ మార్కెట్‌కు వచ్చే ప్రధానమైన మిర్చి రకాలు, గరిష్ట ధరలు

మిర్చి రకం	2022 ఫిబ్రవరి	2023 ఫిబ్రవరి	2024 ఫిబ్రవరి	2025 ఫిబ్రవరి
దేశీ మిర్చి	29.000	73.000	42.000	25.000
వండర్‌హాట్	23.000	37000	23.600	14.500
తేజ	18.800	20.000	22.000	14.000
యూఎస్ 341	25.000	21.900	20.000	13.500
డిడి	21.500	19.900	------	-----
దీపిక	-----	34.000	23.000	16.000

ధరలు ఆందోళన కలిగిస్తున్నాయి..



మిర్చి ధరలు సగానికి సగం తగ్గిపోయాయి. సాగు ఖర్చులు బాగా పెరిగిపోయాయి. విత్తనాలు వేయడం నుంచి పంట చేతికి వచ్చే సరికి కూలీలకు, ఎరువులకు, రసాయన మందులకు ఇలా అన్నింటికీ రేట్లు పెరిగాయి. కానీ రైతులు పండించిన పంటకు ధరలు పెరుగడంలేదు. ఈ ప్రభుత్వమైనా స్పందించి రైతుల పెట్టుబడి పోను లాభం వచ్చేలా గిట్టుబాటు ధరలు నిర్ణయించి ప్రభుత్వ సంస్థలచే కొనుగోలు చేయాలి. అప్పుడే రైతులు బాగుపడుతారు. లేదంటే రైతులకు అప్పులే మిగిలిపోతాయి.

- రాజు, రైతు, పరకాల

గతేడాది క్వింటా మిర్చి రూ.20 నుంచి 40 వేలు పెట్టి కొనుగోలు చేశామని, ప్రస్తుతం మార్కెట్లో రూ.10 వేల నుంచి రూ.20 వేలే ఉందని వాపోతున్నారు. ప్రస్తుత ధరకు అమ్మితే నష్టం వస్తుందని, పోనీ అలాగే నిల్వ ఉంచితే రానున్న రోజుల్లో మిర్చి ధర మరింత తగ్గితే దివాలా తీసి ఇంటిముఖం పట్టాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలని వ్యాపారులు కోరుతున్నారు.

పరీక్ష రాయనని విద్యార్థి మారం



విద్యార్థికి ధైర్యం చెబుతున్న అధికారులు, పోలీసులు

బుజ్జగించి పరీక్షా కేంద్రంలోకి పంపించిన పోలీసులు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కేయూసీ పోలీసు స్టేషన్ పరిధి పలివేల్పుల రోడ్ తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో ఆదివారం టీజీ సెట్ ప్రవేశ పరీక్ష జరిగింది. ఈ క్రమంలోనే ఓ విద్యార్థి తాను పరీక్ష హాలులోకి వెళ్లనని.. భయమేస్తోందని మారం చేస్తూ తండ్రితో వచ్చిన ఆ విద్యార్థి మారం చేస్తున్నాడు. అప్పుడే బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు పరీక్షా కేంద్రానికి వచ్చిన హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డితో పాటు అక్కడే విధులు నిర్వహిస్తున్న కేయూసీ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవి కుమార్ ఆ విద్యార్థిని బుజ్జగించి ధైర్యం చెప్పి పరీక్షా కేంద్రంలోకి పంపించాడు.

మడికొండలో చికెన్ మేళా

మడికొండ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట మండలం మడికొండలో పౌల్ట్రీ బ్రీడర్స్ కోఆర్డినేషన్ అసోసియేషన్ నేషనల్, నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ పౌల్ట్రీ ఆధ్వర్యంలో వెన్‌కాబ్ కంపెనీ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ పటేల్ సహకారంతో ఆదివారం చికెన్ మేళా నిర్వహించారు. బర్డ్ ఫ్లూ వైరస్‌పై ప్రజల్లో నెలకొన్న అపోహను తొలగించడం కోసం ఉచితంగా చికెన్, గుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వెంకటేశం, మార్కెటింగ్ కనకరాజు, బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావుపద్మ, జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, కంపెనీ సిబ్బంది రమేష్, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.



చికెన్ పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు రావు పద్మ, సంతోష్‌రెడ్డి

'మాంసం' విక్రయాల్లో గోల్‌మాల్

- కబేళాలకు వెళ్లకుండా రహస్య ప్రదేశాల్లో జంతువధ
- యజమానుల వద్దనే బల్దియా ఆమోద ముద్రలు
- మృతి చెందిన, కుళ్లిపోయిన జంతువుల మాంసం విక్రయాలు
- దృష్టి సారించని బల్దియా అధికారులు.. ఇబ్బందుల్లో ప్రజలు



కేయూ రోడ్డులో బల్దియా ముద్ర వేయకుండా విక్రయిస్తున్న మటన్

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ భయంతో ప్రజలు మాంసం వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే వరంగల్ నగరంలో ఉన్న మాంసం విక్రయించే వ్యాపారులు సిండికేట్‌గా మారి మాంసం ప్రియులకు నిరాశ కలిగిస్తున్నారు. వరంగల్, కాజీపేట, హనుమకొండతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మటన్‌కు రేటు పెంచడంతో సామాన్యులు కొనలేకపోతున్నారు. బల్దియా అధికారులు పర్యవేక్షణ లోపం వల్లనే మటన్ రేటు కొండెక్కిందని ప్రజలు మండిపడుతున్నారు.

వ్యాపారుల వద్దనే ముద్రలు

వరంగల్ ట్రైసిటీస్‌లో మూడు కమేళా (గొర్రెలు, మేకలు) జంతువధ శాలలు(కబేళా)లు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇక్కడ వధించిన జంతువులను మాత్రమే రిటైల్ షాపు యజమానులు వారి వారి షాపులకు తీసుకెళ్లి మాంసాన్ని విక్రయించాలి. ఇలా ప్రతీ ఆదివారం వరంగల్‌లో 700, హనుమకొండలో 1000కి పైగా, కాజీపేటలో 300కు పైగా మూగజీవాలను వధించి వాటి మాంసాన్ని వ్యాపారులు విక్రయిస్తారు. వధించే క్రమంలో బల్దియా వెటర్నరీ డాక్టర్ దగ్గరుండి జంతువు ఆరోగ్యంగా ఉందా? లేదా? అని పరీక్షించిన తర్వాతనే కోతకు అప్పగించాలి. కానీ, నిబంధనలు పాటించకుండా కొందరు యజమానులు రిటైల్ షాపుల యజమానులతో కుమ్మక్కై వారి షాపుల వద్దనే వధించి మాసాన్ని విక్రయించేందుకు పరోక్షంగా సహకరిస్తున్నట్టు తెలుస్తోంది. ఇంకా కొందరు వ్యాపారులు బల్దియాకు సంబంధించిన సర్టిఫైడ్ స్టాంప్‌ను సైతం సొంతంగా తయారు చేసుకుని ఫేక్ ముద్ర వేసి మరీ ప్రజలను నమ్మిస్తూ మాంసాన్ని విక్రయిస్తున్నారు. మృతి చెందిన, వ్యాధుల బారిన పడిన గొర్రెలు, మేకల మాంసాన్ని అమాయక ప్రజలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ యేడు జనవరిలో మూడు ప్రాంతాల్లో తక్కువ ధరకు టెండర్లు దక్కించుకున్న వ్యక్తులు వ్యాపారులతో కుమ్మక్కై అధికారులను మచ్చిక చేసుకుని లక్షల్లో దండుకుంటున్నట్టు తెలుస్తోంది. బల్దియా అధికారులు గానీ, ఫుడ్ సేఫ్టీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే బల్దియా పరిధిలో మాంసం మాఫియా రాజ్యం ఏలుతున్నట్టు తెలుస్తోంది.



హనుమకొండ ఎక్సైజ్ కాలనీలో ముద్ర వేయకుండా విక్రయిస్తున్న మాంసం

ఫ్రిజ్‌లో పెట్టి విక్రయాలు..

వరంగల్ నగరంలో చాలా చోట్ల రిటైల్ షాపుల యజమానులు పదుల సంఖ్యలో జంతువులను వధిస్తారు. మాంసం అమ్ముడవకపోవడంతో షాపులు, ఇండ్లలో ఉన్న ఫ్రిజ్‌లలో మాంసాన్ని నిలువ ఉంచి మరుసటి రోజు విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కుమార్‌పల్లి మార్కెట్, కేయూ రోడ్డు, నయీంనగర్, ఎక్సైజ్ కాలనీ, కాజీపేట జూబ్లీ మార్కెట్, సిద్ధార్థ నగర్, వరంగల్ కరీమాబాద్, రంగశాయిపేట, శివనగర్, ఉర్సు ప్రాంతాల్లో ఎక్కువగా మిగిలిపోయిన మాంసాన్ని విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల కేయూ రోడ్డులో ఓ మటన్ షాపులో కుళ్లిన మాంసాన్ని విక్రయించడంతో సదరు యజమానికి మాంసం ప్రియులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి గొడవ పోలీసుస్టేషన్‌కు చేరింది. వరంగల్ ట్రైసిటీస్‌లో చాలా మంది మాంసం వ్యాపారులు ఇదే తంతు కొనసాగిస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

సమస్య నా దృష్టికి రాలేదు..

గోపాల్‌రావు, బల్దియా వెటర్నరీ అధికారి

వరంగల్ నగరంలో మృతి చెందిన, కుళ్లిపోయిన జంతువుల మాంసం విక్రయాలు జరుగుతున్నట్టు నా దృష్టికి రాలేదు. మాకు తెలియకుండా కొందరు వ్యాపారులు మిగిలిన మాంసాన్ని తెల్లవారి ఫ్రెష్ మాంసంతో కలిపి అమ్ముతున్నట్టు సమాచారం ఉంది. కానీ ఎక్కడ అని తెలియదు. ప్రజలు గుర్తించి తమకు సమాచారం అందిస్తే తప్పకుండా మటన్ షాపులకు జరిమానా విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

నేత్రపర్వంగా సిద్ధేశుడి కల్యాణం

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని ప్రాచీన స్వయంభూలింగం దక్షిణ కాశీగా పేరుగాంచిన సిద్ధేశ్వరాలయంలో ఆదివారం భవానీ సిద్ధేశ్వర కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ అర్చకులు సిద్ధేశుని రవికుమార్, సురేష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వ దిన వేడుకల్లో భాగంగా మూడు రోజుల ముందే కల్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. మహాశివరాత్రి పర్వదిన వేడుకలు ప్రారంభానికి సూచికగా కల్యాణోత్సవం నిర్వహించినట్లు, శివరాత్రి పర్వదిన సామూహిక రుద్రాభిషేకాలు, లింగోద్భవ కాలాన భస్మాభిషేకం నిర్వహించి గురువారం శాంతిపూజ, అన్నపూజలు నిర్వహిస్తామని ఆలయ అర్చకులు తెలిపారు. పాంచరాత్ర ఆగ మానుసారం కల్యాణ తంతును నిర్వహించారు.



ఆలయంలో సిద్ధేశ్వరుడి కల్యాణం చేయిస్తున్న అర్చకులు

మహా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన మెట్టుగుట్ట



స్వామి వారి విగ్రహానికి అభిషేకం చేస్తున్న రుత్వికులు

మడికొండ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈనెల 24 నుంచి మార్చి 4న వరకు మహా శివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.శేషభారతి తెలిపారు. ఆదివారం అడ్డగూడూరి సత్యనారాయణ, శశిధర్, శ్రీనివాస్, సుధాకర్, ప్రవీణ్‌రెడ్డి, సతీష్‌కుమార్, నాగరాజు, సుధీర్‌రెడ్డి దంపతులు సుమారు 6 కిలోల 250 గ్రాముల మిశ్రమ వెండితో స్వామివారి రూపం చేయించారు. దేవస్థానానికి సమర్పించగా అర్చక స్వామి, రుత్వికులు స్వామివారిని అలంకరణ చేసి ప్రత్యేక అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో రుత్వికులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు భైరి రాజు, దండిగం శ్రీనివాస్, రొడ్డ దయాకర్, బోగి కేదారి, ఎం.జ్ఞానేశ్వరి పాల్గొని స్వామి వారిని కొలిచారు.

క్రీడలతోనే యువతలో సత్ప్రవర్తన

హసన్‌పర్తి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతోనే యువతలో సత్ప్రవర్తన అలవడుతుందని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్.దిలీప్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలో మాస్టర్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. జీవితంలో గెలుపు, ఓటములు సహజమని వీటిపై సమదృష్టి కలిగి ఉన్నతంగా రాణించినప్పుడే మంచి క్రీడాకారుడిగా రాణించగలుగుతారని అన్నారు. ముఖ్యంగా క్రికెట్ పోటీలలో మహిళలు ముందుకు వచ్చి క్రికెట్ క్రీడాకారిణీలుగా రాణించాలన్నారు. భవిష్యత్తులో మండల కేంద్రంలో మంచి క్రికెట్ క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసేందుకు స్థానికఎమ్మెల్యే కేఆర్.నాగరాజును కోరుతానని హామీ ఇచ్చారు. ఇలాంటి పోటీలలో యువత పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించి జాతీయ స్థాయి క్రీడాకారులుగా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో 66వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్ కుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, మాజీ డైరెక్టర్ వీసం సురెందర్‌రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్‌లు ఆరెల్లి వెంకటస్వామి, జన్ను రవిందర్, క్రికెట్ నిర్వాహకులు శశికుమార్, సంపత్, సతీష్, రవిందర్, సాయి, యుగందర్, మురళి, దయాకర్, నరసింహరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్.దిలీప్‌కుమార్

కుంభమేళాలో వినయ్‌భాస్కర్ దంపతులు

హనుమకొండటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మహా కుంభమేళా సందర్భంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ్‌రాజ్‌లోని గంగా, యమున, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో మాజీ చీఫ్‌విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ దంపతులు పుణ్యస్నానమాచరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు.



మహా కుంభమేళాలో పుణ్యస్నానం ఆచరించిన వినయ్‌భాస్కర్ దంపతులు

మాజీ ఎమ్మెల్యే అరూరికి బండి సంజయ్ పరామర్శ



మాజీ ఎమ్మెల్యే రమేష్‌ను పరామర్శించిన కేంద్ర మంత్రి సంజయ్

హసన్‌పర్తి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి):వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ తల్లి ఆరూరి వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మృతి విషయం తెలిసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు ఆదివారం అరూరిని మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కేంద్ర మంత్రి వెంట బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెసరు విజయచందర్‌రెడ్డి, రావు పద్మ, పీఏసీఎస్ చైర్మెన్ జక్కు రమేష్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ రేణికుంట్ల సునిత, సింగిరెడ్డి రమాదేవి తదితరులున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించాలి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న కోలా జనార్ధన్‌గౌడ్, సాయిని నరేందర్, వేణుగోపాల్‌గౌడ్

వడ్డేపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించి రాజ్యాధికార సాధన కోసం ఉపాధ్యాయులు, అధ్యాపకులు సహకరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి కోలా జనార్ధన్‌గౌడ్, వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 26 వేల మంది ఓటర్లు ఉంటే కేవలం 2 వేల ఓట్లు మాత్రమే అగ్రవర్ణ ఆధిపత్యాల వారివి ఉన్నాయని అన్నారు. 24 వేల ఓట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వారివే ఉన్నాయని చెప్పారు. 5 శాతం కూడా లేని ఆధిపత్య వర్గానికి చెందిన నలుగురు అభ్యర్థులు ఎమ్మెల్సీ బరిలో నిలిస్తే, 90 శాతం ఉన్న బహుజనుల్లో ఆరుగురు పోటీలో ఉన్నారని అన్నారు. మన ఓట్లు మనమే వేసుకుంటే బీసీ అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థి సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉపాధ్యాయులను, అధ్యాపకులకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా జిల్లాకు చెందిన మరో అభ్యర్థి డాక్టర్ కొలిపాక వెంకటస్వామికి బహుజనులు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

ఈ సమావేశంలో బీసీ ఐక్య సంఘర్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఏదునూరి రాజమొగిలి, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్, మేరు సంఘం నేత తాళ్ల సంపత్‌కుమార్, ప్రజా సంఘాల నాయకులు దాడి మల్లయ్య యాదవ్, డాక్టర్ చందా మల్లయ్య, పల్లెబోయిన అశోక్, కందికొండ వేణుగోపాల్, జనగాని శ్రీనివాస్‌గౌడ్, చింత రమేష్‌గౌడ్, పులి మోహన్ గౌడ్, నాగరాజు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ నిట్ క్రీడాపోటీలు

- హ్యాండ్‌బాల్ పురుషుల విభాగంలో వరంగల్ నిట్
- కన్నుల పండువగా ముగింపు కార్యక్రమం

హనుమకొండ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్‌లో ఆదివారం ఆల్ ఇండియా ఇంటర్ నిట్ టోర్నమెంట్స్ విజయవంతంగా ముగిశాయి. హ్యాండ్‌బాల్‌లో వరంగల్ నిట్(పురుషులు) విజేతగా నిలిచింది. వాలీబాల్, హ్యాండ్‌బాల్, యోగా క్రీడల్లో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో దేశంలోని వివిధ ఎన్ఐటీల నుంచి క్రీడాజట్లు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాయి. ముగింపు కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. క్రీడాకారులు సమష్టి కృషిని, క్రీడాస్ఫూర్తిని, జట్టు తత్వాన్ని ప్రదర్శించారు. మూడు రోజుల పాటు ఉత్కంఠ భరితంగా సాగిన ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లు ఈ విధంగా ఉన్నాయి.

విజేతలు..

హ్యాండ్‌బాల్ పురుషుల విభాగంలో వరంగల్ ఎన్ఐటీ విజేతగా నిలిచింది. రన్నరప్‌గా సూరత్కల్ నిట్ మిగిలింది. హ్యాండ్‌బాల్ మహిళా విభాగంలో విజేతంగా రాయపూర్ ఎన్ఐటీ, రన్నరప్‌గా త్రిచి ఎన్ఐటీ, వాలీబాల్‌లో పురుషుల విభాగంలో విజేతగా కాలికట్ నిట్, రన్నరప్‌గా త్రిచి నిట్, మహిళా విభాగంలో విజేతగా సూరత్కల్ నిట్, రన్నరప్‌గా కురుక్షేత్ర నిలిచింది. యోగా పోటీల్లో పురుషుల విభాగంలో విజేతగా రాయ్‌పూర్ నిట్, రన్నరప్‌గా జంషెడ్‌పూర్ నిట్, మహిళా విభాగంలో విజేతగా జంషెడ్‌పూర్ నిట్, రన్నరప్‌గా కాలికట్ నిట్ నిలిచాయి.



క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఘనంగా ముగింపు కార్యక్రమం

ఆదివారం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమానికి వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి హాజరై విజేతలను అభినందించారు. బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి, క్రమశిక్షణకు, బలమైన జట్టు భావనకు దోహదం చేస్తాయని అన్నారు. స్టుడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డి. శ్రీనివాసాచార్య, సెంటర్ ఫర్ స్పోర్ట్స్ అక్టివిటీస్ హెడ్ పి.రవికుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోటీలను విజయవంతంగా నిర్వహించిన నిట్ క్రీడా విభాగాన్ని అభినందించారు. విద్యార్థుల క్రీడా స్ఫూర్తిని కొనియాడారు.

ఖమ్మంలో ఓరుగల్లు కవయిత్రిలకు సత్కారం

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఉదయ సాహితీ తెలంగాణ సాహిత్య వికాస వేదిక ఆధ్వర్యంలో ఉభయ రాష్ట్రాల తెలుగు కవుల రాష్ట్ర సమ్మేళనం ఖమ్మంలో జరిగింది. ఖమ్మం పట్టణం గోడిపూడి విజ్ఞాన కేంద్రం వేదికగా దాస్యం సేనాపతి, దాస్యం లక్ష్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాల మాధ్యమాల విజేతలైన కవులను అపూర్వంగా సత్కరించారు. ఇందులో భాగంగా హనుమకొండ పట్టణానికి చెందిన ప్రముఖ గజల్ గాయని, రచయిత్రి గంకిడి అరుణ కీర్తిపతాకరెడ్డితోపాటు వృత్తిరీత్యా ఉపాధ్యాయురాలైన మెరుగు అనురాధలను కవితా విభూషణ అవార్డులతో నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమ నిర్వాహకులు కురిమల్లె సునంద, రఘువీర్‌రెడ్డి, రంగయ్య, మహిళా కార్యదర్శి మూర్తి శ్రీదేవి తదితరులు అరుణ, అనురాధలను సత్కరించారు. ఇంకా కార్యక్రమంలో వరంగల్‌కు చెందిన ఉదయశ్రీ ప్రభాకర్, చింతల కమల తదితర కవయిత్రిలు కూడా పాల్గొన్నారు.



సత్కారం అందుకుంటున్న అరుణ కీర్తిపతాకరెడ్డి

మద్యం మత్తులో ట్రాక్టర్ డ్రైవర్ వీరంగం

భయాందోళనలో ప్రజలు.. వెంటాడి పట్టుకున్న పోలీసులు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : హసన్‌పర్తి గాంధీనగర్ వీధిలో ఓ ట్రాక్టర్ డ్రైవర్ మద్యం మత్తులో ట్రాక్టర్‌తో వీరంగం సృష్టించాడు. ఆదివారం రాత్రి అతడు మద్యం మత్తులో గాంధీ విగ్రహం నుంచి పోస్టాఫీసు వరకు ట్రాక్టర్‌ను అతివేగంగా నడుపుకుంటూ వచ్చాడు. అక్కడే పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై దేవేందర్ పోలీసు సిబ్బందితో ఆ డ్రైవర్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించాడు. దీంతో డ్రైవర్ మరింత వేగంగా ట్రాక్టర్‌ను నడుపుతూ పోస్టాఫీసు మూల వద్ద ఓ ఇంటి ఆవరణలోని గద్దెలకు ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఎవరికీ ఏప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. మద్యం మత్తులో ఉన్న డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

మహానగర సాంఘిక్‌కి తరలిన స్వయం సేవకులు



తరలివెళ్లిన స్వయం సేవకులు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన మహానగర సాంఘిక్‌కి హసన్‌పర్తి నుంచి స్వయం సేవకుల బృందం సభ్యులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మహానగర సాంఘిక్‌కి తరలివెళ్లిన వారిలో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీజేపీ రాష్ట్ర నాయకులు మారపల్లి రాంచంద్రారెడ్డి, బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు మారం తిరుపతి, మట్టెడ సుమన్ తదితరులున్నారు.

ఏ రాజకీయ పార్టీతో మాకు సంబంధం లేదు

న్యూశాయంపేట, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): ఏరాజకీయ పార్టీతో మాకు సంబంధం లేదని కాకతీయ స్టోన్ క్రషర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పి.మధుసూదన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న క్రషర్లు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలవి అన్నట్లుగా ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైందని, కానీ మేము ఏ పార్టీకి అనుబంధం కాదన్నారు. ఒకరిద్దరు బీఆర్ఎస్ నాయకులు కొన్ని క్రషర్‌లలో భాగస్వామ్యం ఉన్నంతమాత్రాన అందరికి బీఆర్ఎస్ పార్టీతో సంబంధం లేదని, తాము గత 20ఏళ్ల నుంచి అన్నిరకాల అనుమతులతో క్రషర్లు నడుపుకుంటున్నామన్నారు. ఈమధ్య పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అధికారులు ఒత్తిడికి గురిచేయడంతో క్రషర్లు బంద్ చేశామని, ఇదే విషయాన్ని ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళితే సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు పి.మధుసూదన్‌రావు ఆ ప్రకటనలో తెలిపారు.

సర్వ కళల సమాహారం నాటికలు

సహృదయ నాటకోత్సవాల్లో సుబ్బరాయశర్మ

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : సర్వ కళల సమాహారం నాటకమని, కార్యేషు నాటకం రమ్యం.. అంటూ ఈ నాటకాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, అంతరించకుండా కాపాడుకోవాలని ప్రముఖ సినీ, బుల్లితెర నటుడు సుబ్బరాయశర్మ అన్నారు. హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో సహృదయ ఆధ్వర్యంలో 24వ తెలుగు భాష ఆహ్వాన నాటిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సహృదయ అధ్యక్షులు గిరిజా మనోహర్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెండున్నర దశాబ్దాలుగా యేటా మహాశివరాత్రి వేళ నాటక పరిషత్‌లను నిర్వహిస్తూ ఈరంగాన్ని ప్రోత్సహిస్తున్న సహృదయ నిర్వాహకులు ఎంతో అభినందనీయులన్నారు. అనేక వ్యయ ప్రయాసలకోర్చి కళాకారుల ప్రతిభను చాటుతూ ప్రోత్సహిస్తున్న సహృదయ రాష్ట్రంలోని ఇతర పరిషత్‌లకు మార్గదర్శనమని కొనియాడారు. సంస్థ ప్రధాన కార్యదర్శి కుందావజ్ఝుల కృష్ణమూర్తి స్వాగతం పలికిన కార్యక్రమంలో సాంస్కృతిక కార్యదర్శి వనం లక్ష్మీకాంతరావు సహృదయ నివేదికను సమర్పించారు. తొలి నాటకంగా విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో స్వేచ్ఛ నాటికను ప్రదర్శించారు. స్వేచ్ఛ అంటే విచ్చలవిడితనం కాదని ఆడ, మగ ఎవరైనా పరిమితులు లేని జీవితాన్ని స్వేచ్ఛ పేరిట గడిపితే అది తెగిన గాలిపటం లాంటి తీరుగా ఉంటుందని చక్కని సందేశంతో నాటకం కొనసాగింది. మహేశ్వరి పాత్రలో సురభి లలిత, శ్వేతగా మంజుభార్గవి, అవినాష్‌గా ఏపూరి శ్రీనివాస్, ఆనంద్‌గా వెంకట్ అద్భుతంగా తమ పాత్రలలో జీవించారు. రెండవ నాటికగా సుబ్బరాయశర్మ దర్శకత్వంతో భారతీయ ఔన్నత్యాన్ని చాటే ఉక్కుసంకెళ్లు నాటకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు న్యాలకొండ భాస్కర్‌రావు, ఎన్‌వీఎన్.చారి, కళా రాజేశ్వర్ రావు, వి.పురుషోత్తంరావు, మల్యాలమనోహర్‌రావు, జూలూరు నాగరాజు గౌడ్, ఆకుల సదానందం,కవులు, కళాకారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుబ్బరాయశర్మ

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం
24 ఫిబ్రవరి 2025

మెదడు చురుకుగా పనిచేయాలంటే...

జ్ఞాపకశక్తి, ఆలోచనా విధానం అనేవి మెదడు పనితీరుపై ఆధారపడి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ప్రతిరోజూ కొన్ని చిట్కాలు పాటించి మెదడుని శక్తిమంతంగా మార్చవచ్చని సూచిస్తున్నారు.

- ఉదయం నిద్రలేవగానే మనసారా నవ్వాలి. దీనివల్ల శరీరంలో డోపమైన్ అనే హార్మోన్ విడుదలవుతుంది. ఇది న్యూరోట్రాన్స్‌మీటర్‌లా పనిచేసి జ్ఞాపకశక్తిని పెంపొందిస్తుంది. నేర్చుకునే సామర్థ్యాన్ని పెంచుతుంది.
- నాలుగు వాల్‌నట్ గింజలను రాత్రంతా నీళ్లలో నానబెట్టి ఉదయం అల్పాహార సమయంలో తింటే మెదడు పనితీరు మెరుగవుతుంది. డార్క్ చాక్లెట్, బ్లూబెర్రీలు తీసుకోవడం మంచిదే. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు... ఏకాగ్రతని, గుర్తుపెట్టుకునే సామర్థ్యాన్ని పెంచుతాయి.
- ప్రతిరోజూ రాత్రి పడుకునేముందు రాయడం అలవాటు చేసుకోవాలి. నిన్నటి కల, రేపటి పనులు, ఈ రోజు జరిగిన ప్రధాన సంఘటన లాంటివి రాస్తూ ఉంటే మెదడు చురుకుగా పనిచేస్తుంది. రాసినవి చాలాకాలం గుర్తుంటాయి కూడా.
- ఉదయం లేవగానే మెమరీ గేమ్ ఆడితే మంచి ఫలితం ఉంటుంది. నిన్న చేసిన పనులు గుర్తుకు తెచ్చుకోవడం, ఒక మంచి మాట చదివి గుర్తుపెట్టుకోవడం లాంటి మానసిక వ్యాయామాలు చేస్తుంటే నాడులన్నీ బలోపేతమై మెదడు ఆరోగ్యంగా ఉంటుంది.
- శరీరంలో నీటి శాతం తక్కువైతే మెదడు పనితీరు మందగిస్తుంది. ఉదయం లేవగానే ఒక గ్లాసు నీటిలో కొంచెం నిమ్మరసం, కొద్దిగా ఉప్పు వేసుకుని తాగితే నీరసం తగ్గి మెదడు చురుకుగా పనిచేస్తుంది.



- ఉదయం లేదా సాయంత్రం కనీసం పది నిమిషాలు నడక అలవాటు చేసుకోవాలి. పరిసరాలను చూస్తూ ముందుకు సాగాలి. రంగులు, శబ్దాలు, వాసనలను గమనిస్తూ నడుస్తుంటే మెదడుకి పరిశీలనా శక్తి, సృజనాత్మక శక్తి పెరుగుతాయి. నడక వల్ల మెదడుకి రక్త ప్రసరణ సక్రమంగా జరుగుతుంది.
- అప్పుడప్పుడు ఎడమ చేతితో పుస్తకాలు సర్దడం, తల దువ్వుకోవడం లాంటివి చేస్తుంటే మెదడు శ్రమ పడడానికి సమాయత్తమవుతుంది. దీంతో ఏకాగ్రత, వేగంగా స్పందించడం లాంటివి అలవడతాయి.
- ఉదయం లేవగానే నిటారుగా నిలబడి చేతులను నడుముపై ఉంచి రెండు నిమిషాలు శ్వాస తీసుకొని మెల్లగా వదలాలి. ఇలా నాలుగుసార్లు చేస్తే మెదడుకి ఆక్సిజన్ అంది స్పష్టమైన ఆలోచనలు చేసే సామర్థ్యం పెరుగుతుంది.
- పుదీనా రుచిగల చూయింగ్ గమ్‌ని నములుతూ ఉంటే మెదడుకి రక్తప్రసరణ పెరుగుతుంది. రోజంతా మనసు, శరీరం తాజాగా ఉంటాయి.

వేడి తగ్గాలంటే...

వేసవికాలంలో సాధారణంగా శరీర ఉష్ణోగ్రత పెరుగుతూ ఉంటుంది. తరచుగా తాజా పండ్లు తింటూ ఉంటే శరీరంలో నీటి శాతం పెరిగి వేడి తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.

అరటిపండు



శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడంలో అరటిపండుది ప్రథమ స్థానం. ఈ పండును తినడం వల్ల పేగుల్లో వేడి తగ్గుతుంది. కాబట్టి మలబద్ధకం రాదు.

నారింజ



ఈ పండులో విటమిన్-సితో పాటు ఫైబర్, గ్లూకోజ్ తదితర పోషకాలు అధికంగా ఉంటాయి. ఇది వేసవిలో దాహాన్ని తగ్గిస్తుంది. మధ్యాహ్న సమయంలో నారింజపండుని తింటే శరీరంలో వేడి తగ్గి శక్తి లభిస్తుంది.

కీరా



సహజంగా చల్లబరిచే గుణాలు దీనిలో పుష్కలం. దీనిలో నీరు కూడా అధికంగా ఉంటుంది. వేసవికాలంలో ప్రతిరోజూ కీరా ముక్కలపై ఉప్పు వేసుకుని తింటే వడదెబ్బ తగలదు. పొట్టలో వేడి తగ్గి చల్లగా అనిపిస్తుంది.

కర్బూజ పండు



ఇందులో బి, సి విటమిన్లతో పాటు అధికంగా పొటాషియం, సోడియం మెగ్నీషియం, పిండి పదార్థాలు, పీచు పదార్థాలు ఉంటాయి. ఇవన్నీ వేసవి తాపాన్ని తగ్గిస్తాయి.





బాధ్యతల స్టీరింగ్ పట్టారు...

భర్తకు చేదోడువాదోడుగా ఒకరు... కట్టుకున్నవాడి ఆదరణకు నోచుకోక బాధ్యతలు భుజానకెత్తుకొని మరొకరు... బతుకు బండి నడిపించడానికి స్టీరింగ్ పట్టారు ఇద్దరు పేద మహిళలు. ఒకరు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తుంటే... మరొకరు పండ్లు, కూరగాయలను ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు. నిత్యం ఎన్నో సమస్యలు, సవాళ్లు, చులకన మాటలు... వేటికి కుంగిపోకుండా ఆత్మవిశ్వాసమే అండగా ప్రయాణం సాగిస్తున్నారు... సూర్యాపేట జిల్లాకు చెందిన పగిళ్ల సైదమ్మ, పిట్టల కళమ్మ.

ఒంటరి మహిళగా...

సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రానికి చెందిన పిట్టల కళమ్మది భిన్నమైన కథ. ఆమెకు కొడుకు, కూతురు. పిల్లలు పుట్టిన కొన్నాళ్లకు ఆమె భర్త ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. ఒంటరి మహిళగా ఈ కుటుంబాన్ని ఎలా నెట్టుకురావాలనే బాధ కళమ్మను వేధించింది. దిక్కుతోచని స్థితిలో నూతనకల్‌లోనే కూరగాయలు, పండ్ల వ్యాపారం ప్రారంభించింది. కొడుకు గణేష్‌ను, కూతురు గౌతమిని సూర్యాపేటలోని ప్రైవేట్ కళాశాలలో చేర్పించి చదివించింది. తనలా తన పిల్లలు ఇబ్బందులు పడకూడదని, వారికి మంచి భవిష్యత్తు ఇవ్వాలని పట్టుదలగా వారిని చదివిస్తోంది.

ఇబ్బందులు ఎదురైనా...

వేరే ప్రాంతాలకు వెళ్లి కూరలు, పండ్లు విక్రయించాలంటే ఒక వాహనం కావాలి. దాని కోసం ఒక వాహనం కొని, డ్రైవర్‌ను నియమించింది కళమ్మ. చాలా సందర్భాల్లో సమయానికి డ్రైవర్లు డ్యూటీకి వచ్చేవారు కాదు. ఆ ప్రభావం వ్యాపారం మీద పడేది. తరచూ ఇలా జరుగుతుండటంతో తనే వాహనం నడపడం నేర్చుకుంది. పూర్తి నైపుణ్యం సాధించాక డ్రైవర్లను తొలగించి, స్వయంగా వాహనం నడపడం మొదలుపెట్టింది. రోజూ సూర్యాపేట, హైదరాబాద్, ఖమ్మం పట్టణాలకు వెళ్లి అక్కడ హోల్‌సేల్‌గా కూరగాయలు, పండ్లు కొనుగోలు చేస్తుంది. ఆ సరుకును నూతనకల్‌కు తరలిస్తుంది. అక్కడి దుకాణాల్లో వాటిని విక్రయిస్తుంటుంది. అంతేకాదు... సమీప ప్రాంతాలకు వెళ్లి అమ్మకాలు కూడా సాగిస్తుంది.

అన్నీ తానై...

ఏ తోడూ లేకపోయినా ఇంటి పని, డ్రైవింగ్, వ్యాపార లావాదేవీలన్నీ కళమ్మ ఒక్కతే చూసుకొంటోంది. పేదరికంతో తన పిల్లలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో అహర్నిశలూ కష్టపడుతోంది. ఆశించిన మేర వ్యాపారం సాగడంలేదని, ప్రభుత్వం తనలాంటి మహిళలకు రుణాలు అందించి ప్రోత్సాహించాలని ఆమె కోరుతోంది.

పగిళ్ల సైదమ్మది సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెలుగుపల్లి గ్రామం. భర్త, పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. సైదమ్మ భర్త లింగయ్య హోంగార్డుగా పని చేసేవాడు. వీరికి కుమారుడు సందీప్, కుమార్తె స్వప్న ఉన్నారు. కొన్నాళ్ల క్రితం భర్త లింగయ్య అనారోగ్యంతో విధులకు హాజరుకాలేకపోవడంతో ఉద్యోగం నుంచి తొలగించారు. దీంతో అతను అప్పు చేసి, ఒక కారు కొన్నాడు. దానిద్వారా వచ్చే సంపాదన ఏ మూలకూ సరిపోయేది కాదు. అదే సమయంలో కూతురు పెళ్లి చేశారు. దాంతో ఆ కుటుంబం ఆర్థికంగా మరింత చితికిపోయింది. తన తండ్రికి కొంతైనా భారం తగ్గించాలని కొడుకు సందీప్ నిర్ణయించుకున్నాడు. ఫైనాన్స్ తీసుకొని... తుఫాన్ వాహనం కొన్నాడు. అతడికీ వివాహమైంది. తండ్రీకొడుకులకు వచ్చే ఆదాయంతో కుటుంబం గడవడం కష్టం కావడంతో... పరిస్థితులు సైదమ్మకు నిద్ర పట్టనివ్వలేదు. ఏంచేయాలని ఆలోచిస్తున్నప్పుడు ఆమె దృష్టి ఇంట్లో ఉన్న తుఫాన్ వాహనంపై పడింది.

భారం తగ్గించాలని...



కొడుకుతో డ్రైవింగ్‌కు వెళ్లి...

సందీప్ డ్రైవింగ్‌లో శిక్షణ తీసుకున్నప్పుడు సైదమ్మ కూడా అతడి వెంట వెళ్లేది. క్రమంగా తను కూడా డ్రైవింగ్ నేర్చుకుంది. ఆ తరువాత లైసెన్స్ తెచ్చుకుంది. కుటుంబ భారం పంచుకోవాలనే ఉద్దేశంతో వాహనం నడుపుతోంది. గతంలో ఇంట్లో విస్తరాకులు తయారు చేసి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలకు తమకున్న వ్యాన్‌లో తీసుకెళ్లి విక్రయించేది. కరోనా లాక్‌డౌన్ తర్వాత విస్తరాకుల వ్యాపారం నడవలేదు. దీంతో రోజూ ఉప్పల్ నుంచి సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల కేంద్రం వరకు తుఫాన్ వాహనం నడుపుతోంది. ఆమె రోజూ ఒక ట్రిప్పు మాత్రమే వెళ్తుంది. ఒక ట్రిప్పుకు డీజిల్ ఇతర ఖర్చులు పోను రెండు వేల నుంచి రెండున్న వేల రూపాయల వరకు మిగులుతున్నాయి.

అడ్డుకోవాలని చూసినా..

ఉప్పల్‌లోని వాహనాల అడ్డా వద్ద కొంతమంది మగవారు సైదమ్మను అడ్డుకోవాలని చూశారు. మహిళ కాబట్టి వాహనం నడపవద్దంటూ చులకన చేసేవారు. ఉప్పల్ అడ్డా మీదకు వాహనం తీసుకుని రావద్దని చెప్పేవారు. అయినా వెనక్కి తగ్గకుండా రోజూ వాహనం తీసుకువెళ్లి, ప్రయాణికులను ఆమె క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేరవేస్తోంది. క్రమంగా పరిస్థితులు మారాయి. హేళనలు తగ్గాయి. ఇక వాహనంలో చిన్నచిన్న రిపేర్లు వస్తే తనే సరిచేసుకుంటుంది. టైర్ పంక్చర్ అయినా వేరొకరి సాయం లేకుండా మార్చేసుకొంటుంది.

క్షణం తీరిక దొరకదు...

తెల్లవారుతూనే నిద్ర లేచింది మొదలుపడుకోబోయేవరకు సైదమ్మకు క్షణం తీరిక ఉండదు. ఇంటి పనులు చేసుకుని తనతో పాటు భర్తకు మధ్యాహ్న భోజనం సిద్ధం చేస్తుంది. ఉదయం తొమ్మిది గంటలకు ఉప్పల్ చౌరస్తా వద్దకు వాహనాన్ని తీసుకుని వెళుతుంది. అక్కడ వరుసలో వాహనాన్ని నిలుపుతుంది. ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉంటే కాసేపటికే బండి నిండుతుంది. వారిని తిరుమలగిరికి తీసుకెళ్తుంది. అక్కడే భోజనం చేసి, వరుసలో తన వంతు రాగానే... ప్రయాణికులతో సాయంత్రానికి హైదరాబాద్ చేరుకుంటుంది. ఇంటికి వెళ్లాక రాత్రి పడుకోబోయేవరకు పని చేస్తూనే ఉంటుంది.

● సిరికొండ సైదులు, సూర్యాపేట

భూమిపై మనిషి జీవనానికి ఆలంబనగా నిలిచేది ప్రకృతి. వృక్ష సంపద, జంతువులు, పక్షులు ఇవన్నీ దానిలో భాగమే! అందుకే వీటిని రక్షించాల్సిన బాధ్యత కూడా మానవుడిపై ఉంది. దీనికోసం అనేక మంది శాస్త్రవేత్తలు ఉద్యమ స్ఫూర్తితో పనిచేస్తున్నారు. అలాంటి వారిలో ఒకరు అసోంకు చెందిన జీవశాస్త్రవేత్త పూర్ణిమా దేవి బర్మన్. అంతరించిపోతున్న పక్షిజాతుల పరిరక్షణ కోసం ఆమె చేస్తున్న కృషి.. అంతర్జాతీయ సమాజం మెప్పు అందుకుంటోంది. తాజాగా 'టైమ్స్ మ్యాగజైన్' ప్రకటించిన 'ఉమెన్ ఆఫ్ ది ఇయర్'- 2025 జాబితాలో ఆమెకు స్థానం దక్కింది.



అరుదైన పక్షులకు అమ్మలా, అండగా...

"పక్షులు కూడా మనలాంటి ప్రాణులే వాటిని రక్షించాల్సిన బాధ్యత మనదే" అని గాఢంగా నమ్ముతారు పూర్ణిమ. అందుకే పక్షులకు ఎక్కడ, ఎలాంటి ఆపద వచ్చినా వాటిని పరిరక్షించడంలో ఆమె ముందుంటారు.. అలాంటి సంఘటన ఒకటి 2007లో జరిగింది. "అసోంలో నేను నివసిస్తున్న ప్రాంతానికి దగ్గరలో ఒక చెట్టును స్థానికులు నరకటానికి సిద్ధపడ్డారు. దీనికి కారణం ఆ చెట్టు మీద 'అడ్జటంట్ స్టార్క్' అనే జాతికి చెందిన కొంగలు నివసిస్తూ ఉంటాయి. స్థానికులు ఆ పక్షులను అశుభసూచకంగా భావిస్తారు. ఎందుకంటే ఆ పక్షులు జంతుకళేబరాలనే కాదు... ఎముకలను కూడా తింటాయి. అందుకే వాటిని అస్సామీ భాషలో 'హర్గిలా' (ఎముకలు తినేవి) అని పిలుస్తారు. కానీ స్థానికులకు తెలియని విషయమేమిటంటే- ఆ సమయానికి ఆ జాతి పక్షులు 450 మాత్రమే మిగిలి ఉన్నాయి. మిగిలినవన్నీ అంతరించిపోయాయి. ఇవి కూడా అంతరించిపోతే- ఈ భూమిని శుభ్రం చేయటానికి ప్రకృతి సృష్టించిన చక్రంలో ఒక ఇరుసు పోయినట్లే! నేను వెళ్లేసరికే చెట్టుపై ఉన్న పక్షి గూళ్లను స్థానికులు కర్రలతో కిందకు పడేశారు. గూళ్లలో ఉన్న పక్షి పిల్లలు నేలమీద గిలగిలా కొట్టుకుంటున్నాయి. నిస్సహాయంగా ఉన్న ఆ పక్షి పిల్లలను చూస్తే - నాకు నా పిల్లలు గుర్తుకొచ్చారు. చెట్టును నరకవద్దని స్థానికులకు నచ్చచెప్పటానికి ప్రయత్నించాను. కానీ వారు ఒప్పుకోలేదు. పెద్ద గొడవ అయిన తర్వాత.. వన్యప్రాణి పరిరక్షణ అధికారులకు ఫిర్యాదు చేశాను. అప్పుడు స్థానికులు వెనక్కి తగ్గారు. ఈ సంఘటన నాలో అనేక ఆలోచనలను రేకెత్తించింది" అంటారు పూర్ణిమ.

హర్గిలా ఆర్మీ...

ఆ తర్వాత పూర్ణిమ స్టార్క్ పక్షుల పరిరక్షణ కోసం ఒక ఉద్యమం చేపట్టారు. పక్షుల పరిరక్షణకు మహిళలు ఉపకరిస్తారని భావించిన ఆమె అసోంలోని అనేక ప్రాంతాలు తిరిగారు. మహిళలలో అవగాహన కల్పించటం మొదలుపెట్టారు. మొదట చిన్న స్థాయిలో ప్రారంభమయిన ఈ హర్గిలా పరిరక్షణ ఉద్యమం నెమ్మదిగా అసోం అంతటా వ్యాపించింది. స్టార్క్ పక్షులు పెట్టే గూళ్లను స్థానికులు పడగొట్టకుండా అవగాహన కల్పించటం దీని ముఖ్య ఉద్దేశం. "అసోంలోనే కాదు చాలా ప్రాంతాల్లో ఈ పక్షులను శవాలు పీక్కుతినేవిగా పరిగణిస్తారు. ఇవి తమ ప్రాంతంలో ఉంటే అశుభమని భావిస్తారు. వాస్తవానికి ఈ పక్షులు జంతువుల ఎముకలను తిని పర్యావరణాన్ని పరిశుభ్రపరుస్తాయి. ఈ విషయం చాలామందికి తెలియకపోవడంతో... ఈ పక్షుల గూళ్లను గుర్తించి, వాటిని కర్రలతో కొట్టేస్తూ ఉంటారు. కాబట్టి ముందు ఈ సమస్యను నివారించడానికి స్థానికుల్లో అవగాహన కల్పించటం మొదలుపెట్టాం. క్రమంగా ఉద్యమం విస్తరించింది" అని ఆమె చెప్పారు. ప్రస్తుతం ఈ ఉద్యమంలో సుమారు 20 వేల మంది భాగస్వాములుగా ఉన్నారు. వీరందరూ స్టార్క్ పక్షుల అవసరం గురించి ప్రచారం చేస్తున్నారు. మొదట్లో అసోంకి మాత్రమే పరిమితమయిన ఈ ఉద్యమం కంబోడియా, ఫ్రాన్స్ తదితర దేశాలకు కూడా విస్తరించింది. విదేశాల్లో కూడా పూర్ణిమ చేస్తున్న కృషికి ప్రాచుర్యం లభించింది. 2017లో బ్రిటన్‌కు చెందిన 'వైట్లీ ఫండ్ ఫర్ నేచర్' ప్రకృతి సంరక్షకులకు ఇచ్చే 'వైట్లీ' అవార్డు, ఆ తర్వాత భారత ప్రభుత్వం నుంచి 'నారీ శక్తి' పురస్కారం లభించాయి. అంతరించిపోతున్న పక్షి జాతుల పరిరక్షణ కోసం జరిగే అనేక జాతీయ, అంతర్జాతీయ సమావేశాల్లో ఆమె పాల్గొన్నారు. తాజాగా 'టైమ్స్' జాబితాలో ఆమె పేరు చోటు చేసుకోవడం... అంతర్జాతీయంగా ఆమెకు లభించిన మరో గొప్ప గుర్తింపు.



విమానంలో వెళుతున్నారా...



సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చినప్పుడు ఒక్కోసారి విమాన ప్రయాణం తప్పనిసరి అవుతుంది. అలాంటప్పుడు కొన్ని అత్యవసర వస్తువులను వెంట తీసుకువెళ్లడం మంచిది. వాటి గురించి తెలుసుకుందాం.

- విమానాశ్రయంలో లగేజ్ బ్యాగ్‌లు పరీక్షిస్తారు. తీసుకువెళ్లే వస్తువులు, దుస్తులు అన్నింటినీ క్రమ పద్ధతిలో సర్దుకోవాలి. అత్యవసరమైన చిన్న వస్తువులను హ్యాండ్ బ్యాగ్‌లో పెట్టుకోవాలి.
- ప్రయాణ సమయం ఎక్కువగా ఉంటే ట్రావెల్ పిల్లోను తప్పనిసరిగా తీసుకువెళ్లాలి. విమానంలో కూర్చునే సీటు సౌకర్యవంతంగా అనిపించని పక్షంలో ఇది ఉపయోగపడుతుంది. విశ్రాంతి తీసుకోవడానికి అనువుగా ఉంటుంది.
- విమానాశ్రయానికి వెళ్లినప్పటినుంచి అక్కడ వ్యవహారాలు పూర్తిచేసుకుని విమానం ఎక్కడానికి ఎక్కువ సమయం పట్టవచ్చు. ఒక్కోసారి విమానం ఆలస్యం కావచ్చు. ఈలోపు ఫోన్‌లో ఛార్జింగ్ సగానికిపైగా అయిపోతుంటుంది. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా పోర్టబుల్ ఛార్జర్‌ను వెంట తీసుకువెళితే ప్రయోజనకరంగా ఉంటుంది.
- దూరప్రాంతాలకు వెళుతున్నట్లయితే హెడ్‌ఫోన్స్ తీసుకువెళ్లడం మంచిది. ప్రయాణ సమయంలో సినిమా చూడడానికి లేదా సంగీతం వినడానికి అనువుగా ఉంటుంది.
- దుప్పటి లేదా స్కార్ఫ్ తీసుకెళ్లడం ప్రయోజనకరంగా ఉంటుంది. విమానంలో ఏసీ పడకపోయినా, చలి ఎక్కువగా ఉన్నా, నిద్రపోవాలనిపించినా దాన్ని ఉపయోగించుకోవచ్చు.
- విదేశాలకు వెళుతున్నట్లయితే లగేజ్ ట్రాకర్ పరికరాలను వెంట ఉంచుకోవడం మంచిది. వీటిని లగేజ్‌కు జతచేసి మొబైల్‌లో సంబంధిత యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే లగేజ్ ఎక్కడ ఉందో తెలుసుకోవచ్చు.
- హ్యాండ్ బ్యాగ్‌లో టూత్‌పేస్ట్, బ్రష్, సోప్ పేపర్, లిప్ బామ్, చిన్న తువ్వాలు లేదా నాప్‌కిన్, వాటర్‌బాటిల్ లాంటివి పెట్టుకోవడం మంచిది. ప్రయాణ సమయంలో విమానం మారాల్సి వచ్చినప్పుడు రిఫ్రెష్ అయ్యేందుకు పనికివస్తాయి.

వాడేసిన టీ పొడితో...

చాలామంది టీ తయారుచేసి వడబోసిన తరవాత పొడిని సింక్‌లో లేదా చెత్తబుట్టలో పడేస్తుంటారు. అలాకాకుండా వాడేసిన టీ పొడిని పలురకాలుగా ఉపయోగించుకోవచ్చు.



- టీ ఫిల్టర్‌లో మిగిలిన పొడిని ఒక గిన్నెలో వేయాలి. ఇందులో ఒక గ్లాసు మంచినీరు పోసి బాగా కలిపి వడబోస్తే పొడిలోని పంచదార తొలగిపోతుంది. ఈ పొడిని పూలు, కూరగాయల మొక్కల మొదళ్లలో వేస్తే మంచి ఎరువులా పనిచేస్తుంది. మొక్కలకు పోషకాలు అంది, అవి బాగా పెరుగుతాయి.
- వంటగదిలో గ్యాస్ స్టవ్ మీద బర్నర్లు, వాటి చుట్టూ ఉండే స్టాండ్‌లు తరచూ జిడ్డుగా, మురికిగా మారుతూ ఉంటాయి. వాడేసిన టీ పొడిలో కొంత నీరు, రెండు చెంచాల డిష్ వాషింగ్ లిక్విడ్ వేసి బాగా కలపాలి. ఆ ద్రవంలో స్క్రబ్బర్‌ను ముంచి బర్నర్లను, స్టాండ్లను తోమితే అవి కొత్తవాటిలా మెరుస్తాయి. దీనితో స్టీల్ గ్యాస్ స్టవ్‌ను కూడా తోమి శుభ్రం చేసుకోవచ్చు.
- కిటికీ అద్దాల మీద తరచూ దుమ్ము, ధూళి పడుతూ ఉంటుంది. వాడేసిన టీ పొడిని గిన్నెలో వేసి ఒక గ్లాసు నీరు పోసి కొద్దిగా వేడి చేయాలి. ఈ నీటిని వడబోసి ఒక స్ప్రే బాటిల్‌లో పోయాలి. తరవాత అద్దాలపై కొద్దిగా స్ప్రే చేస్తూ పలుచని వస్త్రం లేదా కాగితంతో తుడిచేయాలి. అప్పుడు అద్దాలు చక్కగా మెరుస్తాయి. ఇలాగే ఇంటి తలుపులను కూడా శుభ్రం చేయవచ్చు.
- వాడేసిన టీ పొడిని ఒక గిన్నెలో వేసి కొన్ని నీళ్లు కలిపి వడబోయాలి. ఈ పొడిలో ఒక గ్లాసు మంచినీరు పోసి వేడిచేసి, చల్లార్చి, మళ్లీ వడబోయాలి. తలస్నానం చేసిన తరవాత మాడుమీద, శిరోజాల కుదుళ్లకు ఈ నీటిని పట్టించాలి. తరచూ ఇలా చేస్తూ ఉంటే శిరోజాలు మృదువుగా మారి సహజంగా మెరుస్తాయి.
- బడి పిల్లలు, ఉద్యోగస్తులు ఎక్కువసేపు షూస్ ధరించి ఉండడం వల్ల పాదాల నుంచి దుర్వాసన వస్తూ ఉంటుంది. వాడేసిన టీ పొడిని ఒక వెడల్పాటి టబ్‌లో వేసి ముప్పావు వంతు వరకు గోరువెచ్చని నీరు పోయాలి. ఇందులో ఒక చెంచా ఉప్పు వేసి కలపాలి. ఈ నీటిలో రెండు పాదాలు ఉంచి కనీసం పావుగంట నాననివ్వాలి. తరవాత మంచి నీటితో శుభ్రం చేసుకుంటే పాదాల దుర్వాసన తొలగిపోతుంది.

పీడకలలను అధిగవించడం ఎలా..?

ఒక్కోసారి నిద్రలో పీడకలలు వచ్చి కలవరపాటుని కలిగిస్తుంటాయి. వీటిని అధిగమించడానికి నిపుణులు ఇస్తున్న సూచనలు ఇవే...



- నిద్రకు ఉపక్రమించే ముందు మనసు ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలి. కొద్దిసేపు ధ్యానం చేయడం, సంగీతం వినడం, పుస్తకం చదవడం లాంటివి ఉపకరిస్తాయి. భయానకమైన దృశ్యాలు ఉండే సినిమాలను పడుకునేముందు చూడకూడదు.
- సాధ్యమైనంతవరకూ ప్రతిరోజూ ఒకే సమయానికి పడుకోవడం, నిద్రలేవడం అలవాటు చేసుకోవాలి. దీనివల్ల నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది. పీడ కలలు రావడం ఆగుతాయి.
- ఆరోగ్యాన్ని అందించే పోషకాహారం తీసుకుంటూ నిత్యం వ్యాయామం చేస్తూ ఉండాలి. క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవరచుకోవాలి.
- పీడకలలకు ప్రధాన కారణం మానసిక ఒత్తిడి. దీనికి యోగా చేయడం మంచి పరిష్కారం. పిల్లలతో కలిసి ఆటలాడడం, పార్కులో నడవడం, స్నేహితులతో కబుర్లు లాంటివి మనసుని ప్రశాంతంగా ఉండేలా చేస్తాయి.
- అనారోగ్య కారణాల వల్ల, వాడుతున్న మందుల వల్ల కూడా పీడకలలు రావచ్చు. అన్ని జాగ్రత్తలూ తీసుకున్నప్పటికీ సమస్య తీరకపోతే మానసిక నిపుణుల సలహా పాటించాలి.

త్వరలో తెలుగు రాష్ట్రాల్లో బోర్డు పరీక్షలు మొదలు కాబోతున్నాయి. రెండు రాష్ట్రాల్లో కలిపి గత సంవత్సరం సుమారు 10 లక్షల మంది పదో తరగతి, 12 లక్షల మంది ఇంటర్మీడియట్ పరీక్షలు రాశారు. ఈ సంవత్సరం కూడా దాదాపు అంతే సంఖ్యలో విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. సమగ్రమైన ప్రణాళిక, సమయ నిర్వహణతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని విద్యా నిపుణులు చెబుతున్నారు. బోర్డు పరీక్షల మార్కులు ఉన్నత విద్యా అవకాశాలను నిర్ణయిస్తాయి. ప్రిపరేషన్ బాగుంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. పరీక్షా హాల్‌లో సమయం సరిపోతుంది. అలాగే సరైన స్టడీ ప్లాన్, రివిజన్, మాక్ టెస్టులు రాయడం వల్ల బాగా గుర్తుంటాయి. టాపర్ల టిప్స్ అనుసరించడం, తప్పులు తగ్గించడం ఉత్తమ ఫలితాలకు దోహదం చేస్తాయి. పరీక్షలకు ఉన్న ఈ కొద్ది రోజుల్లో స్మార్ట్ వర్క్ ముఖ్యం అంటున్నారు నిపుణులు...



పరీక్షల ముందు ఇలా చదవండి

ప్లానింగ్ ముఖ్యం

1. తప్పక చదవాల్సిన చాప్టర్లను గుర్తించండి. బోర్డు పరీక్షలలో ఎక్కువ స్కోరింగ్ టాపిక్స్ తెలుసుకోండి.
2. రోజువారీ టైమ్ టేబుల్ తయారు చేసుకోండి. ప్రతి రోజు చదవడానికి ఖచ్చితమైన సమయాన్ని కేటాయించండి.
3. చిన్న చిన్న లక్ష్యాలను నిర్ధారించుకోండి. కష్టమైన సబ్జెక్టుల్లో ఒక్కో రోజు ఒక హార్డ్ చాప్టర్, ఈజీ చాప్టర్ లేదా ముఖ్యమైన టాపిక్స్ పూర్తిచేయండి.
4. సమయం వృధా చేయొద్దు. మొబైల్, టీవీ వంటి దృష్టి మళ్లించే విషయాలను తగ్గించాలి.
5. కనీసం 6-8 గంటలు నిద్ర ముఖ్యం.

మంచి మార్కుల చిట్కాలు

6. సొంత నోట్స్ ప్రిపేర్ చేసుకోండి. ముఖ్యమైన పాయింట్లు, ఫార్ములాలు, డయాగ్రామ్స్ ఒక దగ్గర రాసుకోండి.
7. రివిజన్ చేయండి. ఒకే విషయాన్ని పదే పదే చదివితే మరచిపోయే ప్రసక్త లేదు.
8. పాత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయండి. గత 5-10 ఏళ్ల ప్రశ్నపత్రాలను రాసి ప్రాక్టీస్ చేయండి. అకడమిక్ పరీక్షల్లో ఇవే దాదాపుగా రిపీట్ అవుతుంటాయి.
9. పరీక్షల్లో టైమ్ మేనేజ్‌మెంట్ ముఖ్యం. మాక్ టెస్ట్ రాయడం ద్వారా లోటుపాట్లను అధిగమించవచ్చు.

సబ్జెక్టుకు ఒక వ్యూహం

10. మేథ్స్ రోజూ ప్రాక్టీస్ చేయాలి. రోజుకు కనీసం 10-15 ముఖ్యమైన లెక్కలు సాల్వ్ చేయండి.
11. సైన్స్ విషయంలో ఫార్ములాలు, డయాగ్రామ్స్, ఈక్వేషన్స్, రియాక్షన్స్ ఒక దగ్గర రాసుకుని ప్రాక్టీసు చేయండి.
12. సోషల్ స్టడీస్‌లో డేట్స్, ఈవెంట్స్ ముఖ్యం. కథల మాదిరిగా చదివి అర్థం చేసుకోవడం ఉత్తమం.
13. ఇంగ్లిష్, తెలుగు సబ్జెక్టుల్లో వ్యాకరణం ప్రాక్టీస్ చేయండి. ముఖ్యమైన వ్యాకరణ నియమాలను రాసి చదవండి.
14. స్మార్ట్ స్టడీ మెథడ్స్ ఉపయోగించండి.

పరీక్ష రోజు

15. తక్కువ ఒత్తిడితో చదవండి. కొండను ఎత్తుకుంటున్నట్లుగా కాకుండా ఆసక్తిగా చదవండి.
16. ఒత్తిడిని తగ్గించుకోవడానికి రోజుకు 10 నిమిషాలు ధ్యానం, యోగా వంటివి చేయండి.
17. ఆకుకూరలు, పండ్లు, డ్రైఫ్రూట్స్ వంటి పోషకాహారాన్ని పెంచండి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ద్వారా మెదడు చురుకుగా ఉంటుంది.
18. పరీక్ష ముందు రోజు కొత్త విషయాలు చదవొద్దు. రివిజన్ మాత్రమే చేయాలి.
19. పరీక్ష రోజు ప్రశాంతంగా ఉండండి. సమయం కంటే ముందే హాల్‌కు చేరుకోండి. ఇతరులు ఎలా చదివారు, ఎంత చదివారు అనే విషయాలపై చర్చ వద్దు. ప్రశాంతంగా ప్రశ్నపత్రం చదివి సమాధానాలు రాయండి.

- డాక్టర్ పవన్‌కుమార్ కాసు

దిక్సూచి DIKSUCHI

సమాధానాలు రాసేప్పుడు



1. ప్రశ్నను పూర్తిగా చదవండి. తొందరలో తప్పుగా అర్థం చేసుకోవద్దు. ముఖ్యంగా 'ఎక్స్‌ప్లెయిన్, కంపేర్, డిస్క్రైబ్' వంటి పదాలు గమనించండి.
2. టైమ్ ప్లానింగ్ ముందే చేసుకోండి. చిన్న ప్రశ్నలకు తక్కువ సమయం, దీర్ఘ సమాధానాలకు ఎక్కువ సమయం పక్కాగా పాటించండి. బాగా వచ్చు కదా అని చిన్న ప్రశ్నకు ఎక్కువ సమయం తీసుకుని చివర్లో ఇబ్బంది పడొద్దు.
3. స్పష్టమైన, క్రమబద్ధమైన రాత ముఖ్యం. సమాధానాన్ని పాయింట్స్‌గా రాయండి. ఎక్కువ పేరాలు అన్నట్లు కాకుండా లాజికల్ ఫ్లోలో ఉండేలా చూసుకోండి.
4. ముఖ్యమైన పాయింట్లకు అండర్‌లైన్ చేయండి. ఆయా పదాలను హైలైట్ చేయడం వల్ల పరిశీలకుడు సమాధానం స్పష్టంగా చూడగలుగుతాడు.
5. తగిన డయాగ్రామ్స్ చార్ట్‌లు వాడండి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, జాగ్రఫీ వంటి సబ్జెక్టులకు సరైన పటాలు, డయాగ్రామ్స్ గీయండి.
6. తప్పులు తగ్గించేందుకు స్పష్టమైన భాష వాడండి. అపరిపక్వమైన పదజాలం, క్లిష్టమైన వ్యాకరణాన్ని ఉపయోగించ వద్దు.
7. లెక్కలు, సైన్స్‌ల్లో స్టెప్ బై స్టెప్ ఆన్సర్ రాయండి. నేరుగా సమాధానం రాయకుండా, ప్రతి స్టెప్ చూపించి రాయడం వల్ల పూర్తి మార్కులు వస్తాయి.
8. మినిమమ్, మాగ్జిమమ్ లిమిట్స్‌లో రాయండి. రెండు మార్కుల ప్రశ్నకు 10 లైన్లు రాయడం, 5 మార్కుల ప్రశ్నకు 3 లైన్లు రాయడం తప్పు. సరిపడే సమాచారం అందించండి.
9. చివర్లో సమాధానాలు చెక్ చేసుకోండి. తప్పులు సవరించుకునేందుకు చివరి 5-10 నిమిషాలు కేటాయించండి.
10. పేపర్‌ను క్లీన్‌గా ఉంచండి. అర్థం కాని రాత, ఎక్కువ సార్లు కొట్టివేతలు, స్క్రిబ్లింగ్ ఉండకుండా చూసుకోవాలి.

ఐఐఎమ్‌లు అందించే ఉచిత కోర్సులు ఇవే

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లు పలు విభాగాలకు సంబంధించిన ఉచిత కోర్సులను అందిస్తున్నాయి. ఈ కోర్సుల గురించి కేంద్రప్రభుత్వం నిర్వహించే 'స్వయం పోర్టల్' (https://swayam.gov.in/) ద్వారా తెలుసుకోవచ్చు.

బిజినెస్ కమ్యూనికేషన్ ఎసెన్షియల్స్: ఇది ఐఐఎం బెంగళూరు అందించే 6 వారాల కోర్సు. ఉద్యోగ, వ్యాపారాల్లోని సవాళ్లను ఎదుర్కొనేలా కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందిస్తారు. 2025 మే 18 నుంచి క్లాసులు మొదలవుతాయి. 2025 ఫిబ్రవరి 28 వరకు నమోదు కావచ్చు.

బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ మార్కెట్స్: రిస్క్ మేనేజ్‌మెంట్‌పై ఐఐఎం బెంగళూరు అందించే ఈ కోర్సు కాలవ్యవధి ఆరు వారాలు. ఎన్‌రోల్‌మెంట్ 2025 ఫిబ్రవరి 28 వరకు చేసుకోవచ్చు.

ఆర్గనైజేషనల్ బిహేవియర్ అడ్వాన్స్‌డ్ టాపిక్స్: ఐఐఎం షిల్లాంగ్ అందించే ఆరు వారాల కోర్సు ఇది. మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఉపయోగం.

స్ట్రాటజిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్: ఇది 8 వారాల కోర్సు. ఐఐఎం బెంగళూరు అందిస్తోంది.

వాల్యుయేషన్ అండ్ క్రియేటింగ్ సస్టయినబుల్ వాల్యూ: వాల్యుయేషన్ మెథడ్స్, ఎలా వాల్యుయేషన్ చేయాలో ఉదాహరణలతో సహా వివరిస్తారు. ఐఐఎం బెంగళూరు అందించే ఆరు వారాల కోర్సు ఇది. 2025 ఫిబ్రవరి 28 తేదీ వరకు ఎన్‌రోల్ చేసుకోవచ్చు.

డిజిటల్ మార్కెటింగ్: ఐఐఎం బెంగళూరు నిర్వహించే ఆరు వారాల కోర్సు ఇది. డిజిటల్ ఇన్‌బౌండ్, ఔట్‌బౌండ్ మార్కెటింగ్, లీవరేజింగ్ సోషల్ మీడియా, కస్టమర్ ఇన్‌సైట్స్ తదితరాలు నేర్పిస్తారు. 2025 ఫిబ్రవరి 28 తేదీలోపు నమోదు చేసుకోవాలి.

హెచ్‌ఆర్‌ఎం స్ట్రాటజీ ఎగ్జిక్యూషన్: ఐఐఎం అహ్మదాబాద్ నిర్వహిస్తున్న ఆరు వారాల కోర్సు. 2025 ఫిబ్రవరి 28 తేదీలోపు నమోదు చేసుకోవాలి.

డేటా డ్రైవెన్ మార్కెటింగ్ డెసిషన్ మేకింగ్: మార్కెటింగ్ విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ఐఐఎం విశాఖపట్నం డిజైన్ చేసిన 8 వారాల కోర్సు ఇది. కొనుగోళ్లను ప్రభావితం చేసే అంశాలను బోధిస్తారు.

ఫైనాన్షియల్ అకౌంటింగ్ అండ్ అనాలిసిస్: ఐఐఎం బెంగళూరు డిజైన్ చేసిన కోర్సు. ఫైనాన్షియల్ కాన్సెప్ట్స్, ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్, అకౌంటింగ్ స్టాండెడ్స్ తదితరాలు ఇందులో ఉంటాయి.

జనరేటివ్ ఏఐ, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్: ఐఐఎం బెంగళూరు అందించే 8 వారాల కోర్సు. 2025 ఫిబ్రవరి 28 తేదీలోపు నమోదు చేసుకోవాలి.

SCHOLARSHIP ALERT

Ramalingaswami Re-entry

Description: Ramalingaswami Re-entry Fellowship 2024-25 is offered by the Department of Biotechnology, Ministry of Science & Technology, Government of India, to students with relevant PhD/MD degrees or equivalent.
Eligibility: This is open to Indians below 45 years on the application closing date. Applicants must hold a PhD/MD/M.Tech or equivalent degree in specified fields.
Prizes & Rewards: A fellowship of 1,35,000 per month and other benefits. *Last Date:* 28-02-2025
Url: www.b4s.in/aj/RFIB2

Quad Fellowship

Description: It is initiated by the governments of Australia, India, Japan, and the US, is administered by the Institute of International Education (IIE).
Eligibility: Open to citizens or legal permanent residents of specific countries including India. Applicants must be at least 18 years of age at the time of application submission and possess a bachelor's degree
Prizes & Rewards: The fellowship offers a one-time stipend of $40,000 and other benefits.
Last Date: 03-03-2025
Url: ww.b4s.in/aj/QUFD1

buddy4study.com

ఆంత్రప్రెన్యూర్ కావడానికీ కోర్సులు ఉన్నాయి

ఉద్యోగాలు చేయడం కాదు, ఉద్యోగాలు ఇచ్చేస్థాయికి ఎదగాలి. 'ఆంత్రప్రెన్యూర్‌షిప్' కరిక్యులమ్‌లో భాగమైతేనే ఇది సాధ్యం. దేశవ్యాప్తంగా విద్యార్థులు, ప్రొఫెషనల్స్‌లో ఆంత్రప్రెన్యూర్ మైండ్‌సెట్ అభివృద్ధి అవుతుందనే ఆలోచనతో హైదరాబాద్ ఐఐటీ 'ఇన్నోవేషన్, ఆంత్రప్రెన్యూర్‌షిప్' స్కూల్‌ను ప్రారంభించింది. అదే బీవీఆర్ సైయెంట్ (బీవీఆర్ స్కూల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్). భారతదేశంలో ఆంత్రప్రెన్యూర్‌షిప్‌పై ప్రత్యేక స్కూల్ ఇది ఒక్కటే. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సంఖ్యను పెంచడం, అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడం, అవసరమైన వాతావరణాన్ని ఏర్పడరచడం లక్ష్యాలుగా 2024 జనవరిలో దీనిని ఏర్పాటు చేశారు.

ఇక్కడ ఫార్మల్ డిగ్రీలు కాకుండా ఇన్నోవేషన్, ఆంత్రప్రెన్యూర్‌షిప్‌పై షార్ట్‌టర్మ్ కోర్సులు అందిస్తారు. వీటికి సంబంధించి ఇంజనీరింగ్ వంటి కాలేజీలకు, కార్పొరేట్ సంస్థలకు వెళ్లి అవగాహన కల్పిస్తారు. ఆలోచనలు అవకాశాలుగా, బిజినెస్‌గా ఎలా మలచాలో ఇండస్ట్రీకి చెందిన ప్రముఖులు, ఐఐటీ ఫ్యాకల్టీలు ఇక్కడ శిక్షణ ఇస్తారు. దీనితోపాటు టీహబ్, ఇతర ఇన్నోవేషన్ సెంటర్లతో కలిసి వర్క్ చేస్తున్నారు.

కోర్సులు: ప్రస్తుతం బీవీఆర్ సైయెంట్ కొన్ని కోర్సులను ఆఫర్ చేస్తోంది. 'ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ ఇన్ డిజిటల్ ఎరా' కోర్సు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. త్వరలో 'డిజిటల్ ఆంటర్ ప్రైజెస్', 'ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ ఫర్ ఆంత్రప్రెన్యూర్స్' తదితర కోర్సులు నిర్వహించనున్నారు. వీటికి సంబంధించిన పూర్తి వివరాల కోసం బీవీఆర్ సైయెంట్ వెబ్‌సైట్ చూడవచ్చు.



Address: BVR SCIENT, IIT- Kandi, Sangareddy, Telangana– 502284**Mobile:** +91 9160006190, https://bvrscient.iith.ac.in/

చిత్రజ్యోతి SINCE 1965

కర్మఫలం నేపథ్యంలో..



అను ఇమ్మాన్యుయేల్, శివ కందుకూరి ప్రధాన పాత్రల్లో ఆండ్రూ బాబు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'బూమరాంగ్'. లండన్ గణేశ్, డాక్టర్ ప్రవీణ్ రెడ్డి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలోని 'గ్లింప్స్'ని చిత్ర బృందం లాంచ్ చేసింది. ఈ సందర్భంగా శివ కందుకూరి మాట్లాడుతూ 'ఈ సినిమాలో ఒక డార్క్ సైడ్ ఉంది. కచ్చితంగా ఇది డిఫరెంట్ మూవీ అవుతుంది' అని చెప్పారు. చిత్ర దర్శకుడు ఆండ్రూ బాబు మాట్లాడుతూ 'కరోనా సమయంలో చాలా కథలు రాశాను. అందులోంచి ఎంపిక చేసిన మొదటి కథ 'బూమరాంగ్'. ఇది మెసేజ్ ఓరియెంటెడ్ సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రం' అని తెలిపారు. నిర్మాత ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ 'అవుట్ పుట్ అద్భుతంగా వచ్చింది. మీ అందరి సపోర్ట్ కావాలి' అని కోరారు. సవాలు విసిరే కథ ఇది. శివ కందుకూరి మంచి నటుడు. భిన్నమైన కథలు చేస్తున్నారు' అని ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ కె.ఎల్. దామోదర ప్రసాద్ అన్నారు.

శబ్దం ఒక అద్భుతం



నాని

"హారర్ సినిమా చూసినా కళ్లు చెమ్మగిల్లుతాయని నేను ఎప్పుడూ అనుకోలేదు. మంచి కథతో పాటు భావోద్వేగాలు ఉన్న చిత్రం 'శబ్దం'. ఈ సినిమా నేను చూశాను. అద్భుతంగా ఉంది" అని నాని అన్నారు. ఆది పినిశెట్టి కథానాయకుడిగా, అరివళగన్ దర్శకత్వంలో శివ నిర్మించిన చిత్రమిది. సిమ్రాన్ లైలా, లక్ష్మీ మీనన్ కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా యూనిట్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన నాని మాట్లాడుతూ 'ఉపయోగించుకోవాలే కానీ సౌండ్ కూడా ఒక ఆయుధం అవుతుందనే అంశాన్ని 'శబ్దం' చిత్రంలో అద్భుతంగా చూపారు' అని ప్రశంసించారు. ఆది పినిశెట్టి మాట్లాడుతూ 'వైశాలి నా కెరీర్‌లో స్పెషల్ మూవీ. ఇప్పుడు శబ్దం కూడా నాకు స్పెషల్ మూవీ అవ్వాలని కోరుకుంటున్నాను' అన్నారు. తమన్ తన సంగీతంతో సినిమాకు ప్రాణం పోశాడని అరివళగన్ చెప్పారు.



అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది

సందీప్ కిషన్

సందీప్ కిషన్, రీతూ వర్మ, అన్షు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మజాకా'. త్రినాథ రావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా, ఉమేశ్ కెఆర్ బన్సల్ నిర్మించారు. ఈనెల 26న విడుదలవుతోంది. తాజాగా ఈ చిత్రం ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ 'నా కెరీర్‌లో హయ్యస్ట్ నెంబర్స్‌ని ఈ సినిమా ఇస్తుంది. థియేటర్‌లో కుటుంబసమేతంగా చూసే చిత్రమిది. రావు రమేశ్ అద్భుతంగా నటించారు. ఆయన వల్ల కథ మరింత పండింది' అని చెప్పారు. చిత్ర దర్శకుడు త్రినాథరావు మాట్లాడుతూ 'నేను ప్రతి సీన్‌లో మ్యాజిక్ ఉండాలని నమ్ముతాను. నా ప్రతి సినిమాలో కూడా మ్యాజిక్ జరుగుతుంది. ఇందులో కూడా ఓ మ్యాజిక్ ఉంది. శివరాత్రి నాడు డబుల్ మ్యాజిక్ జరుగుతుంది. డబుల్ బ్లాక్ బస్టర్ అవుతుంది' అని తెలిపారు. రావు రమేశ్ మాట్లాడుతూ 'ఇలాంటి సినిమా చేయడం నాకు కొత్తే. ఇందులో రొమాంటిక్‌గా నటించడం చాలా సవాల్‌గా అనిపించింది. ఒక ఎమోషనల్ సీన్ ఉంది. అది ఐకానిక్‌గా నిలిచిపోతుంది' అని అన్నారు. హీరోయిన్ రీతూ వర్మ మాట్లాడుతూ 'ఈ సినిమాని ప్రేక్షకులు తప్పకుండా ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు. నిర్మాత రాజేశ్ దండా మాట్లాడుతూ' ప్రతి ఒక్కరికీ ఈ సినిమా నచ్చుతుంది. రీతు వర్మ డ్యాన్స్ అదరగొట్టింది' అని అన్నారు.

మాఫియాతో పోలీస్ పోరాటం



సంఘ విద్రోహ శక్తుల ఆటకట్టించే పోలీసాఫీసర్ కథతో తెరకెక్కుతోన్న చిత్రం 'విద్రోహి'. రవిప్రకాశ్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. వీఎస్‌వీ దర్శకత్వంలో వీ వెంకట సుబ్రహ్మణ్యం, పీ కనకదుర్గారావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను నటుడు శ్రీకాంత్ చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. రవి ప్రకాశ్ మాట్లాడుతూ 'ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్. కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను థ్రిల్ చేస్తాయి. దర్శకుడిగా వీఎస్‌వీకి పేరు తెస్తుంది' అన్నారు. ఒక తెలివైన పోలీసు మాఫియాను మట్టుబెట్టిన తీరు ప్రేక్షకులను అలరిస్తుందని నిర్మాతలు చెప్పారు. సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సినిమాటోగ్రఫీ: సతీశ్ ముత్యాల.



పాక్ పనిబట్టారు

మనదే పైచేయి

పాకిస్థాన్‌ను చిత్తుచేసిన టీమిండియా ఐసీసీ టోర్నమెంట్లలో ఆ జట్టుపై ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది. ఇప్పటిదాకా ఐసీసీ ఈవెంట్లలో (టీ20 ప్రపంచకప్, వన్డే ప్రపంచకప్, చాంపియన్స్ ట్రోఫీ) ఇరుజట్లు 22 సార్లు తలపడితే, భారత్ ఏకంగా 18 విజయాలతో పైచేయి సాధించింది. చాంపియన్స్ ట్రోఫీలో మూడుసార్లు (2004, 2009, 2017లో), టీ20 ప్రపంచకప్ (2021)లో ఓసారి భారత్‌పై పాక్ గెలిచింది.


రిజ్వాన్

కోట్లాదిమంది భారతీయులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూసిన మ్యాచ్ ఆశించిన రీతిలోనే ముగిసింది. బలాబలాల విషయంలో సమవుజ్జీ కాకపోయినా అనిశ్చితి ఆటకు మారుపేరు పాకిస్థాన్. అందుకే ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో? అనే సందేహం అందరిలోనూ నెలకొంది. కానీ ఛేజింగ్‌లో రారాజు 'కింగ్' కోహ్లీ ఎక్కడ, ఎవరితో ఆడాలో అక్కడే కదం తొక్కాడు. ప్రత్యర్థి పాక్ అయినప్పుడు విరాటుడి విశ్వరూపం ఎలా ఉంటుందో మరోసారి కళ్లముందుంచాడు. చివరికంటా నిలిచి అజేయ శతకంతో మురిపించాడు. అతడికి శ్రేయాస్, గిల్ కూడా జత కలవడంతో ఛేదన సులువైంది. అటు వరుసగా రెండో ఓటమితో ఆతిథ్య పాక్ తమ సెమీస్ ఆశలపై ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సిందే. మరోవైపు భారత్ నాకౌట్ బెర్తు దాదాపు ఖరారైనట్టే.

శ్రేయాస్ అర్ధసెంచరీ • చాంపియన్స్ ట్రోఫీ

కోహ్లీ 51వ వన్డే శతకం

భారత్ సూపర్ విక్టరీ


విరాట్ కోహ్లీ (100 నాటౌట్)

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

సమకాలీన క్రికెట్‌లో తిరుగులేని బ్యాటర్ విరాట్ కోహ్లీ. మొత్తం 547 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన అనుభవం అతడి సొంతం. మూడు ఫార్మాట్లలో కలిపి 27వేలకు పైగా పరుగులు. ఎన్నో రికార్డులతో 16 సంవత్సరాలుగా తనదైన ముద్ర. కానీ ఇటీవలి కాలంలో ఫామ్ కోల్పోయిన విరాట్ ఇంటా..బయటా..తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నాడు. దశాబ్దంన్నరకుపైగా అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్న ఆటగాడు ఇంత సుదీర్ఘకాలం ఫామ్ లేమితో సతమతం కావడమా? ఎప్పటికి బయటపడతాడు ఆ తడ'బ్యాటు' నుంచి? ఎంత

ఆ విరాటుడు సాక్షాత్కరించాడు!

కాలం అతడికి ఇంకా జట్టులో చోటు ? అని తీవ్రంగా ప్రశ్నించిన వారూ లేకపోలేదు. అయితే బోర్డర్-గవాస్కర్ సిరీస్ తొలి టెస్ట్‌లో సెంచరీతో విరాట్ ఆట మళ్లీ గాడిలో పడినట్టేనని అతడి అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ తర్వాత నాలుగు టెస్ట్‌లలో అతడు నిరాశ పరిచాడు. చాంపియన్స్ ట్రోఫీకి ముందు ఇంగ్లండ్‌తో సిరీస్‌లో ఆఖరి వన్డేలో హాఫ్ సెంచరీతో కోహ్లీ మళ్లీ టచ్‌లోకి వచ్చాడు. ఇక..ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో విరాట్ విఫలమయ్యాడు. దాంతో టోర్నీలో అతి కీలకమైన పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో కోహ్లీ ఎలా ఆడతాడోననే ఆందోళన వ్యక్తమైంది. అయితే చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై మ్యాచ్ అంటే కోహ్లీ రెచ్చిపోతాడు. 2022 టీ20 వరల్డ్ కప్ మెల్‌బోర్న్ మ్యాచ్‌లో తన అద్భుత బ్యాటింగ్‌ను గుర్తు చేస్తూ..చాంపియన్స్ ట్రోఫీ పోరులో విరాట్ చెలరేగాడు. క్రీజులో కుదురుకొనే వరకు బ్యాక్‌ఫుట్ గేమ్ ఆడిన కోహ్లీ ఆపై క్రీజు బయటకు వచ్చి సంధించిన షాట్లు అదరహో అనిపించాయి. హారిస్ రౌఫ్ బౌలింగ్‌లో కవర్స్ దిశగా అతడు కొట్టిన బౌండరీ చూసి తీరాల్సిందే. చాన్నాళ్ల తర్వాత తన ట్రేడ్‌మార్క్ షాట్లతో ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగించాడు. ఓర్పు, నేర్పు ఇన్నింగ్స్‌తో టీమిండియా విజయంలో మరోసారి కీలక భూమిక పోషించాడు. అజేయ సెంచరీతో తనలో ఇంకా సత్తా ఉందని నిరూపించాడు. ఇక విరాట్ ఒక్కో షాట్ కొడుతుంటే కెప్టెన్ రోహిత్ శర్మలో కలిగిన ఆనందం అంతా ఇంతాకాదు. అతడి ఒక్కో షాట్‌కు చప్పట్లు చరిచి కోహ్లీలో ఉత్సాహం నింపాడు. చివరగా విరాట్ సెంచరీ మార్క్ చేరగానే రోహిత్ సంతోషం రెండింతలైంది.

బాబర్‌కు పాండ్యా బై..బై


పాక్ బ్యాటర్ బాబర్ ఆజమ్ మరోసారి ఆశించిన స్థాయిలో ఆడడంలో విఫలమయ్యాడు. ఐదు బౌండ్రీలతో భారీ ఇన్నింగ్స్ ఆడేలా కనిపించాడు. అయితే, 8వ ఓవర్‌లో హార్దిక్ పాండ్యా బౌలింగ్‌లో తొలి బంతిని బౌండ్రీగా మలిచిన బాబర్.. ఆ తర్వాతి బంతికి భారీ షాట్ ఆడే క్రమంలో రాహుల్‌కు క్యాచిచ్చాడు. జట్టుకు బ్రేక్ అందించిన పాండ్యా.. బై.. బై అన్నట్టుగా చేతితో చూపిస్తూ సంబరాలు చేసుకోవడం వాతావరణాన్ని వేడెక్కించింది. నెట్‌లో ఈ వీడియో వైరల్‌గా మారింది.



6

అంతర్జాతీయ క్రికెట్‌లో 4వేల పరుగులు, 200 వికెట్లు పడగొట్టిన ఆరో భారత క్రికెటర్‌గా హార్దిక్ పాండ్యా. గతంలోనే 4 వేల మార్క్ చేరిన హార్దిక్.. బాబర్, షకీల్‌ను అవుట్ చేసి 200 వికెట్ల క్లబ్‌లో చేరాడు. సచిన్, కపిల్, రవిశాస్త్రి, జడేజా, అశ్విన్‌లు పాండ్యా కంటే ముందున్నారు.

స్టాండ్స్‌లో హార్దిక్ గాళ్‌ఫ్రెండ్?



హార్దిక్ పాండ్యా గాళ్‌ఫ్రెండ్‌గా సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తున్న జాస్మిన్ వాలియా స్టాండ్స్‌లో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచింది. అక్షర్ పటేల్ భార్య పక్కన కూర్చొని జాస్మిన్ మ్యాచ్‌ను వీక్షించడం.. ఊహాగానాలకు బలం చేకూర్చుతోంది. ఇక, హార్దిక్ ధరించిన వాచ్ కూడా అభిమానులను ఎంతో ఆకర్షించింది. దీంతో దాని గురించి నెట్‌లో తెగవెతికేసిన ఫ్యాన్స్.. దానిని రిచర్డ్ మిల్లే కంపెనీకి చెందిన లగ్జరీ వాచ్‌గా తేల్చారు. దీని ధర రూ. 15 కోట్లు ఉంటుందని చెబుతున్నారు.

షమి.. చెత్త రికార్డు



షమి ఓ చెత్త రికార్డును మూటగట్టుకొన్నాడు. చాంపియన్స్ ట్రోఫీలో సుదీర్ఘమైన ఓవర్ వేసిన మూడో బౌలర్‌గా నిలిచాడు. తొలి ఓవర్ బౌల్ చేసిన షమి.. మొత్తం 11 బంతులు వేయాల్సి వచ్చింది. ఐదు వైడ్లు వేసి ఆరు పరుగులిచ్చాడు. కాగా, 2000లో బంగ్లా బౌలర్ హసిబుల్ హుస్సేన్, 2004 టోర్నీలో జింబాబ్వే ఆటగాడు టినాషి పన్యాంగర ఓ ఓవర్‌లో 13 బంతులు వేసి చెత్త రికార్డును మూటగట్టుకొన్నారు. సుదీర్ఘ ఓవర్ వేసిన తొలి భారత బౌలర్‌గా షమి నిలిచాడు. 2017 ఫైనల్లో బుమ్రా 9 బంతుల పేలవ రికార్డును షమి మరుగునపడేలా చేశాడు. కాగా, షమికి గాయం తిరగబెట్టిందా? అనే అనుమానం కలుగుతోంది. 5వ ఓవర్ బౌల్ చేస్తున్నప్పుడు అతడి కుడి కాలి చీలమండలో సమస్య తలెత్తింది. ఫిజియో వచ్చి ట్రీట్‌మెంట్ ఇచ్చిన తర్వాత.. ఆ ఓవర్ పూర్తి చేసి మైదానం వీడాడు. అయితే, మళ్లీ 12వ ఓవర్‌లో షమి బౌలింగ్‌కు దిగాడు. కానీ, కీలక మ్యాచ్‌లో మాత్రం అతడి రనప్ ఇబ్బందిగానే కనిపించింది.

కుల్దీప్ @ 300



అన్ని ఫార్మాట్లలో కలిపి 300 వికెట్ల మైలురాయిని చేరిన ఐదో భారత స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్. ఓవరాల్‌గా ఈ ఘనత సాధించిన 13వ భారత బౌలర్. సల్మాన్ అఘాను అవుట్ చేయడం ద్వారా కుల్దీప్ ఈ ఫీట్ సాధించాడు.

1

వన్డేల్లో అత్యధికంగా 158 క్యాచ్‌లు అందుకొన్న భారత ఆటగాడిగా కోహ్లీ. అజరుద్దీన్ 156 క్యాచ్‌ల రికార్డును విరాట్ అధిగమించాడు. ఓవరాల్‌గా మహేల జయవర్ధనె (218 క్యాచ్‌లు), రికీ పాంటింగ్ (160) కోహ్లీ కంటే ముందున్నారు.

3

వన్డేల్లో వేగంగా 14 వేల పరుగుల మైలురాయిని చేరిన బ్యాటర్‌గా, ఓవరాల్‌గా మూడో ఆటగాడిగా కోహ్లీ (287 ఇన్నింగ్స్) రికార్డులకెక్కాడు. కాగా, 50 ఓవర్ల ఫార్మాట్‌లో సచిన్ టెండూల్కర్ (18,246 పరుగులు) 350 ఇన్నింగ్స్‌లో, శ్రీలంక దిగ్గజం కుమార సంగక్కర (14,243 పరుగులు) 378 ఇన్నింగ్స్‌లో 14 వేల పరుగులు చేశారు.

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీకి తలమానికంగా నిలిచిన భారత్-పాకిస్థాన్ మ్యాచ్ ఏకపక్షంగా ముగిసింది. అటు బౌలింగ్.. ఇటు బ్యాటింగ్‌లోనూ అదరగొట్టిన టీమిండియా వరుసగా రెండో విజయం అందుకుంది. ఆదివారం పాక్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ (111 బంతుల్లో 7 ఫోర్లతో 100 నాటౌట్) అజేయ శతకం సాధించగా, మరో 45 బంతులుండగానే భారత్ ఆరు వికెట్ల తేడాతో నెగ్గింది. తద్వారా 2017 సీటీ ఫైనల్లో ఎదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకున్నట్టయ్యింది. గ్రూప్ 'ఎ'లో నాలుగు పాయింట్లతో భారత్ దాదాపు సెమీస్ బెర్త్‌ను ఖాయం చేసుకోగా, ఆఖరి మ్యాచ్ మార్చి 2న కివీస్‌తో తలపడుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ 49.4 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. సౌద్ షకీల్ (62), రిజ్వాన్ (46), ఖుష్‌దిల్ (38) కీలక ఇన్నింగ్స్ ఆడారు. స్పిన్నర్ కుల్దీప్‌నకు మూడు, హార్దిక్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 42.3 ఓవర్లలో 4 వికెట్లకు 244 పరుగులు చేసి గెలిచింది. శ్రేయాస్ (56), గిల్ (46) సహకరించారు. విరాట్ శతకంలో 72 పరుగులు సింగిల్స్, డబుల్స్ రూపంలో రావడం అతడి ఫిట్‌నెస్ స్థాయిని తెలుపుతుంది. షహీన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా విరాట్ కోహ్లీ నిలిచాడు.

సమష్టి రాణింపుతో..: ఓ మాదిరి ఛేదనలో భారత్‌ను పాక్ బౌలర్లు పెద్దగా ఇబ్బంది పెట్టలేకపోయారు. దీనికితోడు వారి పేలవ ఫీల్డింగ్ కూడా తోడైంది. అటు విరాట్ సెంచరీ, శ్రేయాస్ హాఫ్ సెంచరీ, గిల్ సమన్వయ ఆటతీరుతో జట్టు సునాయాసంగా నెగ్గింది. ఆరంభంలో పేసర్ షహీన్ సూపర్ యార్కర్లతో కట్టడి చేసే ప్రయత్నం చేశాడు. కానీ రోహిత్ (20) రెండో ఓవర్‌లో 4,6తో ఎదురుదాడికి దిగాడు. అటు గిల్ మూడో ఓవర్‌లో రెండు ఫోర్లతో ఆకట్టుకున్నాడు. దీంతో ఒత్తిడిని తగ్గించారు. చివరకు షహీన్ ఇన్‌స్వింగ్ యార్కర్‌కు రోహిత్ క్లీన్‌బౌల్డ్‌గా వెనుదిరిగాడు. అయితే ఈ సంతోషాన్ని గిల్-విరాట్ వమ్ము చేశారు. షహీన్ వేసిన ఇన్నింగ్స్ ఏడో ఓవర్‌లో గిల్ మూడు ఫోర్లతో 14 రన్స్ రాబట్టి అతడి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాడు. పిచ్‌ను అర్థం చేసుకుంటూ ఎక్కువగా సింగిల్స్‌పై దృష్టి సారిస్తూ వీరు స్కోరును ముందుకు నడిపారు. అయితే వరుసగా ఐదో 50+ స్కోరు ఖాయమనిపించిన వేళ గిల్‌ను స్పిన్నర్ అబ్రార్ బౌల్డ్ చేశాడు. దీంతో రెండో వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత విరాట్‌కు జతగా శ్రేయాస్ కలవడంతో పాక్ బౌలర్ల కష్టాలు రెట్టింపయ్యాయి. అటు బంతి కూడా చక్కగా బ్యాట్ మీదకు రావడంతో ఈ జోడీ ఆడుతూ పాడుతూ బ్యాటింగ్ సాగించింది. ఈ క్రమంలో ఇద్దరూ హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకోగా, అటు 36వ ఓవర్‌లోనే స్కోరు 200కి చేరింది. అయితే విజయానికి మరో 28 పరుగుల దూరంలో శ్రేయాస్ కవర్స్‌లో ఇచ్చిన క్యాచ్‌ను ఇమామ్ గాల్లోకి డైవ్ చేస్తూ పట్టేశాడు. తర్వాతి ఓవర్‌లోనే హార్దిక్ (8) కూడా వెనుదిరిగాడు. ఈ దశలో విరాట్ శతకానికి, జట్టు విజయానికి సమాన పరుగులు అవసరపడడంతో అభిమానుల్లో కాస్త ఉత్కంఠ నెలకొంది. కానీ 43వ ఓవర్‌లో ఓ చక్కటి ఫోర్‌తో ఆ రెండింటినీ పూర్తి చేసి అందరినీ సంబరాల్లో ముంచెత్తాడు.

ఆదుకున్న షకీల్-రిజ్వాన్: టాస్ గెలిచిన వెంటనే పాక్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. ఇక్కడి పిచ్ ఛేజింగ్‌కు కష్టమనే భావనలో ఈ నిర్ణయం తీసుకోగా.. భారత బౌలర్లు అంత సులువుగా పరుగులేమీ ఇవ్వలేదు. బంతి బ్యాట్ మీదకు రాకపోవడంతో పాక్ బ్యాటర్లు ఇబ్బందిపడ్డారు. అయితే సౌద్ షకీల్ అర్ధసెంచరీ, కెప్టెన్ రిజ్వాన్ సంయమన ఆటతీరుతో పాటు చివర్లో ఖుష్‌దిల్ వేగంతో జట్టు స్కోరు ఫర్వాలేదనిపించింది. షమి ఏకంగా ఐదు వైడ్లతో ఓవర్‌ను ఆరంభించడం గమనార్హం. ఇక ఓపెనర్ బాబర్ ఆజమ్ (23) క్రీజులో ఉన్నంత సేపు చక్కటి షాట్లతో ఆకట్టుకున్నాడు. ఐదు ఫోర్లతో జోరు మీదున్న అతడి నుంచి భారీ ఇన్నింగ్స్ వస్తుందనిపించినా హార్దిక్‌కు చిక్కాడు. ఆ వెంటనే మరో ఓపెనర్ ఇమామ్ (10)ను అక్షర్ కళ్లుచెదిరే రీతిలో రనౌట్ చేయడంతో పవర్‌ప్లేలో పాక్ రెండు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో జట్టుపై ఒత్తిడి పడనీయకుండా కెప్టెన్ రిజ్వాన్, సౌద్ షకీల్ మాత్రం పట్టుదలగా ఆడారు. మధ్య ఓవర్లలో పిచ్ నెమ్మదించడంతో పరుగులు కష్టమయ్యాయి. ముఖ్యంగా స్పిన్నర్ కుల్దీప్ ఇబ్బందిపెట్టాడు. వికెట్‌ను కాపాడుకునే క్రమంలో రిజ్వాన్-షకీల్ జోడీ కూడా ఎలాంటి దూకుడు ప్రదర్శించలేదు. దీంతో 55 బంతులపాటు కనీసం ఫోర్ కూడా నమోదుకాలేదు. కానీ ఓపికతో ఆడిన ఈ ఇద్దరూ స్కోరును 34వ ఓవర్‌లో 150 దాటించారు. ఇక 24 ఓవర్లపాటు క్రీజులో నిలిచి భారత్‌ను విసిగించిన జోడీకి 34వ ఓవర్‌లో బ్రేక్ పడింది. రిజ్వాన్‌ను అక్షర్ బౌల్డ్ చేయడంతో మూడో వికెట్‌కు 104 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. ఈ వికెట్‌తో పాక్ బ్యాటింగ్ ఆర్డర్ కూడా చెల్లాచెదురైంది. హాఫ్ సెంచరీతో జోరు మీదున్న షకీల్‌ను తర్వాతి ఓవర్‌లో హార్దిక్ దెబ్బతీశాడు. ఆ తర్వాత కుల్దీప్ ఒకే ఓవర్‌లో రెండు వికెట్లతో పాక్‌ను మరింత ఒత్తిడిలోకి నెట్టాడు. చివర్లో ఖుష్‌దిల్ మాత్రం బంతికో పరుగు చొప్పున సాధించాడు. తమ ఇన్నింగ్స్‌లో తొలి సిక్సర్‌ను 42వ ఓవర్‌లో అతడే సాధించాడు. ఆఖరి ఓవర్‌లో ఖుష్‌దిల్ వికెట్‌ను రాణా తీయడంతో పాక్ ఆట ముగిసింది.


శ్రేయాస్ (56)

5

ఐసీసీ టోర్నమెంట్లలో పాకిస్థాన్‌పై ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకోవడం కోహ్లీకిది ఐదోసారి.

12

వన్డేల్లో వరుసగా 12సార్లు టాస్ నెగ్గని జట్టుగా భారత్ సరికొత్త రికార్డునెలకొల్పింది. చివరిసారిగా 2023 వరల్డ్‌కప్ సెమీస్‌లో న్యూజిలాండ్‌పై టీమిండియా టాస్ గెలిచింది. 2011-13 మధ్య నెదర్లాండ్స్ వరుసగా 11సార్లు టాస్‌లు ఓడింది.

స్కోరుబోర్డు

పాకిస్థాన్: ఇమామ్ ఉల్ హక్ (రనౌట్) 10; బాబర్ (సి) రాహుల్ (బి) హార్దిక్ 23; సౌద్ షకీల్ (సి) అక్షర్ (బి) హార్దిక్ 62; రిజ్వాన్ (బి) అక్షర్ 46; సల్మాన్ ఆఘా (సి) జడేజా (బి) కుల్దీప్ 19; తయ్యాబ్ (బి) జడేజా 4; ఖుష్‌దిల్ (సి) విరాట్ (బి) హర్షిత్ 38; షహీన్ (ఎల్బీ) కుల్దీప్ 0; నసీమ్ (సి) విరాట్ (బి) కుల్దీప్ 14; రౌఫ్ (రనౌట్) 8; అబ్రార్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 17; మొత్తం: 49.4 ఓవర్లలో 241 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-41, 2-47, 3-151, 4-159, 5-165, 6-200, 7-200, 8-222, 9-241, 10-241. **బౌలింగ్:** షమి 8-0-43-0; హర్షిత్ 7.4-0-30-1; హార్దిక్ 8-0-31-2; అక్షర్ 10-0-49-1; కుల్దీప్ 9-0-40-3; జడేజా 7-0-40-1.

భారత్: రోహిత్ (బి) షహీన్ 20; గిల్ (బి) అబ్రార్ 46; విరాట్ (నాటౌట్) 100; శ్రేయాస్ (సి) ఇమామ్ (బి) ఖుష్‌దిల్ 56; హార్దిక్ (సి) రిజ్వాన్ (బి) షహీన్ 8; అక్షర్ (నాటౌట్) 3; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 42.3 ఓవర్లలో 244/4. వికెట్ల పతనం:** 1-31, 2-100, 3-214, 4-223. **బౌలింగ్:** షహీన్ 8-0-74-2; నసీమ్ 8-0-37-0; రౌఫ్ 7-0-52-0; అబ్రార్ 10-0-28-1; ఖుష్‌దిల్ 7.3-0-43-1; సల్మాన్ 2-0-10-0.


ఇమాముల్ రనౌట్

కుటుంబమంతా ఇంతేనా?

ఓపెనర్ ఇమాముల్ హక్ రనౌట్ మరోసారి అతడి మామ ఇంజమాముల్ హక్‌ను గుర్తు చేసింది. 26 బంతులాడి క్రీజులో నిలదొక్కుకొనే ప్రయత్నం చేస్తున్న ఇమాముల్.. కుల్దీప్ బౌలింగ్‌లో సింగిల్ దొంగిలించే ప్రయత్నం చేశాడు. అయితే, మెరుపు వేగంతో బంతిని అందుకొన్న అక్షర్ డైరెక్ట్ త్రోతో రనౌట్ చేశాడు. హక్ డైవ్‌చేసినా.. క్రీజులోకి చేరుకోలేక పోయాడు. దీంతో కామెంటేటర్ రవిశాస్త్రి.. పాత విషయాలను గుర్తు చేసే విధంగా సరదాగా స్పందించాడు. 'ఇది కుటుంబంలోనే ఉందా?' అని పక్కనున్న అక్రమ్‌ను అడిగాడు. దీంతో అక్రమ్ చిరునవ్వు నవ్వి ఊరుకొన్నాడు. 90వ దశకంలో ఇంజమామ్ డేంజరస్ హిట్టర్ అయినా.. వికెట్ల మధ్య పరుగెత్తడం మాత్రం ఘోరంగా ఉండేది. తన కెరీర్‌లో 40సార్లు అతడు రనౌట్ అయ్యాడు. ఇప్పుడు ఇమామ్ కూడా అతడి అడుగుజాడల్లోనే నడుస్తున్నాడా? అనే విధంగా మీమ్స్ నెట్‌లో కనిపిస్తున్నాయి.

అఫ్రీది స్వార్థం..

అవుటైనట్టు స్పష్టంగా తెలుస్తున్నా.. కీలక రివ్యూను వ్యర్థం చేశాడని షహీన్ షా అఫ్రీదిపై అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 43వ ఓవర్‌లో కుల్దీప్ బౌలింగ్‌లో అఫ్రీది వికెట్ల ముందు దొరికిపోయాడు. భారత ఆటగాళ్లు అప్పీలు చేయడంతో.. అంపైర్ మరో ఆలోచన లేకుండా అవుటిచ్చాడు. అయినా, అఫ్రీది ఏ మాత్రం ఆలోచించకుండా రక్కున రివ్యూకు వెళ్లాడు.

ట్రాఫిక్ జామ్‌లో భారత్..

ట్రాఫిక్ ఇబ్బందుల కారణంగా టాస్‌కు కేవలం 35 నిమిషాల ముందు టీమిండియా స్టేడియానికి చేరుకొందట. భారత్, పాక్ జట్లు బస్సుల్లో వేదికకు బయల్దేరిన సమయంలో భారీ జన సందోహం కారణంగా ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. పాక్ బస్సు ఎలాగోలా ముందుగానే వేదిక వద్దకు చేరుకొన్నా.. రోహిత్ సేన మాత్రం ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని ఛేదించుకొని వచ్చే సరికి బాగా ఆలస్యమైంది.



ధోనీ టీవీలో..



హైవోల్టేజ్ మ్యాచ్‌ను ధోనీ లైవ్‌లో వీక్షించాడు. యాడ్ షూటింగ్‌లో ఉన్న మహీ ఇందుకోసం బ్రేక్ తీసుకొన్నాడు. బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ కూడా ధోనీ పక్కనే ఉన్నాడు. కాగా, చిరంజీవి, క్రికెటర్లు తిలక్ వర్మ, అభిషేక్ శర్మ స్టాండ్స్‌లో కనిపించి సందడి చేశాడు.



బుమ్రాకు ఐసీసీ అవార్డుల ప్రదానం

దుబాయ్: భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా గత ఏడాదికి ఐసీసీ ప్రకటించిన అవార్డులను అందుకున్నాడు. భారత్-పాకిస్థాన్ జట్ల మధ్య ఆదివారం జరిగిన చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్ ప్రారంభానికి ముందు ఐసీసీ ఈ అవార్డులను అతడికి ప్రదానం చేసింది. 'క్రికెటర్ ఆఫ్ ద ఇయర్', 'టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారాలకు బుమ్రా ఎంపికైన సంగతి తెలిసిందే. వెన్నుగాయానికి లోనైన బుమ్రా చాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు. అయితే ఈ అవార్డులను స్వీకరించేందుకు బుమ్రా ఇక్కడకు విచ్చేశాడు. ఆ రెండు పురస్కారాలతోపాటు 2024.. టెస్ట్, టీ20 జట్లకు ఎంపికైన బుమ్రా మొత్తం నాలుగింటిని అందుకున్నాడు.

టాప్-10లో ఆండ్రీవా

దుబాయ్ టైటిల్ కైవసం



దుబాయ్: రష్యా యువ సంచలనం మిర్రా ఆండ్రీవా తన కెరీర్‌లో అతి పెద్ద టైటిల్ దుబాయ్ చాంపియన్‌షిప్స్‌ను సొంతం చేసుకుంది. ఈ టోర్నీలో హేమాహేమీ క్రీడాకారిణులను ఓడించిన ఆండ్రీవా తాజా ర్యాంకింగ్స్‌లో టాప్-10లోకి ప్రవేశించింది. శనివారం జరిగిన ఫైనల్స్‌లో ఆండ్రీవా 7-6, 6-1తో క్లారా టౌసన్ (డెన్మార్క్)పై సునాయాసంగా గెలిచింది. 2007 తర్వాత 17 ఏళ్ల పిన్న వయసు క్రీడాకారిణి టాప్-10లోకి రావడం ఇదే తొలిసారి.

రెండో టీ20లో జింబాబ్వే గెలుపు

హరారే: ఐర్లాండ్‌తో రెండో టీ20లో జింబాబ్వే మూడు వికెట్లతో నెగ్గింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో మొదట ఐర్లాండ్ 20 ఓవర్లలో 137/8 స్కోరు చేసింది. టకెర్ (46), టెక్టర్ (28), క్యాంఫెర్ (26) రాణించారు. ట్రెవర్ మూడు, సికిందర్ రజా, రిచర్డ్ ఎన్‌గరావా రెండేసి వికెట్లు పడగొట్టారు. ఛేదనలో జింబాబ్వే 19.2 ఓవర్లలో 141/7 స్కోరు చేసి నెగ్గింది. టోనీ (43), ర్యాన్ (27), సికిందర్ రజా (22) సత్తా చాటారు. యంగ్ నాలుగు వికెట్లు తీశాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆతిథ్య జట్టు 1-0తో ఆధిక్యంలో నిలిచింది. వర్షంతో తొలి టీ20లో ఫలితం తేలలేదు.

60 కోట్లు దాటిన వ్యూయర్‌షిప్

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీలో ఆదివారం జరిగిన ఇండో-పాక్ మ్యాచ్ వ్యూయర్‌షిప్‌లో సరికొత్త రికార్డు సృష్టించింది. కొత్తగా ఏర్పడిన జియో హాట్‌స్టార్‌లో వీక్షకుల సంఖ్య భారీగా 60.2 కోట్లుగా నమోదైంది. తొలి ఓవర్ షమి బౌల్ చేస్తున్నప్పుడు 6.8 కోట్లుగా ఉన్న వ్యూయర్‌షిప్.. క్రమంగా 32 కోట్లకు చేరుకొంది. భారత్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు 33.8 కోట్ల నుంచి 36.2 కోట్లతో నిలకడగా సాగింది. ఇక, విరాట్ ఫైనల్ షాట్ కొట్టేటప్పుడు 60 కోట్లు దాటింది.

డబ్ల్యూపీఎల్‌లో నేడు **బెంగళూరు X యూపీ** రాత్రి 7.30 నుంచి

సెమీస్‌పై కివీస్ కన్ను | చాంపియన్స్ ట్రోఫీ

బంగ్లాతో మ్యాచ్ నేడు • మ.2.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



రావల్పిండి: తొలి మ్యాచ్‌లో ఆతిథ్య పాకిస్థాన్‌ను చిత్తు చేసిన న్యూజిలాండ్ ఆత్మవిశ్వాసంతో ఉరకలేస్తోంది. ఈనేపథ్యంలో గ్రూప్-ఎలో సోమవారం జరిగే పోరులో బంగ్లాదేశ్‌తో తలపడుతోంది. ఈ మ్యాచ్‌లోనూ నెగ్గి సెమీఫైనల్ స్థానం దాదాపు ఖాయం చేసుకోవాలని కివీస్ పట్టుదలతో ఉంది. ముక్కోణపు టోర్నీ మ్యాచ్‌లో గాయపడిన రచిన్ రవీంద్ర కోలుకోవడంతో బంగ్లాతో పోరులో తుది జట్టు ఎంపిక న్యూజిలాండ్‌కు తలనొప్పిగా మారింది. వాస్తవంగా రచిన్ స్థానంలో జట్టులోకి వచ్చిన యంగ్‌ను పక్కకు తప్పించాల్సి ఉంది. కానీ పాక్‌తో మ్యాచ్‌లో ఓపెనర్ యంగ్ సెంచరీతో సత్తా చాటాడు. పైగా స్పిన్నర్లను యంగ్ సమర్థంగా ఎదుర్కొన్నాడు. ఒకవేళ రచిన్ కోసం అతడిని తప్పిస్తే..కుడి, ఎడమ కాంబినేషన్ దెబ్బతినే అవకాశం ఉంది. మరి న్యూజిలాండ్ యాజమాన్యం ఏ నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరం. మరోవైపు తొలి మ్యాచ్‌లో ఆరు వికెట్లతో భారత జట్టు చేతిలో ఓడిన బంగ్లాదేశ్‌కు న్యూజిలాండ్‌తో పోరు చావోరేవోనే. ఈ మ్యాచ్‌లో నెగ్గి నాకౌట్ అవకాశాలు సజీవంగా ఉంచుకోవాలంటే..బంగ్లా టాపార్డర్ బ్యాటర్లు శక్తికి మించి రాణించాల్సి ఉంటుంది. కాగా..గత చాంపియన్స్ ట్రోఫీలో కివీస్‌ను ఓడించిన బంగ్లాదేశ్ ఆ జట్టును టోర్నీ నుంచి నాకౌట్ చేసింది. ఆ ఒక్కటే సోమవారంనాటి మ్యాచ్‌కు బంగ్లాదేశ్‌కు స్ఫూర్తినిచ్చే అంశం.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి సీఎం రేవంత్

» నేడు నిజామాబాద్, కరీంనగర్, మంచిర్యాలలో పర్యటన

హైదరాబాద్/నిజామాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికను సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. సిటింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి తరఫున స్వయంగా ప్రచారం చేపట్టనున్నారు. సోమవారం ఒక్కరోజే ఏకంగా మూడు జిల్లాలు పర్యటించి ప్రచార సభల్లో పాల్గొంటున్నారు. ఉదయం హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 11.30 గంటలకు నిజామాబాద్‌కు చేరుకుని అక్కడి ప్రచార సభలో పాల్గొననున్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు మంచిర్యాలకు చేరుకుని అక్కడి ప్రచార సభలో మాట్లాడతారు. సాయంత్రం 4 గంటలకు కరీంనగర్ చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తారు. ఈ మూడు జిల్లాల్లో సభలను ఆయా జిల్లాలకు చెందిన పట్టభద్రులు, కార్యకర్తలతో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ గెలుపు కోసం నాలుగు ఉమ్మడి జిల్లాల మంత్రులు, ఇన్‌చార్జ్ మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. ఇక సీఎం రేవంత్ సైతం దిగనుండటంతో ఎన్నిక రసవత్తరంగా మారింది.

బలహీన వర్గాలకు రిజర్వేషన్లే ప్రభుత్వ లక్ష్యం

» కృష్ణా, గోదావరి జలాల్లో రాజీ ప్రసక్తే లేదు: దుద్దిళ్ల



కరీంనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బలహీన వర్గాలకు రిజర్వేషన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా బలహీన వర్గాలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలనే ఉద్దేశంతో కమిషన్‌ను ఏర్పాటు చేసి కులగణన సర్వే చేపట్టామని చెప్పారు. రిజర్వేషన్లను 50 శాతానికి పైగా పెంచాలంటే రాజ్యాంగ సవరణ అవసరమని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేస్తుందా? అని ప్రశ్నించారు. కృష్ణా, గోదావరి జలాల వివాదంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జలాల వివాదంలో మిన్నకుండి కృష్ణా, గోదావరి జలాల విషయంలో రైతులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావేత్త అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు.

విమర్శలు కాదు.. ఎరువులు తెప్పించండి

» రాష్ట్ర బీజేపీ నేతలకు మంత్రి తుమ్మల సూచన



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎరువుల లభ్యతపై విమర్శలు చేయకుండా కేంద్రం నుంచి ఎరువులను తెప్పించాలని రాష్ట్ర బీజేపీ నేతలకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రాష్ట్రంలో రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని బీజేపీ పెద్దలు ఎరువుల సరఫరా విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలకు మద్దతిస్తే మంచిదన్నారు. ఇప్పటికే ఎరువుల సరఫరాకు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులు ఢిల్లీకి వెళ్లి కేంద్రాన్ని కోరినట్టు తెలిపారు. ఆదివారం వ్యవసాయ అధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యూరియా కొరత లేదని, రైతులు ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరంలేదన్నారు. ఈ వారంలో మరో 81,800 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి రానుందని తెలిపారు. గత యాసంగికంటే ఈసారి 2.59 లక్షల మెట్రిక్ టన్నులు అదనంగా కొనుగోలు చేసినట్టు వెల్లడించారు. కేంద్రం నుంచి 8.54 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా.. ఇప్పటివరకు రాష్ట్రానికి 6.81 లక్షల మెట్రిక్ టన్నులే వచ్చిందన్నారు. ఎరువుల విషయంలో కేంద్రంతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతున్నామని, ఎరువులు పంపాలంటూ కేంద్రానికి తాను లేఖలు కూడా రాస్తున్నట్టు చెప్పారు.

యాదగిరీశుడికి

స్వర్ణ గోపుర శోభ

50.5 అడుగుల ఎత్తైన పంచతల గోపుర తాపడానికి 68కిలోల పసిడి వినియోగం



» సీఎం రేవంత్ దంపతుల ప్రత్యేక పూజలు

» ఘనంగా మహాకుంభాభిషేక సంప్రోక్షణ

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగుబంగారమై యాదగిరిగుట్టపై వెలసిన లక్ష్మీనరసింహ స్వామి బంగారు గోపుర ఆవిష్కరణ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ అమృత ఘడియల కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న భక్తజనకోటికి స్వర్ణమయ దివ్య విమాన రాజగోపురం దర్శనమిచ్చింది. ఐదురోజులుగా జపతపాదులు, హోమాలు, పారాయణలు, వేదమంత్ర పఠనంతో గుట్టపై నెలకొన్న ఉత్సవపూరిత వాతావరణం.. ఆదివారం మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవంతో పతాకస్థాయికి చేరింది. ఈ వేడుకల్లో భాగంగా యాగశాలలో నిర్వహించిన మహాపూర్ణాహుతిలో సీఎం రేవంత్ రెడ్డి దంపతులు భక్తిప్రపత్తులతో పాల్గొన్నారు. అసలు ఘట్టమైన స్వామివారి స్వర్ణ దివ్య విమాన రాజగోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవం.. వానమామలై మఠం 31వ మధుర కవి పీఠాధిపతి రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో మొదలైంది. జీయర్ అనుమతితో ఆలయ ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు మహాకుంభ కలశాన్ని శిరసున దాల్చి ఐదు అంతస్తుల ఎత్తున ఉన్న స్వర్ణ గోపురం వరకూ సుమారు 126 మెట్లెక్కారు. సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు క్రతువులో పాల్గొని స్వామి వారి స్వర్ణ విమాన గోపురాన్ని ఆవిష్కరించారు. 50.5 అడుగుల ఎత్తు, 10.759 చదరపు అడుగుల వైశాల్యంలో ఉన్న విమాన గోపురానికి స్వర్ణతాపడం చేసేందుకు..68 కిలోల బంగారాన్ని వినియోగించారు.

మహోత్సవం కొనసాగిందిలా...

ఉదయం 11.09 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు యాదగిరిగుట్ట పట్టణంలో వైకుంఠ ద్వారం వద్దకు.. అక్కడి నుంచి ఘాట్ రోడ్డు వెంట కొండపైన అతిథిగృహానికి చేరుకున్నారు. అక్కడ సంప్రదాయ దుస్తులు ధరించి లిఫ్ట్ ద్వారా తిరువీధిలోకి చేరుకుని యాగశాలను సందర్శించి మహాపూర్ణాహుతిలో పాల్గొన్నారు. 14 నదుల నుంచి సేకరించిన నదీ జలాలతో కూడిన కలశంతో ఉత్తర రాజగోపురం నుంచి దక్షిణ తిరువీధిలో ఏర్పాటు చేసిన మెట్లదారి నుంచి స్వర్ణ గోపురం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన మెట్లెక్కి.. పూలతో అల్లిన తాడు సహాయంతో.. స్వర్ణ దివ్య విమాన (గాలి) గోపురాన్ని సీఎం 11.54 గంటలకు ఆవిష్కరించారు. అనంతరం సుదర్శన చక్రానికి నదీ జలాలతో మహాకుంభాభిషేక సంప్రోక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమం ముగిసిన వెంటనే అక్కడినుంచి త్రితల గోపురం ద్వారా ఆలయంలోకి ప్రవేశించారు. మెట్ల మార్గంలోని ఆంజనేయస్వామి, గండభేరుండ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు సీఎంకు పూర్ణకుంభ స్వాగతం పలకగా.. గర్భాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, అంతరాలయంలోని స్వయంభువులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు శేష వస్త్రాన్ని కప్పి ఆశీర్వచనం చేయగా.. ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు లడ్డు ప్రసాదం, స్వామివారి చిత్రపటం, స్వర్ణ గోపుర జ్ఞాపికను అందజేశారు. అనంతరం సీఎం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. సీఎం వెంట ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, బాలునాయక్, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, జిల్లా కలెక్టర్ ఎం.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. కానీ.. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఉమ్మడి నల్లగొండ ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్. శ్రీధర్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సీఎం పర్యటనకు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది.



మహాకుంభాభిషేక సంప్రోక్షణలో పాల్గొన్న సీఎం రేవంత్ దంపతులు

శివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో అనుబంధ ఆలయమైన శ్రీ పర్వత వర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామి చర మూర్తులు కొలువైన ఉప ఆలయంలో ఆదివారం విఘ్నేశ్వర పూజ, స్వస్తివాచనంతో మహాశివరాత్రి మహోత్సవాలకు శాస్త్రోక్తంగా శ్రీకారం పలికారు.

కార్యకర్తల హంగామా

గుట్టపై సీఎం ఉన్నప్పుడు కాంగ్రెస్ కార్యకర్తలు హంగామా చేస్తూ భద్రత సిబ్బందితో రెండు చోట్ల గొడవకు దిగారు. దక్షిణ తిరువీధిలో పైకి ఎక్కేటప్పుడు భద్రత సిబ్బంది వారిని నిలిపివేయగా కార్యకర్తలు పైకి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించారు. సీఎం లిఫ్ట్‌లో అతిథిగృహానికి వెళ్లేటప్పుడు ఇదే పరిస్థితి ఎదురైంది. సిబ్బంది ప్రతిఘటించడంతో కార్యకర్తలు హంగామా చేశారు.

దాతలు రాక ఖాళీగా కుర్చీలు

స్వర్ణ దివ్య విమాన గోపురానికి బంగారం, నగదు విరాళంగా అందజేసిన దాతల కోసం తూర్పు రాజగోపురం ఎదురుగా ఏర్పాట్లు చేశారు. కానీ, దాతలు రాకపోవడంతో.. చాలా కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి.

భక్తుల ఇబ్బందులు

సీఎం పర్యటన సందర్భంగా.. ఉదయం 10.45 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట దాకా సర్వ దర్శనాలను రద్దు చేయడంతో భక్తులు.. మరీ ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చంటిపిల్లలు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. కొండపైన, కింద, ఆర్టీసీ బస్టాండ్‌లో భక్తులు నిరీక్షించాల్సి వచ్చింది.

రేపట్నుంచి హైదరాబాద్‌లో 'బయోఏషియా'

(మొదటిపేజీ తరువాయి)

చేతుల మీదుగా 25వ తేదీ, మంగళవారం సదస్సు ప్రారంభం కానుంది. 'క్యాటలిస్ట్ ఆఫ్ చేంజ్.. ఎక్స్‌పాండింగ్ గ్లోబల్ హెల్త్ కేర్ ఫ్రాంటియర్స్' అనే నేపథ్యంతో ఈసారి సదస్సును నిర్వహిస్తున్నారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో కృత్రిమ మేధ(ఏఐ)తో వచ్చిన మార్పులు, లైఫ్ సైన్సెస్ భవిష్యత్తును నిర్దేశించే ఆవిష్కరణలు, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతం తదితర అంశాలను ప్రభుత్వం సదస్సు అజెండాలో చేర్చింది. ఇక, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, క్వీన్స్‌ల్యాండ్ గవర్నర్ డాక్టర్ జీనెట్ యంగ్, జీ20 షెర్పా అమితాబ్ కాంత్, ఇస్రో మాజీ చైర్మన్ సోమనాథ్, డాక్టర్ రెడ్డిస్ లాబ్స్ చైర్మన్ సతీష్ రెడ్డి, భారత్ బయోటెక్ ఎండీ డాక్టర్ కృష్ణ ఎల్లా, లారస్ ల్యాబ్స్ సీఈఓ డాక్టర్ సత్యనారాయణ చావా తదితర ప్రముఖులు సదస్సులో ప్రసంగిస్తారు. కాగా, హైదరాబాద్‌లో జరగబోయే బయోఏషియా సదస్సు చరిత్రలోనే ప్రభావవంతమైన సదస్సుగా నిలుస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. కొత్త స్టార్టప్ కంపెనీల నుంచి బయో ఏషియా సదస్సుకు అంచనాలకు మించిన స్పందన వచ్చిందని పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తెలిపారు. బయో ఏషియా సదస్సుకు 700స్టార్టప్ కంపెనీలు దరఖాస్తు చేసుకోగా 80సంస్థలు తమ ఆవిష్కరణలను పరిచయం చేస్తాయని బయోఏషియా సీఈవో, తెలంగాణ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తినాగప్పన్ తెలిపారు.

బిజినెస్

బీఓఎం వడ్డీరేట్ల తగ్గింపు

న్యూఢిల్లీ: ఇంటి రుణాలు, ఆటో రుణాలు సహా అన్ని రకాల రిటైల్ రుణాలపై వడ్డీ రేటును బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) 0.25 శాతం మేరకు తగ్గించింది. దీంతో ఇంటి రుణాలపై వడ్డీ రేటు 8.10 శాతానికి దిగివచ్చింది. బ్యాంకింగ్ పరిశ్రమలో అతి తక్కువ వడ్డీ రేటు ఇదేనని బీఓఎం తెలిపింది. కార్ రుణంపై వడ్డీ రేటు 8.45 శాతానికి తగ్గింది. విద్యా రుణాలపై రెపో అనుసంధానిత వడ్డీరేటు (ఆర్ఎల్ఎల్ఆర్) కూడా 0.25 శాతం మేరకు తగ్గించారు.

ప్రస్తుత పొదుపు.. భవిష్యత్‌లో సరిపోదేమో..!

మెజారిటీ భారతీయుల మనోగతమిదే..

ముంబై: పొదుపునకు సంబంధించి భారతీయుల మనోగతంపై యూగవ్, ఎడెల్‌వీజ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఓ సర్వే చేపట్టింది. పూర్తి స్థాయి లేదా పాక్షిక ఆర్థిక ప్రణాళికను రూపొందించుకున్నప్పటికీ, భవిష్యత్ అవసరాలకు సిద్ధంగా లేమన్న భావన కలుగుతోందని ఈ సర్వేలో పాల్గొన్న సగానికి పైగా మంది అభిప్రాయపడ్డారు. తల్లిదండ్రులు, ఎదుగుతున్న పిల్లల ఆర్థిక అవసరాలు తీరుస్తున్న 35-54 ఏళ్ల వ్యక్తులపై ఈ అధ్యయనం జరిపినట్లు యూగవ్ వెల్లడించింది. దేశంలోని 12 నగరాలకు చెందిన 4,000 మందిని సర్వే చేసింది. అందులో 60 శాతం మంది ప్రస్తుతం ఆదా చేస్తున్న సొమ్ము భవిష్యత్ అవసరాలను తీర్చలేవేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. మరిన్ని విషయాలు..

- 94% మంది: ఇప్పటికే పూర్తి స్థాయి లేదా ఎంతో కొంత ఆర్థిక ప్రణాళికతో ఉన్నారు
- 50%కి పైగా: ప్రస్తుతం ఆర్జిస్తున్న సొమ్ము సరిపోవడం లేదు. ఆర్థికంగా వెనకబడి ఉన్నాం. ప్రయత్నించినా తగినంత రాణించలేకపోతున్నాం. రుణాలపై ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోంది. అలాగే, ఆదా చేసుకున్న సొమ్ము, సంపాదన కూడా కరిగిపోయింది
- 64%: అప్పు చేసి స్వల్పకాలిక కోరికలను ఎలా తీర్చుకుంటున్నాం
- 79%: ఆర్థిక పథకాల్లో పెట్టుబడులపై వచ్చే ప్రతిఫలాలతో దీర్ఘకాలిక కోరికలను నెరవేర్చుకోవాలనుకుంటున్న వారు.

ఐటీలో జీతాల పెంపు అంతంతే..

- 4 నుంచి 8.5% మించకపోవచ్చు
- ఫ్రెషర్స్ పరిస్థితి మరింత దారుణం
- వేచి చూసే ధోరణిలో కంపెనీలు
- ప్రత్యేక నైపుణ్యాలకు మాత్రం ఫుల్ డిమాండ్
- టీమ్‌లీజ్ డిజిటల్



న్యూఢిల్లీ: భారత ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ (ఐటీ) రంగం ఇంకా కష్టాల్లోనే ఉంది. ఈ ప్రభావం ఉద్యోగుల జీతాలపైనా కనిపిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో కూడా ఐటీ ఉద్యోగుల జీతాల పెంపు అంతంత మాత్రంగానే ఉంటుందని అంచనా. ఈ పెంపు మహా అయితే సగటున 4 నుంచి 8.5 శాతానికి మించకపోవచ్చని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఐటీ ఉద్యోగుల జీతాలు సగటున 8.4 శాతం నుంచి 9 శాతం వరకు పెరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న ఆర్థిక అనిశ్చితి, సరికొత్త నైపుణ్యాలకు డిమాండ్ పెరగడం, కృత్రిమ మేధ (ఏఐ)కు పెరుగుతున్న ప్రాధాన్యత ఈ ఏడాది ఐటీ ఉద్యోగుల జీతాల పెరుగుదలను దెబ్బతీయనున్నాయి. 'ఈ సంవత్సరం జీతాల పెంపుపై ఐటీ కంపెనీలు ఆచితూచి వ్యవహరించబోతున్నాయి' అని టీమ్‌లీజ్ డిజిటల్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ విజ్ తెలిపారు. ఆర్థిక అనిశ్చితితో పాటు కంపెనీలు ఐటీ ఖర్చులు తగ్గించుకోవడం, మారుతున్న వ్యాపార ప్రాధాన్యతలూ ఇందుకు దోహదం చేస్తున్నట్టు ఆమె చెప్పారు.

మదింపు వాయిదా

సాధారణంగా ఐటీ కంపెనీలు ఏటా మార్చికల్లా ఉద్యోగుల పనితీరు మదింపు పూర్తి చేసి ఏప్రిల్ నుంచి జీతాలు పెంపు అమలు చేస్తాయి. ఈ సంవత్సరం ఇప్పటి వరకు టీసీఎస్ ఒక్కటే ఈ పని పూర్తి చేసింది. తన ఉద్యోగుల జీతాలు సగటున 4 నుంచి 8 శాతం వరకు పెంచింది. ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో, టెక్ మహీంద్రా వంటి ఐటీ దిగ్గజాలు ఈ సంవత్సరం జీతాలు ఎప్పటి నుంచి పెంచేది ఇంకా ప్రకటించలేదు. దీంతో ఈ కంపెనీల్లో పని చేసే ఉద్యోగులు మా జీతాలు ఎప్పటి నుంచి పెంచుతారు బాస్? అని ఆశతో ఎదురు చూస్తున్నారు. 'ప్రస్తుతానికైతే రెండంకెల్లో జీతాల వృద్ధి గతం. ఈ సంవత్సరం జీతాల పెంపు మహా అయితే 5 నుంచి 8.5 శాతం మించకపోవచ్చు' అని రీడ్ అండ్ విల్లో సీఈఓ జానూ మొత్యాని చెప్పారు.

తగ్గిన వలసలు

పరిస్థితులు బాగోకపోవడంతో ఐటీ ఉద్యోగులు కూడా గతంలోలా అధిక జీతాలకు ఆశపడి పెద్దగా కంపెనీలు (ఉద్యోగాలు) మారడం (అట్రిషన్) లేదు. 2023లో ఐటీ ఉద్యోగుల సగటు అట్రిషన్ రేటు 18.3 శాతం ఉండేది. గత ఏడాది ఇది 17.7 శాతానికి పడిపోయింది. కంపెనీలు జీతాల పెంపు ఆలస్యం చేయడానికి ఇది కూడా ఒక ప్రధాన కారణం. కొన్ని ఐటీ కంపెనీలు మంచి పనితీరుతో కంపెనీనే అంటిపెట్టుకున్న ఉద్యోగులకు ఏటా రిటెన్షన్ బోనస్ పేరుతో ప్రత్యేక బోనస్‌లు చెల్లించేవి. ఈ సంవత్సరం చాలా కంపెనీలు ఈ బోనస్ గురించీ నోరు మెదపడం లేదని ఉద్యోగులు చెబుతున్నారు.

ఒక్కొక్కరికి ఒక్కోలా..

ఐటీ ఉద్యోగులందరి జీతాల పెంపు ఈ సంవత్సరం ఒకేలా ఉండదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఏఐ, మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), క్లౌడ్ ఇంజనీరింగ్, సైబర్ సెక్యూరిటీ. డేటా సైన్స్, బ్లాక్‌చెయిన్ వంటి టెక్నాలజీలపై పట్టు, మంచి పనితీరు ఉన్న మిడ్ లెవల్ ఉద్యోగుల జీతాలు 10 నుంచి 12 శాతం, సరికొత్త డొమైన్స్‌లో ప్రత్యేక నైపుణ్యాలు, నాయకత్వ స్థానాల్లో ఉండే సీనియర్ల జీతాలు 12 నుంచి 15 శాతం పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఫ్రెషర్స్ జీతాలు మాత్రం వారి పనితీరు ఆధారంగా రెండు నుంచి నాలుగు శాతం మాత్రమే పెరిగే అవకాశం ఉందని అడెకో ఇండియా అనే ఐటీ నియామక సేవల సంస్థ తెలిపింది.

23,100పైన బుల్లిష్

(ఫిబ్రవరి 24-28 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 23,134-22,720 పాయింట్ల మధ్యన కదలాడి 133 పాయింట్ల నష్టంతో 22,796 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23,100 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 22,873, 22,917, 23,181, 23,195 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 23,100
బ్రేక్‌డౌన్ స్థాయి: 22,500
నిరోధ స్థాయిలు: 23,000, 23,100, 23,200 (22,900 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 22,600, 22,500, 22,400 (22,700 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



24వ తేదీ			
హైదరాబాద్	435	విజయవాడ	475
వరంగల్	437	గోదావరి	460
చిత్తూరు	493	విశాఖపట్నం	460
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	70	విజయవాడ	71
వరంగల్	70	గుంటూరు	71
కరీంనగర్	70	ఒంగోలు	71
మహబూబ్‌నగర్	70	చిత్తూరు	68
కర్నూలు	70	నెల్లూరు	73
విశాఖపట్నం	70	అనంతపురం	73
గోదావరి	71		

కన్సాలిడేషన్‌కు చాన్స్!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా చలించే అవకాశం ఉంది. గ్లోబల్ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందే వరకు సూచీలకు ఒక గమనం ఉండకపోవచ్చు. డొనాల్డ్ ట్రంప్ టారిఫ్స్‌పై వరుసగా ప్రకటనలు చేస్తుండటంతో మదుపరులు గందరగోళానికి లోనవుతున్నారు. ఇప్పటికే బెంచ్‌మార్క్ సూచీలు కనిష్ఠాలకు చేరటంతో కన్సాలిడేషన్‌కు అవకాశం లేకపోలేదు. నిఫ్టీకి 22,800 స్థాయిలో బలమైన మద్దతు ఉంది.

స్టాక్ రికమండేషన్స్

వాబగ్ టెక్నాలజీ: డిసెంబరులో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన ఈ షేరు 42 శాతం మేర దిద్దుబాటుకు లోనైంది. కీలకమైన రూ.1,200 స్థాయిలో మద్దతు దొరికింది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ పెరుగుతండటం, ట్రెండ్ రివర్సల్‌కు అవకాశం ఉండటం శుభపరిణామం. గత శుక్రవారం రూ.1,434 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,400 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,550/1,600 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,360 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

సెయిల్: గత ఏడాది మే నుంచి డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ కౌంటర్‌లో జనవరి నుంచి బేస్ ఏర్పడుతోంది. ప్రైస్ యాక్షన్ టైట్‌గా కొనసాగుతోంది. డిసెంబరు త్రైమాసిక ఫలితాల అనంతరం మదుపరులు ఆసక్తి చూపిస్తున్నారు. పైగా రిలేటివ్ స్ట్రెంత్ ఎక్కువగా ఉంది. గత శుక్రవారం రూ.112 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.110/107 శ్రేణిలో ఎంటరై రూ.125/130 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.103 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

గోద్రెజ్ ఇండస్ట్రీస్: జనవరిలో రూ.1,246 స్థాయిలో నిరోధం ఎదుర్కొన్న ఈ షేరు వరుసగా పతనమవుతూ 34 శాతం మేర దిద్దుబాటుకు లోనైంది. కీలకమైన రూ.780 స్థాయిలో మళ్లీ పుంజుకుంది. భారీ వాల్యూమ్‌తో చివరి రెండు సెషన్లలోనే 40 శాతం మేర పెరిగింది. గత శుక్రవారం రూ.1,131 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.1,050/1,000 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,250/1,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.960 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ: గత ఏడాది సెప్టెంబరు నుంచి డౌన్‌ట్రెండ్‌లో సాగుతూ వస్తున్న ఈ షేరుకు రూ.420 స్థాయిలో మద్దతు లభించింది. చివరి నాలుగు సెషన్లలో లాభాల్లోనే ముగిసింది. భారీ వాల్యూమ్‌తో 10, 20 రోజుల మూవింగ్ యావరేజీని బ్రేక్ చేసింది. గత శుక్రవారం ఈ షేరు 5.99 శాతం లాభంతో రూ.496 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.470 స్థాయిలో ప్రవేశించి రూ.550/600 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.445 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్: నష్టాల మార్కెట్లోనూ ఈ షేరు జోరు ప్రదర్శిస్తోంది. నిఫ్టీతో పోలిస్తే మెరుగ్గా ట్రేడవుతున్నాయి. ప్రాథమికంగా డౌన్‌ట్రెండ్‌లో ఉన్నప్పటికీ హయ్యర్ లోస్ నమోదవడం ఇన్వెస్టర్లను ఆకర్షిస్తోంది. చివరి త్రైమాసికంలో ఈపీఎస్ విపరీతంగా పెరిగింది. గత శుక్రవారం రూ.4,545 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.4,480/4,450 పొజిషన్ తీసుకుని రూ.4,750 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,410 స్థాయిని స్టాప్‌లాస్ పెట్టుకోవాలి.



– మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

మద్దతు స్థాయిలు 22,600, 22,400

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

గత వారం నిఫ్టీ కీలక మద్దతు స్థాయి 23,000 వద్ద విఫలమై అంతకన్నా దిగువన 22,800 సమీపంలో ముగిసింది. వరుసగా 14 ట్రేడింగ్ దినాలుగా నిరంతర డౌన్‌ట్రెండ్‌నే కొనసాగిస్తూ 1,000 పాయింట్లకు పైగా నష్టపోయింది. అమెరికన్ మార్కెట్లో శుక్రవారం నాటి ట్రెండ్ కారణంగా ఈ వారంలో మరింత నెగెటివ్‌గా ప్రారంభం కావచ్చు. సానుకూలత కోసం రాబోయే కొద్ది రోజుల్లో ప్రధాన మద్దతు స్థాయి 22,400 వద్ద కన్సాలిడేట్ కావాలి. మిడ్‌క్యాప్-100 సూచీ 830 పాయింట్లు, స్మాల్ క్యాప్-100 సూచీ 230 పాయింట్ల మేరకు లాభపడినా అది కేవలం టెక్నికల్ పుల్‌బ్యాక్ రికవరీగానే భావించాలి.

బుల్లిష్ స్థాయిలు: సానుకూలత కోసం నిఫ్టీ మైనర్ నిరోధ స్థాయి 22,800 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం, మానసిక అవధి 23,000.

బేరిష్ స్థాయిలు: ప్రధాన మద్దతు స్థాయి 22,400 మార్కెట్ కన్సాలిడేట్ కావచ్చు. సానుకూలత కోసం మార్కెట్ ఈ మద్దతు స్థాయి కన్నా పైన తప్పనిసరిగా నిలదొక్కుకోవాలి.


బ్యాంక్ నిఫ్టీ: గత 6 వారాలుగా ఈ సూచీ కన్సాలిడేషన్ ధోరణిలో ఉంది. సానుకూలత కోసం ప్రధాన నిరోధం 49,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 49,600. మద్దతు స్థాయి 48,500 వద్ద విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 47,800.

పాటర్న్: గత వారం మార్కెట్ 22,800 వద్ద ఏర్పడిన "డబుల్ బాటమ్ పాటర్న్" వద్ద బలహీనంగా ముగిసింది. 23,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిరోధం ఉంది. సానుకూలత కోసం ఆ పైన నిలదొక్కుకోవాలి. ఈ వారం మరింత డౌన్‌ట్రెండ్‌లో ప్రవేశించినట్టయితే మార్కెట్ ఓవర్‌సోల్డ్ స్థితిలోకి ప్రవేశిస్తుంది. ఇక్కడ రికవరీ ఏర్పడవచ్చు.

టైమ్: ఈ సూచీ ప్రకారం సోమవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	22,800, 22,880
మద్దతు	22,660, 22,600

టన్నెల్ నిండా బురద


ఎస్ఎల్‌బీసీలో రాత్రివేళ సహాయక చర్యలు చేపడుతున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

(మొదటిపేజీ తరువాయి)

సహాయక చర్యలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. దాదాపు 13 కిలోమీటర్ల వరకు విద్యుత్తు సరఫరాను, వైఫైని పునరుద్ధరించగా.. అక్కడి వరకు ఆక్సిజన్ సరఫరా నిర్విరామంగా కొనసాగుతోంది. టన్నెల్ లోపల ఇరుకుగా ఉండటం, దిగువన బురద కారణంగా అడుగు తీసి అడుగు వేయలేని స్థితి ఉండటంతో.. సహాయక చర్యలకు ఎక్కువ బృందాలను తీసుకెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం) నుంచి దాదాపు 400 మీటర్ల వరకు మట్టి కూరుకుపోయిందని సహాయక చర్యల్లో పాల్గొని తిరిగివచ్చిన వారు చెబుతున్నారు. దీంతో లోపల చిక్కుకున్నవారి పరిస్థితి ఆందోళనకరంగానే ఉందని భావిస్తున్నారు. పెద్ద ఎత్తున బురద పేరుకుపోవడం, వారు ఉన్న వైపునకు గాలి సరఫరా లేకపోవడం, ప్రమాదం జరిగి దాదాపు రెండు రోజులు అవుతుండటంతో అందరిలోనూ ఆందోళన నెలకొంది. లోపలికి వెళ్లివచ్చిన వారు కూడా.. సహాయక చర్యలు పూర్తయి, టన్నెల్‌లో చిక్కుకున్నవారి వద్దకు వెళ్లాలంటే కనీసం మూడు రోజుల సమయం పడుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సైతం మూడో బృందంలో మధ్యాహ్నం ఒంటి గంటకు టన్నెల్ లోపలికి వెళ్లి సాయంత్రం 6.40 గంటలకు బయటకు వచ్చారు. అక్కడ నెలకొన్న పరిస్థితి ప్రకారం ఎన్ని రోజులు పడుతుందో స్పష్టంగా చెప్పలేమన్నారు. సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయని, చిక్కుకున్న వారిని కాపాడుతామని ఆశాభావం వ్యక్తం చేశారు.

నిర్విరామంగా డీ వాటరింగ్ ప్రక్రియ..

సహాయక చర్యలకు ప్రధానంగా బురద, నీరు అడ్డంకిగా ఉండడంతో డీ వాటరింగ్ చేయడం సవాల్‌గా మారింది. లోపలికి వెళ్లివచ్చిన రెస్క్యూ బృందాల్లోని సభ్యులు కూడా ఇదే విషయం చెబుతున్నారు. ప్రమాదం జరిగినప్పటి నుంచి ఇప్పటివరకు నిల్వ ఉన్న బురద నీటిని తరలించడం కష్టంగా మారిందని అంటున్నారు. ఇప్పటికే డీ వాటరింగ్ కోసం అక్కడ 150 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మోటార్ ఉండగా, మరో 100 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మోటార్‌ను బిగించారు. నిమిషానికి దాదాపు 4500 లీటర్ల నీటిని బయటకు తోడుతున్నారు. పేరుకుపోయిన మట్టి.. లూజ్ బురదగా మారితే దానిని కూడా డీ వాటరింగ్‌లో భాగంగానే బయటకు తరలించే ప్రయత్నం చేస్తే సహాయక చర్యల్లో వేగం పెరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అయితే టన్నెల్ ఇరుకైనది కావడం కూడా సమస్యగా మారింది. టన్నెల్ దాదాపు 9 మీటర్ల వ్యాసంతో ఉంటుంది. ఇందులో ఎయిర్ పంపింగ్ కోసం పైపు లాంటి వ్యవస్థ ఉంటుంది. కిందివైపు.. పైపులు, విద్యుత్తు సరఫరా లైన్లు, మట్టి తరలించడానికి కన్వేయర్లు ఉంటాయి. ఈ ఇరుకు సొరంగంలోకి ఎక్కువ మంది వెళ్లి పనిచేయడానికి లేదా ఎక్స్‌కవేటర్లు, పెద్ద మెషినరీ వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొనడానికి అవకాశం లేదు. కేవలం 50 నుంచి 60 మంది మాత్రమే వెళ్లి పనిచేయడానికి వీలుంటుంది. సొరంగం లోపల బురద పేరుకుపోవడంతో.. సహాయక బృందాలు అందులోకి దిగి నడవడం కోసం తడకలను, లూజ్ బురద ఎక్కువగా ఉంటే అందులో నుంచి వెళ్లేందుకు థర్మకోల్ తెప్పలను, ఊటనీరు ఎక్కువగా వస్తే రక్షణ కోసం ట్యూబ్‌లను సహాయక బృందాలు లోపలికి తీసుకెళ్లాయి. మట్టికి అడ్డుగా ఐరన్ షీట్లు, రాడ్లు పడడంతో.. వాటిని కట్ చేయడానికి కట్టర్లు, గ్యాస్ సిలిండర్లు, విద్యుత్తు సరఫరా నిలిచిపోతే ఇబ్బంది కాకుండా డీజిల్ జనరేటర్లను తీసుకెళ్లారు.

మంత్రులు, అధికారుల సమీక్షలు..

సహాయక చర్యలను పరిశీలించడానికి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు ఆదివారం ఉదయం 10.30గంటలకు జేపీ గెస్ట్‌హౌస్‌కు వచ్చారు. అక్కడే అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. మంత్రి జూపల్లి దాదాపు ఐదు గంటలపాటు టన్నెల్ లోనే ఉండి సహాయక చర్యలను పరిశీలించారు. మరోవైపు సహాయక చర్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం సంబంధిత విభాగాలతో ఆరా తీశారు. కార్మికులను రక్షించేందుకు అన్నివిధాలా ప్రయత్నాలు కొనసాగించాలని అధికారులకు సూచించారు. కాగా, సహాయక బృందాలకు సహకారం అందించేందుకు సికింద్రాబాద్ బైసన్ డివిజన్ ఇంజనీర్ టాస్క్‌ఫోర్స్ (ఈటీఎఫ్) బృందాలు కూడా ఆదివారం రంగంలోకి దిగాయి.

సహాయక చర్యల్లో వందల మంది..

సొరంగంలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు సహాయక చర్యల్లో భాగంగా భారత సైన్యం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడంతోపాటు రెండు ఆర్మీ హెలికాప్టర్లను సిద్ధంగా ఉంచారు. ఎన్డీఆర్ఎఫ్ నుంచి 120 మంది సహాయక చర్యల్లో పాల్గొంటుండగా, ఎస్డీఆర్ఎఫ్ నుంచి 70 మంది, సింగరేణి రెస్క్యూ టీం నుంచి 35 మంది, హైడ్రా నుంచి 15 మంది పాల్గొంటున్నారు. నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ సీఎస్ అరవింద్‌కుమార్, ఐఏఎస్ శ్రీధర్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, నాగర్‌కర్నూలు కలెక్టర్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్, ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్లు సుదీశ్‌కుమార్, ప్రసన్న, పవన్, అగ్నిమాపక శాఖ నుంచి ఆర్ఎఫ్ హరినాథ్‌రెడ్డి, సింగరేణి రెస్క్యూ టీం చీఫ్ కలందర్ తదితరులు పాల్గొంటున్నారు. మొదటి టీంలో కేవలం 8 మంది మాత్రమే సొరంగంలోకి వెళ్లగా, రెండో టీంలో 23 మంది, మూడోసారి దాదాపు 50 మంది లోపలికి వెళ్లారు. జేపీ, రాబిన్ కంపెనీలు విద్యుత్తు, ఎయిర్, వాటర్, డీవాటర్ ప్రక్రియను పరిశీలిస్తున్నారు. సాయంత్రం 6.40గంటలకు మంత్రి జూపల్లితోపాటు పది మంది బయటకు వచ్చారు.

రెస్క్యూ ఆపరేషన్ సాగుతోందిలా..


- శనివారం రాత్రి 10:30 గంటలకు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది 8 మంది టన్నెల్ లోపలికి ట్రెయిన్ ద్వారా వెళ్లారు. 11.45 గంటలకు అక్కడికి చేరుకున్నారు. 12 కిలోమీటర్ల వరకు ట్రెయిన్‌లో వెళ్లి.. అక్కడి నుంచి కన్వేయర్ బెల్టు సాయంతో మరో కిలోమీటర్ వరకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. దాదాపు 300 మీటర్ల నుంచి 400 మీటర్ల వరకు మట్టి, సెగ్మెంట్ బ్లాకులు, ఐరన్ షీట్స్, టన్నెల్ సామగ్రి పేరుకుపోయినట్లు గుర్తించి రాత్రి 2:30 గంటలకు తిరిగి వచ్చారు.
- అర్ధరాత్రి దాటాక 3 గంటలకు సింగరేణి, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్‌కు చెందిన దాదాపు 23 మంది టీమ్ టన్నెల్ లోపలికి వెళ్లింది. వారు ఘటనా స్థలానికి దాదాపు 300 నుంచి 400 మీటర్ల దగ్గరి వరకు వెళ్లారు. అక్కడ దాదాపు 2.5 మీటర్ల ఎత్తు వరకు బురద ఉండటంతో.. అందులోకి దిగి నడవడం వీలు కావడం లేదని రెస్క్యూ టీంలో ఉన్న వ్యక్తులు తెలిపారు. 24 గంటలు షిఫ్టుల వారీగా మూడు రోజులపాటు సహాయక చర్యలు కొనసాగిస్తేనే లోపల ఉన్నవారు బయటకు వచ్చే అవకాశం ఉందని కొందరు తమ అంచనాలను చెప్పారు. వారు ఆదివారం ఉదయం 9 గంటలకు తిరిగి వచ్చారు.
- ఉదయం 10 గంటలకు మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి జేపీ గెస్ట్‌హౌస్‌కు వచ్చి.. అధికారులతో సమీక్ష నిర్వహించారు.
- 10.30 గంటలకు ఆర్మీతోపాటు ఇతర సహాయక బృందాలు లోపలికి వెళ్లాయి.
- 11.30 గంటల వరకు మంత్రులు, ఇతర అధికారులు టన్నెల్ ప్రాంతానికి చేరుకొని, అక్కడ సహాయక ఏర్పాట్లపై ప్రణాళికలను పరిశీలించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సొరంగం లోపలికి అర కిలోమీటర్ వరకు వెళ్లారు.
- మధ్యాహ్నం 1 గంటకు మరో బృందం లోపలికి వెళ్లగా.. అందులో మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా వెళ్లారు.
- సాయంత్రం 5.30 గంటలకు రాబిన్ కంపెనీకి చెందిన ఎలక్ట్రీషియన్లు, వాటర్‌మెన్ 10 మంది తిరిగి వచ్చారు.
- సాయంత్రం 6.40 గంటలకు మంత్రి జూపల్లి కృష్ణారావు టన్నెల్ నుంచి బయటకు వచ్చారు.

ఆ 8 మంది పరిస్థితి.. ఆశాజనకంగా లేదు

- మంత్రులు ఉత్తమ్, జూపల్లి కృష్ణారావు
- బయటకు వచ్చిన కార్మికులు అదృష్టవంతులు: జూపల్లి


ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోపలికి వెళ్తున్న మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూలు/అచ్చంపేట/దోమలపెంట/హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): "ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోపల భయానక పరిస్థితి ఉంది. సొరంగంలో గల్లంతైన ఎనిమిది మందిని ప్రాణాలతో క్షేమంగా తీసుకొచ్చే విషయంలో పరిస్థితి ఆశాజనకంగా లేదు" అని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఆర్మీ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయానికి ప్రమాదస్థలికి 100 అడుగుల సమీపానికి వెళ్లారని, చిక్కుకున్న వారిని పేర్లతో పిలిచినా.. స్పందన లేదన్నారు. "సొరంగంలో అంతా భయంకరంగా ఉంది. శిథిలాలు 23-25 అడుగుల మేర ఉన్నాయి. కేవలం 4-5 అడుగుల మేర పైభాగం మిగిలి ఉంది. చిక్కుకుపోయిన వారి పరిస్థితి ఏమిటనేది ఇప్పుడప్పుడే చెప్పలేం. ఓ ఆశతో ఉన్నాం. కానీ, పరిస్థితులు ఆశాజనకంగా లేవు. లోపలికి వెళ్లి చూసిన నాకు ఒక్కటే అనిపించింది. బయటకు వచ్చిన 42మంది కార్మికులు అదృష్టవంతులు అని. వారంతా నీటిలో ఈదుతూ బయటకు వచ్చారు" అని వివరించారు. ఆదివారం స్వయంగా టన్నెల్‌లోనికి వెళ్లిన జూపల్లి.. అక్కడ ఏడెనిమిది గంటలపాటు ఉన్నారు. బయటకు వచ్చాక ఎక్సైజ్ కమిషనర్ ఇ.శ్రీధర్, నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తో సమీక్ష నిర్వహించారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. మరో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కూడా పరిస్థితిని మీడియాకు వివరించారు. టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మందిని కాపాడడానికి ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డుతోందని మంత్రులిద్దరూ చెప్పారు. ఆర్మీ, నేవీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఇతర ఏజెన్సీలు సమష్టిగా సహాయక చర్యలు చేపడుతున్నాయని వివరించారు. "నీటిని తొలగించే ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతోంది. కార్మికుల కోసం ఆక్సిజన్ సరఫరా చేస్తున్నాం. ప్రధాని నరేంద్ర మోదీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు పరిస్థితిని అడిగి, తెలుసుకుంటున్నారు. సీఎం రేవంత్, సీఎస్ శాంతికుమారి, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్‌బొజ్జా శనివారం రాత్రి నుంచి ఎప్పటికప్పుడు టెలీకాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉంది. ప్రమాద స్థలంలో పరిస్థితి గంభీరంగా ఉంది. నీటి నిల్వలను, ఊటను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నీటి తీవ్రత ధాటికి టన్నెల్ బోరింగ్ మెషీన్ కొట్టుకొచ్చింది. టన్నెల్‌లో మట్టి దిబ్బలను తొలగించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాం. ప్రమాద స్థలికి భారీ యంత్రాలను తీసుకెళ్లడం కుదరడం లేదు" అని వ్యాఖ్యానించారు. టన్నెల్ ప్రమాదాన్ని బీఆర్ఎస్ నాయకత్వం రాజకీయం చేస్తోందని, పదేళ్లుగా ఆ పార్టీ ఎస్ఎల్‌బీసీని నిర్లక్ష్యం చేయడమే ఈ ప్రమాదానికి కారణమని ఆరోపించారు. ప్రాజెక్టు నిర్వహణ కంటే.. కమీషన్లపై ఆలోచన చేసే బీఆర్ఎస్ ఇప్పుడు చిల్లర రాజకీయాలకు ప్రమాదాన్ని వాడుకుంటోందని మండిపడ్డారు. టన్నెల్ నిర్మాణంలో లీకేజీల ప్రమాదం ఎప్పుడూ ఉంటుందని, వారి హయాంలో కూడా లీకేజీలు జరిగాయన్నారు. ఈ ఘటనపై జూపల్లి కృష్ణారావు వేరుగా ఓ పత్రికాప్రకటనను విడుదల చేశారు. "ఎస్ఎల్‌బీసీ పనులు 2007లో ప్రారంభమయ్యాయి. బీఆర్ఎస్ తన పదేళ్ల పాలనలో కనీసం 10 మీటర్ల సొరంగాన్ని కూడా తవ్వలేదు. మా ప్రభుత్వం వచ్చిన వెంటనే.. ఎస్ఎల్‌బీసీపై దృష్టి సారించాం. ఇప్పుడు ఈ ప్రమాదం జరగడం దురదృష్టకరం"అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో మానవ తప్పిదం గానీ, ప్రభుత్వ నిర్లక్ష్యం గానీ లేవన్నారు. నీటిని తోడి, బురదను తొలగించేవరకు సహాయక చర్యలకు ఇబ్బందులు కొనసాగుతాయన్నారు. ఈ సమయంలో బీఆర్ఎస్, బీజేపీలు ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు.


ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కూరుకుపోయిన మట్టి

సీఎం రేవంత్‌కు రాహుల్ ఫోన్

- ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటనపై ఆరా

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ.. సీఎం రేవంత్‌రెడ్డికి ఫోన్ చేశారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటనపై ఆరా తీసిన ఆయన.. సొరంగంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రమాద ఘటన తెలిసిన వెంటనే సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని ఘటనా స్థలానికి పంపానని.. సహాయక చర్యలు చేపట్టేందుకు ఎన్ఆర్‌డీఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ రెస్క్యూ స్క్వాడ్‌నూ పంపామని సీఎం చెప్పారు. గాయపడిన వారికి వైద్య సహాయం అందించడం, సొరంగంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టామని వివరించారు. ప్రభుత్వం స్పందించిన తీరు, తీసుకుంటున్న చర్యలను రాహుల్ ప్రశంసించారు. సొరంగంలో చిక్కుకున్న కార్మికులను రక్షించేందుకు ఉన్న ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోవద్దని సూచించారు.

ఆపరేషన్ జిందగీ!

2023లో ఉత్తరకాశీలో కూలిన సొరంగం

లోపల చిక్కుకుపోయిన 41 మంది కార్మికులు

17రోజులపాటు కష్టపడి కాపాడిన అధికారులు

'ర్యాట్‌హోల్' మైనింగ్‌తో బాధితులు బయటకు!

హైదరాబాద్, ఫిబ్రవరి 23: గుర్తుందా? 2023 నవంబరు 12న.. ఉత్తరాఖండ్‌లోని ఉత్తర కాశీలోని సిల్‌క్యారా బెండ్-బార్‌కోట్ టన్నెల్ కుప్పకూలి 41 మంది అందులో చిక్కుకుపోయారు! అధికారులు.. 'ఆపరేషన్ జిందగీ' పేరిట వారిని కాపాడే మిషన్‌ను చేపట్టారు. అయితే లోపల్నుంచీ వారిని బయటకు తేవడానికి 17 రోజులు పట్టింది! అదీ అంత సులభంగా కాలేదు. జాతీయ విపత్తు స్పందన దళాలు, రాష్ట్ర విపత్తు స్పందన దళాలు, ఉత్తరాఖండ్ పోలీసులు, ఇండియన్ ఆర్మీ కోర్ ఆఫ్ ఇంజనీర్స్ నుంచి, సరిహద్దు రహదారుల సంస్థ నుంచి ఇంజనీర్లు.. అక్కడికి చేరుకుని బాధితులను బయటకు తెచ్చేందుకు ఎంతగానో శ్రమించారు. ఆస్ట్రేలియా నుంచి టన్నెలింగ్ నిపుణులైన ఆర్నాల్డ్ డిక్స్, క్రిస్ కూపర్ సహా ఎందరో ప్రైవేటు నిపుణులను సైతం రంగంలోకి దించారు. లోపలున్నవారు బయటకు వచ్చే గొట్టాన్ని (ఎస్కేప్ పైప్) ఏర్పాటు చేయడానికి తొలుత ఉపయోగించిన పరికరంతో అనుకున్నంత వేగంగా పని జరక్కపోవడంతో.. ఢిల్లీ నుంచి 25 టన్నుల బరువుండే అత్యంత అధునాతన హారిజాంటల్ అగర్ డ్రిల్లింగ్ మెషీన్‌ను రప్పించారు. మూడు భాగాలుగా వచ్చిన ఆ మెషీన్‌ను.. సొరంగం వద్దకు తెచ్చి బిగించి డ్రిల్లింగ్ కొనసాగించారు. ఒకవైపు డ్రిల్లింగ్ పనులు కొనసాగుతుండగానే.. థాయ్‌లాండ్‌లో 2018లో థామ్ లువాంగ్ గుహలో చిక్కుకుపోయిన విద్యార్థులను కాపాడిన నిపుణులను సంప్రదించి వారి సలహాలు తీసుకున్నారు. కానీ, దురదృష్టవశాత్తూ డ్రిల్లింగ్ మిషన్ పాడైపోవడంతో 17వ తేదీన తాత్కాలికంగా పనులు ఆపేసి కొత్త వ్యూహాన్ని అవలంబించారు. అందులో భాగంగా.. ప్రధాన సొరంగానికి సమాంతరంగా 3 ప్రత్యామ్నాయ సొరంగాల్ని తవ్వి వాటిలోంచి మూడు పైపులు వేసి ఒక పైపు గుండా ఆహారం, ఒక పైపు గుండా ఆక్సిజన్, ఒక పైపు ద్వారా ఎండోస్కోపిక్ కెమెరా పంపారు. కానీ, అసలు పని మాత్రం నత్తనడకనే సాగింది. అడ్డుగా ఉన్న శిథిలాల కారణంగా 23వ తేదీ నాటికి డ్రిల్లింగ్ మెషీన్ దెబ్బతింది. దానికి మరమ్మతులు చేయాల్సి వచ్చింది. అయితే అప్పటికే.. లోపలున్న వారికి 75% దగ్గరకు చేరగలిగారు. దగ్గరకి వచ్చేశామని ఆనందించేలోపే.. నవంబరు 25న డ్రిల్లింగ్ మెషీన్ విరిగిపోయింది. దీంతో రెస్క్యూ టీమ్ ఇక యంత్రాలపై ఆధారపడడం మానేసి చేతులతో ఉపయోగించే పరికరాలతో (సుత్తి, ఉలి వంటివి) తవ్వకం కొనసాగించాలని నిర్ణయించారు. దీన్నే ర్యాట్ హోల్ మైనింగ్ అంటారు. ఒక్క మనిషి మాత్రమే వెళ్లగలిగే గుంతలు తవ్వే విధానం ఇది. నిజానికి దీనిపై మనదేశంలో నిషేధం ఉంది. అయినప్పటికీ.. ఆ విధానాన్నే అనుసరించాలని నిర్ణయించి, అందులో నిపుణులైన మైనర్లను రంగంలోకి దించారు. వారు దాదాపు 24 గంటలపాటు తవ్వకం జరిపి లోపలికి ఒక పైపును చొప్పించగలిగారు. లోపల చిక్కుకున్న ఒక్కో బాధితుడూ ఆ పైపు గుండా బయటకు వచ్చారు. అలా సొరంగంలో చిక్కుకున్న మొత్తం 41 మందినీ కాపాడారు.

బీటీపీఎస్ పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలి..

- జెన్‌కో అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలు



హైదరాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రం (బీటీపీఎస్)లో పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయించాలంటూ జెన్‌కో అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఎలక్ట్రిక్, సివిల్, మెకానికల్ పనులను అగ్రిమెంట్ ప్రకారం నిర్దిష్ట గడువులో బీహెచ్ఈఎల్ కంపెనీ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆదివారం ప్రజాభవన్‌లో బీటీపీఎస్ అభివృద్ధి పనులపై జెన్‌కో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. బీటీపీఎస్ యూనిట్ 1 ఉత్పత్తికి సంబంధించి కాలిపోయిన జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల గురించి ఆరా తీశారు. మరమ్మతులు చేయడానికి టెండర్ పిలిచామని, పనులు పురోగతిలో ఉన్నాయని చీఫ్ ఇంజనీర్ పీవీ శ్రీనివాస్ వివరించారు. జెన్‌కో పరిధిలోని విద్యుత్తు కేంద్రాల్లో సాంకేతిక కారణాలతో ఉత్పత్తి నిలిచిపోతే వీలైనంత త్వరగా పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవడానికి డైరెక్టర్, చీఫ్ ఇంజనీర్ అధికారులతో త్రిసభ్య కమిటీ వేయాలని భట్టి ఆదేశించారు. సింగరేణి మైనింగ్ ప్లాంట్ మణుగూరు నుంచి బీటీపీఎస్ వరకు రైల్వే లైన్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. బీటీపీఎస్‌లో ఏ చిన్న సంఘటన జరిగినా చీఫ్ ఇంజనీరే పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఐటీడీఏ పీడీ ద్వారా స్థానిక గిరిజనులను పవర్ ప్లాంటులో నాన్ టెక్నికల్ కార్మికులుగా తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్‌కు అనుగుణంగా జాబ్ క్యాలెండర్‌ను అమలు చేస్తామని చెప్పారు. ప్రజాభవన్‌లో తనను కలిసిన తెలంగాణ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ నేతలకు ఈమేరకు భరోసానిచ్చారు. అలాగే జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలలో పదోన్నతులకు సంబంధించి త్వరలోనే ఉత్తర్వులిస్తామన్నారు.

రేవంత్.. పౌరుషం చచ్చిపోయిందా..?

కేసీఆర్‌ను జైల్లో వేస్తానన్న ప్రతిజ్ఞ మరిచావా.. అవినీతి కేసుల్లో సాక్ష్యాలున్నా తాత్సారమేంటి?

- వరి వేయొద్దన్న కాంగ్రెస్ సర్కారుకు ఉరే
- 25 వేల కొలువులకు నోటిఫికేషన్ వేసి.. 50 వేల ఉద్యోగాలు ఎలా ఇచ్చారు..?
- పైరవీల కోసం ప్రజా భవన్‌కు టీఎన్జీవోలు
- పాలకులకు టీచర్ సంఘాల బాకా: బండి



వరంగల్‌లో మాట్లాడుతున్న బండి సంజయ్

హైదరాబాద్/మిల్స్‌కాలనీ(వరంగల్)/మందమర్రి రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో పౌరుషం, చీమూ నెత్తురు చచ్చిపోయిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. "రేవంత్‌రెడ్డి గారూ.. బిడ్డ పెళ్లి నాడు కేసీఆర్ మిమ్మల్ని అరెస్టు చేసి జైల్లో వేయించినప్పుడు.. మిత్తితో చెల్లిస్తానని ప్రతిజ్ఞ చేశారు కదా..? మరి ఇప్పుడు మీరే సీఎం. కాళేశ్వరం, డ్రగ్స్, కార్ రేస్, ఫోన్‌ట్యాపింగ్ కేసుల్లో కేసీఆర్ కుటుంబం పాత్ర ఉందని, ఆధారాలున్నాయని మీరే చెప్పారు. 14 నెలలైనా ఎందుకు అరెస్టు చేయలేదు..? మీలో పౌరుషం చచ్చిపోయిందా..? లేక ఢిల్లీలో మీ పార్టీ పెద్దలతో కేసీఆర్ డీల్ కుదుర్చుకున్నందుకు ఆయన కుటుంబాన్ని వదిలిపెడుతున్నారా?" అని నిలదీశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం వరంగల్, మంచిర్యాల జిల్లా మందమర్రిలో సంజయ్ మాట్లాడారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఉద్యోగ విరమణ చేయబోతున్న 10 వేల మందికి బెనిఫిట్స్ (రూ.11వేల కోట్లు) ఇచ్చే స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం లేదని.. అందుకే ఉద్యోగ విరమణ వయసును 65 ఏళ్లకు పెంచబోతున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ రాష్ట్రాన్ని సగం దోచుకున్నారని, మిగిలిన సగాన్ని కాంగ్రెస్ దోచుకుంటోందని విమర్శించారు.

నదుల్లో నీరున్నా.. వాడుకోలేదు..

రెండో పంటకు వరి వేయొద్దంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, మరి ఏ పంట వేయాలో స్పష్టం చేయాలని సంజయ్ డిమాండ్ చేశారు. ఏ పంట వేయాలో ప్రణాళిక లేకుండా వరి వేయొద్దంటే ఎలా అని ప్రశ్నించారు. రెండు పంటలకు నీళ్లు ఇవ్వాల్సింది పోయి, నీళ్లు లేవని చెప్పడమేంటని మండిపడ్డారు. వర్షాలు పుష్కలంగా పడి నదుల్లో నీరున్నా రాష్ట్ర ప్రభుత్వ చేతగానితనం వల్ల వాడుకోలేకపోయారని విమర్శించారు. కృష్ణా జలాలను కేసీఆర్ ఏపీకి దోచిపెడితే.. ఇప్పుడు రేవంత్ కూడా అదే పని చేస్తున్నారని మండిపడ్డారు. వరి వేయవద్దన్న కేసీఆర్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. వరి వేస్తే రైతులకు ఉరేనన్న కేసీఆర్‌కు ప్రజలు ఓటుతో ఉరి వేశారని చెప్పారు. శాసనసభ ఎన్నికల్లో తెలంగాణ సమాజం బీజేపీని మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మనకు ఓట్లు వేయని వారి కోసం మనమెందుకు పోరాడాలని కార్యకర్తలు అడుగుతుంటే సమాధానం చెప్పలేకపోతున్నామన్నారు. 25 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. 50 వేల ఉద్యోగాలను ఎలా ఇచ్చిందో అర్థం కావట్లేదన్నారు. ఉపాధ్యాయ సంఘాలు పాలక పార్టీలకు కొమ్ము కాస్తూ.. టీచర్ల సమస్యలను గాలికొదిలేస్తున్నాయని ఆరోపించారు. టీఎన్జీవోలు పైరవీల కోసం ప్రజాభవన్‌కు వెళుతున్నారని విమర్శించారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై పోరాడేది బీజేపీయేనని.. తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సంజయ్ కోరారు.

కాంగ్రెస్ స్కాంలపై కేంద్రం మౌనమెందుకు?

- రేవంత్‌కు బీజేపీ రక్షణ కవచంగా నిలుస్తోంది: కేటీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్కాంలకు పాల్పడుతున్నా కేంద్రం పట్టించుకోవడంలేదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. సాక్ష్యాధారాలతో తాము ఫిర్యాదు చేసినా మౌనంగా ఎందుకు ఉంటోందని ఆయన ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డికి బీజేపీ రక్షణ కవచంగా నిలుస్తోందని, పరోక్షంగా కాపాడే యత్నం చేస్తోందన్నారు. సరైన సమయంలో రేవంత్ బీజేపీలో చేరతానని హామీ ఇవ్వడంవల్లే కేంద్రం ఆయన్ను కాపాడుతుందన్న అనుమానం కలుగుతోందన్నారు. ఇంతకుముందు కాళేశ్వరం ప్రాజెక్టు ప్రమాదంపై ఆగమేఘాలమీద స్పందించిన కేంద్రం.. సుంకిశాల ప్రాజెక్టులో రిటైనింగ్ వాల్ కూలిన ప్రమాదంతోపాటు తాజాగా ఎస్ఎల్‌బీసీ సొరంగంలో జరిగిన పెను ప్రమాదాలపై కనీసం స్పందించడంలేదని కేటీఆర్ చెప్పారు. కేంద్రం విడుదల చేసిన రూ.1337 కోట్ల కేంద్ర పట్టణాభివృద్ధి, పురపాలకశాఖ నిధులను రేవంత్ తన సొంత బావమరిదికి కట్టబెడుతూ అమృత్ పథకంలో స్కాం వివరాలను తానే వెళ్లి సాక్ష్యాలు అందించినా కేంద్రం స్పందించడం లేదని ఆరోపించారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: పొన్నం

హుస్నాబాద్ రూరల్, వేములవాడ టౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు పనిచేయాలని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఏఐసీసీ కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు పి.విశ్వనాథన్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్‌రెడ్డి మెజార్టీ సాధించే విధంగా కష్టపడాలని సూచించారు. కాగా, తాము అభివృద్ధి చేస్తుంటే కొంతమంది కావాలని హిందువుల పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారని పొన్నం ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం అగ్రహారం గ్రామంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వేములవాడ ఆలయానికి, సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్క్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ నిధులు ఎందుకు తేవడం లేదని ప్రశ్నించారు.

రక్తం బ్యాగుల చోరీపై సర్కార్ సీరియస్

విచారణకు ఆదేశించిన వైద్య మంత్రి దామోదర రాజనర్సింహ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నిలోఫర్ ఆస్పత్రిలో రక్తం బ్యాగుల దొంగతనం వ్యవహారంపై సర్కార్ సీరియస్ అయింది. అక్కడి సిబ్బంది రక్తం బ్యాగులను దొంగలించి బయటకు అమ్ముకుంటున్నారని 'బ్లడ్ బ్యాంకుల్లో దొంగలు' పేరిట ఈనెల 22న 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురితమైంది. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించి, విచారణకు ఆదేశించారు. అలాగే ఆస్పత్రి పనితీరు, అక్కడి ఉన్నతాధికారులపైనా వరుసగా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో బోధనాస్పత్రుల సీనియర్ ప్రొఫెసర్లతో విచారణ కమిటీ వేయాలని మంత్రి ఆదేశించనట్లు సమాచారం. ఆస్పత్రిలో అందుతున్న వైద్యం నుంచి నాలుగో తరగతి ఉద్యోగుల పనితీరు వరకు పలు అంశాలపై ఈ కమిటీ పరిశీలన జరపనుంది. సూపరింటెండెంట్‌పై వస్తున్న ఆరోపణలపైనా ఆరా తీయనుంది.నిలోఫర్‌లో బ్లడ్ బ్యాంక్‌ల్లో చోరీ అంశంపై కమిటీ ప్రత్యేకంగా విచారణ జరుపనుంది. డీఎంఈ నరేంద్ర కుమార్ పర్యవేక్షణలో ఇతర బోధనాస్పత్రుల ప్రొఫెసర్లతో ఆ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

ఎస్సీ వర్గీకరణతో మాలలకు నష్టం: వివేక్

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతో మాల కులస్థులకు నష్టం కలుగుతుందని, వర్గీకరణకు వ్యతిరేకంగా గ్రామస్థాయిలో చైతన్యం తేవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం ఏపీ కర్నూలు జిల్లా కేంద్రంలోని ఎగ్జిబిషన్ మైదానంలో మాలల జేఏసీ కన్వీనర్ యాట ఓబులేసు అధ్యక్షతన రాయలసీమ మాలల యుద్ధగర్జన మహాసభ నిర్వహించారు. ఇందులో వివేక్ మాట్లాడుతూ.. మాలలు బలీయ శక్తిగా తయారుకావాలని, అందరూ కలిసి పోరాడితేనే ఉద్యమం ఉధృత రూపం దాలుస్తుందన్నారు.

ప్రభుత్వాలు మారినా.. పాలన మారలే

» బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా.. నాయకులు మారినా.. పాలన మాత్రం మారలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనతో విసుగు చెందిన ప్రజలు.. మార్పు కోసం కాంగ్రెస్‌ను గెలిపిస్తే.. ఈ ప్రభుత్వం కూడా బీఆర్ఎస్ విధానాలనే అనుసరిస్తూ ప్రజా సమస్యలను గాలికొదిలేసిందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆదిలాబాద్ జిల్లాలోని పార్టీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేస్తున్న ఏకైక జాతీయ పార్టీ బీజేపీ అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి 14 నెలలైనా ఇప్పటికీ ప్రజలు, కార్మికులు, రైతులకు ఎలాంటి న్యాయం చేయలేదన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలను సక్రమంగా అమలు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో సీఎంలు మారినా పాలన మాత్రం అదే విధంగా ఉందని విమర్శించారు.

ఈ రోజో రేపో నీ తల నరుకుతాం!

» ఎమ్మెల్యే రాజాసింగ్‌కు బెదిరింపు కాల్స్

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బెదిరింపులు వచ్చాయి. ఆదివారం మధ్యాహ్నం 3:30 గంటలకు, అలాగే 3:54 గంటలకు రెండు ఫోన్ కాల్స్ వచ్చాయి. "ఈ రోజు కాకపోతే రేపు నీ తల నరికేస్తాం... నువ్వు మా నుంచి తప్పించుకోలేవు... ఈ విషయంలో యూపీ సీఎం యోగి, ప్రధాని మోదీ నిన్ను రక్షించలేరు. నువ్వు ఎన్ని నంబర్లు బ్లాక్ చేసినా నా నుంచి ఇలాగే కాల్స్ వస్తాయి... నీ అంతు చూస్తాం" అంటూ ఆగంతకుడు బెదిరించాడు. ఈ విషయమై రాజాసింగ్ ఇప్పటివరకు స్థానిక పోలీసులకు ఎలాంటి లిఖితపూర్వక ఫిర్యాదు చేయలేదని తెలిసింది.

నల్లగొండ జిల్లాలో 4 వేల ఏళ్లనాటి సమాధులు

» పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోనే అత్యంత అరుదైన ఇనుప యుగం (4 వేల ఏళ్ల) నాటి సమాధి గది (డాల్మెకి)ని నల్లగొండ జిల్లా గుడిపల్లి శివారులో గుర్తించినట్లు పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈవో ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు బోయ శ్రీనివాసరెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు ఆయన ఆదివారం గుడిపల్లి పరిసరాల్లో పరిశీలించగా...అక్కడ క్రీ.పూ 2000-1000 మధ్య కాలానికి చెందిన ఆనవాళ్లు ఉన్నట్లు వెల్లడించారు. ఊరి వెలుపల ఉన్న నిలువు రాళ్లు (పురాతన కాలం నాటి స్మారక శిలలు) ఒక్కొక్కటిగా కనుమరుగవుతున్నాయని, ప్రస్తుతం రెండు మాత్రమే మిగిలాయని శివనాగి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడే శింగరాజుపల్లి రోడ్డు కుడివైపున ఎల్లమ్మ బండపై మిగిలిన ఏకైక గుండు రాతి సమాధి నిర్మాణపరంగా అత్యంత విశేషమైనదని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా పురాతన చరిత్రకు నిలువెత్తు సాక్ష్యాలైన అత్యంత అరుదైన ఈ చరిత్ర చిహ్నాలను పరిరక్షించుకోవాలని గ్రామస్థులకు ఆయన సూచించారు.

మోదీ ఒరిజినల్ బీసీ: ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఒరిజినల్ బీసీ అని బీజేపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. మోదీ బీసీ కాదంటూ సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్య తప్పని పేర్కొన్నారు. బీసీల్లో రెండు రకాలు ఉంటారని, మోదీ చేతివృత్తులవారికి(గాండ్ల) సంబంధించినవారని వివరించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కృష్ణయ్య మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన శాస్త్రీయంగా లేదని ఆరోపించారు. ఏ లెక్కన చూసినా రాష్ట్ర జనాభా 4 కోట్లపైబడి ఉంటుందని, ప్రభుత్వం మాత్రం 3.55కోట్లు జనాభానే చూపించిందని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఖరారు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఉందన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షలకు 96.40% హాజరు

హైదరాబాద్, ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాలతోపాటు 6, 7, 8, 9వ తరగతుల్లోని బ్యాక్‌లాగ్ సీట్లలో ప్రవేశాలకు ఎస్సీ గురుకులం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పరీక్షలకు 96.40 శాతం మంది హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 446 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఆయా ప్రవేశాల కోసం మొత్తం 1,67,662 మంది దరఖాస్తు చేసుకోగా పరీక్షకు 1,61,618 మంది (96.40 శాతం) హాజరయ్యారని, 6,044 మంది గైర్హాజరైనట్లు ఎస్సీ గురుకులం ఓ ప్రకటనలో తెలిపింది. కాగా భద్రాద్రి జోనల్ పరిధిలోని 5 జిల్లాల్లో గురుకుల ప్రవేశ పరీక్ష రాసేందుకు వచ్చిన ఐదుగురు విద్యార్థులకు నిరాశ ఎదురైంది. అధిక ఆదాయ పరిధిలో ఉన్నారని వీరిని పరీక్ష రాయనివ్వలేదు. హాల్ టికెట్ మంజూరు చేసి విద్యార్థులు పరీక్షా కేంద్రానికి వచ్చాక అడ్డుకోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు మద్దతివ్వండి

» కేసీఆర్‌కు జాజుల శ్రీనివాస్‌గౌడ్ లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున అభ్యర్థులు లేని కారణంగా.. పోటీలో ఉన్న బీసీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరుతూ ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం లేఖ రాశారు. బీసీలను రాజకీయ లబ్ధి కోసం వాడుకోకుండా వారి రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచడానికి కృషి చేయాలన్నారు. అదేవిధంగా బీసీ వాదంతో వస్తున్న కవిత ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన వైఖరేంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

5.40 లక్షల టన్నుల ధాన్యం మాయం

» రికవరీకి 314 రైస్ మిల్లులకు నోటీసులు!

2022-23 రబీ సీజన్‌కు సంబంధించి 314 రైస్ మిల్లుల నుంచి 5.40 లక్షల టన్నుల ధాన్యం మాయమైనట్టు పౌర సరఫరాల శాఖ గుర్తించింది. ఈ ధాన్యం రికవరీకి చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా ఆ మిల్లులకు నోటీసులు జారీ చేయాలని నిర్ణయించింది. దీనిపై పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ జిల్లాల అదనపు కలెక్టర్లకు సర్క్యులర్ పంపారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహించిన తనిఖీల్లో 30 జిల్లాల్లోని 314 మిల్లుల్లో ధాన్యం నిల్వలు తక్కువ ఉన్నట్లు గుర్తించారని ఆ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. మిల్లులకు నోటీసుల జారీ, న్యాయపరమైన చర్యలతో పాటు 25 శాతం జరిమానాతో ధాన్యాన్ని రికవరీ చేయాలని సూచించారు. మిల్లుల వారీగా మాయమైన ధాన్యం వివరాలను పొందుపర్చిన జాబితాను కూడా పంపారు. 2022-23 రబీ సీజన్‌కు సంబంధించి 38 లక్షల టన్నుల ధాన్యాన్ని గత ఏడాది జనవరిలో పౌర సరఫరాల సంస్థ వేలం ద్వారా విక్రయించింది. వేలంలో పాల్గొని ధాన్యాన్ని దక్కించుకున్న బిడ్డర్లు.. మిల్లర్ల నుంచి సుమారు 25 లక్షల టన్నుల ధాన్యాన్ని తీసుకున్నారు. మిగిలిన ధాన్యం నిల్వలు ఆయా మిల్లుల్లో లేవంటూ పౌరసరఫరాల సంస్థకు ఫిర్యాదు చేశారు. దీంతో నిర్వహించిన తనిఖీల్లో 314 రైస్ మిల్లుల్లో 5.40 లక్షల టన్నుల ధాన్యం లేదని గుర్తించారు.

8 మంది ఐపీఎస్ అధికారుల బదిలీ

హైదరాబాద్, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి) తెలంగాణలో 8మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ ట్రాఫిక్ విభాగం అదనపు కమిషనర్‌గా ఉన్న పి.విశ్వ ప్రసాద్‌ను హైదరాబాద్ క్రైమ్స్ అదనపు సీపీగా నియమించారు. హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా జోయల్ డేవిస్,సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా డాక్టర్ గజారావు భూపాల్, ఎస్.చైతన్యకుమార్‌ను హైదరాబాద్ స్పెషల్ బ్రాంచ్ డీసీపీగా, నవీన్ కుమార్,బి.రామిరెడ్డిలను సీఐడీ ఎస్పీలుగా, సిహెచ్ శ్రీధర్‌ను ఇంటెలిజెన్స్ ఎస్పీగా నియమించారు. గవర్నర్ ఏడీసీగా ఉన్న సంకీర్త్‌ను అదే స్థానంలో ఎస్పీ పదోన్నతిపై కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్ఎంఎస్‌తో హాల్‌టికెట్

(మొదటిపేజీ తరువాయి)

వచ్చేలా ఏర్పాటు చేశారు. ప్రాక్టికల్ పరీక్షల్లో దీనిని విజయవంతంగా అమలుచేశారు. వార్షిక పరీక్షల్లోనూ ఇదే తరహా విధానం అమలు కానుంది. కాలేజీలో ప్రవేశాల సమయంలో విద్యార్థులు ఇచ్చిన మొబైల్ నంబర్‌కు ఈ ఎస్ఎంఎస్ వస్తుంది. దీని వల్ల.. ఫీజు చెల్లించలేదంటూ హాల్‌టికెట్ ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బంది పెట్టే అవకాశం కాలేజీలకు ఉండదు. అలాగే.. పరీక్ష కేంద్రాల చిరునామాను హాల్‌టికెట్‌పై క్యూఆర్ కోడ్ రూపంలో ముద్రించనున్నారు. దాన్ని స్కాన్ చేస్తే చాలు.. జీపీఎస్ సాయంతో సులువుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవచ్చు. కాలేజీ పేర్లలో గందరగోళం, చిరునామా వివరాలు సరిగ్గా లేకపోవడం వల్ల ఏటా చాలా మంది విద్యార్థులు మొదటిరోజున పరీక్ష కేంద్రాలకు ఆలస్యంగా చేరుకుని.. లోపలికి అనుమతించకపోవడం వల్ల నష్టపోతున్నారు. ఆ సమస్యను ఈ క్యూఆర్ కోడ్ విధానం తీర్చనుంది.

ప్రాక్టికల్స్‌కు సీసీ కెమెరాలు..

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలంటే అంతా కాలేజీల్లోనే మేనేజ్ చేసుకుంటారనే భావన ఇప్పటివరకూ ఉండేది. ఈసారి అలాంటి ఆరోపణలు రాకుండా.. అన్ని ప్రాక్టికల్ పరీక్షలనూ సీసీటీవీ పర్యవేక్షణలో నిర్వహించారు. దీన్ని తొలుత ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు వ్యతిరేకించాయి. తర్వాత అయిష్టంగానే అంగీకరించాయి. దీంతో అన్ని జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించే చోట సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి, జిల్లా కేంద్రంతోపాటు ఇంటర్ బోర్డులో ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించారు. ఫలితంగా ప్రాక్టికల్ పరీక్షల్లో అవకతవకలకు అవకాశం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో.. వార్షిక పరీక్షలు జరిగే అన్ని సెంటర్లవద్దా సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటుచేస్తున్నారు. ప్రశ్నాపత్రాల కవర్లు తొలగించడం కూడా కెమెరాల నిఘాలోనే జరగనుంది.

ఫిర్యాదు చేయండి..

పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ఈసారి హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. దాని ఫోన్ నంబర్.. 9240205555. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ ఇది పనిచేస్తుంది. దీనికి వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారాల వివరాలను ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య ప్రతిరోజు పర్యవేక్షిస్తున్నారు. పరీక్షల్లో కీలకపాత్ర పోషించే ప్రధాన పర్యవేక్షకులు (సీఎస్), శాఖాధికారులు (డీవో) విధుల కేటాయింపులోనూ ఈసారి మార్పులు చేస్తున్నారు. గతంలో వీరి నియామకంలో ఆరోపణలు వచ్చేవి. కొన్ని ప్రైవేటు కాలేజీలకు లబ్ధి కలిగేలా కొందరు సీఎస్‌లు, డీవోలు ప్రవర్తిస్తున్నారన్న విమర్శలు వచ్చేవి. దీంతో ఈసారి వీరి నియామకంలోనూ మార్పులు చేస్తున్నారు.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా..

ఇంటర్ పరీక్షలపై విద్యార్థులతోపాటు తల్లిదండ్రుల్లోనూ విశ్వాసం పెంచడమే లక్ష్యంగా కొత్త సంస్కరణలు అమలు చేస్తున్నాం. దేశంలోనే.. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలన్నీ సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించిన తొలి రాష్ట్రం తెలంగాణ. ఇందుకోసం రాష్ట్రస్థాయిలో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుచేశాం. వార్షిక పరీక్షల్లోనూ సీసీటీవీ కెమెరాలను వినియోగిస్తాం. పరీక్షలను పూర్తి పారదర్శకతతో నిర్వహించడానికి తెలంగాణ తీసుకుంటున్న చర్యలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

- కృష్ణ ఆదిత్య, ఇంటర్ విద్య కార్యదర్శి

టీచర్స్ ఎమ్మెల్సీ కోసం పోటాపోటీ

గెలుపు కోసం చెమటోడ్చుతున్న అభ్యర్థులు.. ఉపాధ్యాయ సంఘాల మధ్యే ప్రధాన పోటీ

- » అభ్యర్థులను బరిలో దించని కాంగ్రెస్, బీఆర్ఎస్
- » ప్రతిష్ఠను నిలబెట్టుకోవాలని టీచర్ల తాపత్రయం
- » హోరాహోరీ పోటీలో ఎవరు నెగ్గుతారని ఉత్కంఠ



సర్వోత్తమ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ దేవరకొండలో ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు

నల్లగొండ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక జరుగుతున్న నల్లగొండ - ఖమ్మం - వరంగల్ నియోజకవర్గంలో గెలుపు కోసం అభ్యర్థుల్లో పోటాపోటీ నెలకొంది. మంగళవారం సాయంత్రంతో ప్రచారం ముగియనుండటంతో అభ్యర్థుల ప్రచారం తారస్థాయికి చేరింది. ఈ స్థానంలో బీజేపీ అభ్యర్థిని బరిలో నిలపగా.. కాంగ్రెస్, బీఆర్ఎస్ తటస్థంగా ఉన్నాయి. దీంతో ఈ ఎన్నికల్లో రాజకీయ పార్టీల ప్రమేయం కంటే, ఉపాధ్యాయ సంఘాల మధ్య పోటీనే ఎక్కువగా ఉంది. సిటింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మరోసారి యూటీఎఫ్ నుంచి బరిలో ఉండగా.. పీసీసీ అధికార ప్రతినిధి, టీపీఆర్టీయూ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, పీఆర్టీయూ-టీఎస్ నుంచి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి, బీజేపీ నుంచి పులి సర్వోత్తమ్‌రెడ్డి, బీసీ సంఘాల మద్దతుతో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ సహా 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ స్థానంలో గెలవడం ద్వారా ఉపాధ్యాయ వర్గాల్లో తమ పట్టును చాటేందుకు ప్రధాన అభ్యర్థులు, సంఘాలు పోటాపోటీగా వ్యూహాలు అమలు చేస్తున్నాయి. 12 జిల్లాల పరిధిలోని ఈ నియోజకవర్గంలో 25,797మంది ఉపాధ్యాయులు ఓటర్లుగా ఉన్నారు. ఈ నెల 27న పోలింగ్ జరగనుంది.

గెలుపునకు వ్యూహ ప్రతివ్యూహాలు

పార్టీలపరంగా బీజేపీ మాత్రమే అభ్యర్థిని నిలబెట్టగా.. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రత్యక్షంగా ఎవరికీ మద్దతివ్వడం లేదు. దీంతో సంఘాల మద్దతు, ఉపాధ్యాయులను నేరుగా కలవడం ద్వారా ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు అభ్యర్థులు వ్యూహాలు పన్నుతున్నారు. అధిక సభ్యత్వాలు ఉన్న యూటీఎఫ్, పీఆర్‌టీయూ, టీపీఆర్‌టీయూ నేరుగా అభ్యర్థులను బరిలో దింపగా.. ఇతర సంఘాలు, ఈ సంఘాలకు సంబంధం లేని ఉపాధ్యాయుల మద్దతు కోసం మిగిలిన అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. హైస్కూల్ ఉపాధ్యాయుల ఓట్ల విషయంలో అన్ని సంఘాలకు రమారమి సమాన అవకాశాలు ఉంటాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులు, కేజీబీవీ టీచర్లు, భాషా పండిట్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఎయిడెడ్ స్కూళ్ల టీచర్ల విషయంలో.. సంఘాలతో సంబంధం లేకుండా వారి సమస్యల ఆధారంగా ఓట్లు పడే అవకాశం ఉంది. దీంతో వారి మనసు గెలుచుకునేందుకు ప్రధాన అభ్యర్థులంతా ప్రయత్నాలు చేస్తున్నారు. జీవో 371తో పాటు, స్పౌస్ బదిలీలు, పెండింగ్ డీఏలు ఈ ఎన్నికలో ప్రధాన భూమికను పోషిస్తున్నాయి. దీంతో ఉపాధ్యాయులకు ఆయా సందర్భాల్లో వారి పోరాటాలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తుచేస్తూ, భవిష్యత్తులోనూ మద్దతుగా ఉంటామని అభ్యర్థులు భరోసా ఇస్తున్నారు. వీటితో పాటు రాష్ట్రంలో కులగణన నేపథ్యంలో బీసీ నినాదం సైతం ఈ ఎన్నికలో తెరమీదకు వచ్చింది. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ ఈ ఎన్నికలో బీసీ నినాదంతో బరిలో ఉండటం ఆసక్తి రేపుతోంది. కేంద్ర మంత్రులు, ఎంపీలు, ముఖ్య నాయకులంతా బీజేపీ తరపున విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటి వరకు కాంగ్రెస్ ఎవరికీ మద్దతు ఇవ్వలేదు. అయినా ఒకటి, రెండు రోజుల్లో అంతర్గతంగానైనా కీలక అభ్యర్థికి మద్దతు ఇచ్చే అవకాశాన్ని తోసిపుచ్చలేమని ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ సాగుతోంది. మొత్తంగా హోరాహోరీ పోటీ నెలకొనడంతో ఈ ఎన్నికపై ఉపాధ్యాయవర్గాలతో పాటు, రాజకీయ, ఉద్యోగ వర్గాల్లోనూ ఆసక్తి నెలకొంది.

నాలుగో పర్యాయం జరగనున్న ఎన్నిక

ఉమ్మడి రాష్ట్రంలో శాసనమండలి పునరుద్ధరణ తర్వాత ప్రస్తుతం నాలుగో పర్యాయం ఎన్నిక జరగబోతోంది. 2007లో జరిగిన మొదటి ఎన్నికలో ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య గెలుపొందారు. 2013లో పీఆర్‌టీయూ అభ్యర్థి పూల రవీందర్, 2019లో యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి విజయం సాధించారు. ప్రస్తుతం నర్సిరెడ్డి, రవీందర్ బరిలో నిలవడం గమనార్హం.

రాష్ట్రంలో కొత్త మద్యం బ్రాండ్లు.!

» దరఖాస్తులను ఆహ్వానించిన సర్కారు

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త దేశీయ, విదేశీ లిక్కర్ బ్రాండ్లు రానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం కొత్త మద్యం బ్రాండ్ల సరఫరాకు అవకాశం కల్పించింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు విక్రయాలు జరపని మద్యం కంపెనీలు, ఇప్పటికే సరఫరా చేస్తున్నా రిజిస్టర్ చేసుకోని బ్రాండ్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్(టీజీబీసీఎల్) నోటిఫికేషన్ జారీ చేసింది. మార్చి 15 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆ నోటిఫికేషన్‌లో పేర్కొంది. అయితే.. కొత్త బ్రాండ్ల విషయంలో నూతన విధానంలో ముందుకు వెళ్తోంది. దాంతో దరఖాస్తుల గడువు ముగిశాక.. 10 రోజుల పాటు ఆన్‌లైన్‌లో బహిరంగ విచారణ జరపనుంది. ఈ క్రమంలో ఏదైనా కంపెనీపై అభ్యంతరాలు వస్తే.. చర్యలు తీసుకోవడంతోపాటు.. ఆ బ్రాండ్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టేలా చర్యలు తీసుకోనుంది. అంతేకాకుండా.. రాష్ట్రంలో సరఫరా చేసేందుకు ఆసక్తి చూపే కంపెనీలు.. ఇప్పటికే సరఫరా చేస్తున్న రాష్ట్రాల్లో తమ మద్యం అమ్మకాలు, నాణ్యత ప్రమాణాలకు సంబంధించి ఇబ్బందుల్లేవని, తమ కంపెనీలపై ఎలాంటి ఆరోపణలు లేవని నిర్ధారించేలా.. ఆయా రాష్ట్రాల ప్రభుత్వాల నుంచి సర్టిఫికెట్‌ను జతచేయాల్సి ఉంటుందని నూతన విధానం నిబంధనల్లో స్పష్టం చేసింది. గతంలో 'సోం' బీర్ల కంపెనీ అనుమతులపై వివాదం చోటుచేసుకున్న నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. కొత్త బ్రాండ్లే కాకుండా.. ఇప్పటికే మద్యాన్ని సరఫరా చేస్తున్న కంపెనీలు కూడా కొత్త బ్రాండ్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని టీజీబీసీఎల్ సూచించింది. ప్రస్తుతం తెలంగాణలో 53 కంపెనీలు మద్యాన్ని, బీర్లను సరఫరా చేస్తున్నాయి. వీటిల్లో దేశీయ, విదేశీ బ్రాండ్లు కూడా ఉన్నాయి. తెలంగాణలోనే ఉత్పత్తి చేసే కంపెనీలు 15 (వీటిలో 6 బీర్ల కంపెనీలు) ఉన్నాయి. ఇటీవలే ప్రభుత్వం మద్యం, బీర్ల ధరలు పెంచడంతో కొత్త బ్రాండ్ల ధరలు ఎలా ఉంటాయనే ఆసక్తి నెలకొంది.

సచివాలయంలో పగుళ్లు!

(మొదటిపేజీ తరువాయి)

అమర్చారు. అవి వర్షానికి తడిసి, ఆ నీరు లోపలికి చేరడంతో నట్లు, బోల్టులు తుప్పు పట్టాయి. దీంతో బరువును మోయలేక అవి ఊడిపడ్డాయి. ఆ కారణంగానే గ్లాస్ ఫైబర్ రీయిన్‌ఫోర్స్‌డ్ కాంక్రీట్ (జీఎఫ్ఆర్‌సీ)తో ఉన్న ఫ్రేమ్ ఊడి పడింది" అని ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో కమిటీ పేర్కొంది. ఈ నెల 13న సాయంత్రం సచివాలయం దక్షిణభాగం వైపు పోర్టికో పక్కన ఐదో అంతస్తుపై మోడల్ కోసం జీఆర్ఎఫ్‌సీతో అమర్చిన రెయిలింగ్ పెచ్చులు ఊడిపడిన విషయం తెలిసిందే. ఆ పెచ్చులు అక్కడే నిలిపి ఉంచిన రామగుండం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గడ్డం తిరుపతి కారుపై పడడంతో.. కారు కొంతమేర దెబ్బతింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కాగా, ఈ ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఘటన ఎలా జరిగింది, పెచ్చులు ఎలా ఊడిపడ్డాయనే అంశాలపై సంబంధిత శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరా తీశారు. మరోవైపు ఆర్‌అండ్‌బీ, ఐటీ శాఖతోపాటు సచివాలయాన్ని నిర్మించిన సంస్థ ప్రతినిధులతో కలిపి ఉన్నతాధికారులు విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ తాజాగా సమగ్ర వివరాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. సచివాలయం లోపల డిజైన్ కోసం నిర్మించిన పిల్లర్లకు అమర్చిన ఫ్రేమ్‌లలోనూ చాలా పగుళ్లు ఉన్నాయని విచారణ కమిటీ పేర్కొన్నట్లు తెలిసింది. వాస్తవానికి ఆ ఫ్రేమ్‌లలో పగుళ్లు బహిరంగంగానే కనిపిస్తున్నాయి. బాల్కనీల్లో రూఫ్‌టాప్‌కు అమర్చిన కొన్ని డిజైన్లు కూడా వంకర్లు తిరిగి, ఊడిపోయే స్థితిలో ఉన్నాయి. కొన్ని గోడల్లోనూ పలుచోట్ల పగుళ్లు కనిపిస్తుండడం గమనార్హం. కాగా, సచివాలయం లోపలి వైపు పగుళ్లన్నింటికీ మరమ్మతులు చేపట్టాలని కమిటీ సూచించింది. అయితే ఆయా మరమ్మతులకు అయ్యే వ్యయాన్ని సదరు నిర్మాణ సంస్థే భరించాల్సి ఉంది. నిర్మాణ సమయంలో ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందంలోనూ ఈ నిబంధన ఉందని అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. ఈ నేపథ్యంలోనే విచారణ కమిటీ తేల్చిన పగుళ్లు, వాటి మరమ్మతులకు సంబంధించి అన్ని పనులనూ త్వరితగతిన పూర్తిచేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం. కాగా, గత ప్రభుత్వ హయాంలో 2019లో నూతన సచివాలయం కోసం శంకుస్థాపన చేయగా.. 2023 ఏప్రిల్ 30న భవనాన్ని ప్రారంభించారు. ప్రారంభమై రెండేళ్లు కూడా కాకముందే ఫ్రేమ్‌లు ఊడిపడడం, పగుళ్లు రావడంతో నిర్మాణ నాణ్యతపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. సచివాలయ భవనం నిర్మాణం కోసం సుమారు రూ.1500కోట్లు ఖర్చు చేశారు.

కమ్యూనిస్టుల పునరేకీకరణ ఎంతో అవసరం

- » మార్క్సిస్టు ఆలోచనాపరుల వేదికలో వక్తలు
- » బెజవాడలో ఉద్యమ వందేళ్ల సదస్సు
- » సీపీఐ, సీపీఎం, 17 ఎంఎల్ పార్టీల రాష్ట్ర నేతలు హాజరు



సదస్సులో మాట్లాడుతున్న సీపీఎం ఏపీ కార్యదర్శి వి.శ్రీనివాసరావు

గవర్నర్‌పేట(విజయవాడ), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): దేశంలో కమ్యూనిస్టుల పునరేకీకరణ ఎంతో అవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. కార్మిక, రైతాంగ పోరాటాలతోపాటు విశాఖ ఉక్కు, రాష్ట్రానికి ప్రత్యేక హోదా వంటి అనేక సమస్యల మీద 9 వామపక్ష పార్టీలు ఐక్యంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమం 100 సంవత్సరాల సందర్భాన్ని పురస్కరించుకుని మార్క్సిస్టు ఆలోచనాపరుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ లైబ్రరీ హాలులో 'కమ్యూనిస్టు ఉద్యమ పురోగమనం ఆవశ్యకత, అవకాశాలు, అవరోధాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సీపీఐ, సీపీఎంలతోపాటు 17 ఎంఎల్ పార్టీల రాష్ట్ర నాయకులు ఈ సదస్సులో పాల్గొన్నారు. వేదిక కన్వీనర్ చిగురుపాటి భాస్కరరావు అధ్యక్షత వహించిన ఈ సదస్సులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలకు ఎంతో పోరాట చరిత్ర ఉందన్నారు. 1964లో నాటి పరిస్థితుల కారణంగా చీలికకు కొన్ని కారణాలు ఉండవచ్చని, వర్తమానంలో కమ్యూనిస్టు ఉద్యమ ఆవశ్యకతను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. విశాల దృక్పథంలో అన్ని కమ్యూనిస్టు వేదికలు దీన్ని గుర్తించాలన్నారు. మార్క్స్, లెనిన్, మావో, అంబేద్కర్ ఆలోచనా విధానాలతో ముందుకు సాగాలని కమ్యూనిస్టు నేతలను కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, వివిధ సీపీఐ(ఎంఎల్) పార్టీల నాయకులు కేజీ రామచందర్, స్ట్రగుల్ కమిటీ తరఫున నరసింహస్వామి, పి.ప్రసాద్, ఎంపీ రామ్‌దేవ్, ఎం.హరిప్రసాద్, పి.కోటేశ్వరరావు, విరసం కార్యదర్శి పినాకపాణి, ఎం.సీపీఐ(యూ) నాయకులు కె.నాగభూషణం, వెంకటరెడ్డి, అమర్‌నాథ్ తదితరులు ప్రసంగించారు.



శ్రీశైల మల్లన్నకు చీరాల తలపాగా సిద్ధం

» ఈ దఫా పృథివి సుబ్బారావుకు దక్కిన అవకాశం

చీరాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లన్నకు మహాశివరాత్రి నాడు ధరింపజేసే తలపాగాను తయారు చేసే అవకాశం బాపట్ల జిల్లా చీరాల మండలం దేవాంగపురికి చెందిన పృథివి సుబ్బారావుకు దక్కింది. దశాబ్దాల కాలంగా సుబ్బారావు పూర్వీకులే మల్లన్న తలపాగాను మగ్గంపై స్వయంగా తయారు చేసి స్వామి తలకు చుట్టే ఆనవాయితీ కొనసాగిస్తున్నారు. ఇటీవల సుబ్బారావు తండ్రి వెంకటేశ్వర్లు అనారోగ్యం బారిన పడడంతో ఈ ఏడాది ఆయన కుమారుడు సుబ్బారావుకు అవకాశం దక్కింది. 3 నెలలపాటు శ్రమించి 360 మూరల పొడవున్న తలపాగాను తయారు చేశారు. దాన్ని ఆదివారం సుబ్బారావు, దుర్గ దంపతులు శ్రీశైలం తీసుకెళ్లారు.

సంస్కృతులు తెలుసుకోవాలని సైకిల్‌పై ప్రపంచయాత్ర

- » ఇప్పటికి 25 దేశాల సందర్శన
- » పాకిస్థాన్ మీదుగా ఇండియాలోకి అడుగు
- » ఇక్కడి ఆత్మీయత, ఆతిథ్యం అపూర్వం
- » 'ఆంధ్రజ్యోతి'తో జర్మనీ దేశస్థుడు పాస్కల్ ఎకెర్ట్



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): భారత్ గురించి యూరప్‌తో పాటు ఇతర పశ్చిమ దేశాల మీడియా రాసే వ్యతిరేక వార్తలు అబద్ధమని తన పర్యటనలో తెలుసుకున్నానని సైకిల్‌పై ప్రపంచ యాత్ర చేస్తున్న జర్మనీ దేశస్థుడు పాస్కల్ ఎకెర్ట్ అన్నారు. ఇక్కడి ప్రజల ఆత్మీయత, ఆతిథ్యం అపూర్వమని చెప్పారు. వివిధ దేశాల సంస్కృతులు, సంప్రదాయాలను తెలుసుకోవడమే లక్ష్యంగా బయలుదేరిన ఆయన ఇప్పటికే 25 దేశాలను చుట్టి భారత్‌కు వచ్చారు. పాకిస్థాన్ నుంచి వాఘా సరిహద్దు మీదుగా ఇండియాలోకి ప్రవేశించిన ఆయన అమృత్‌సర్, ఉత్తరాది మీదుగా గోవాకు, ఆపై హైదరాబాద్‌కు చేరుకున్నారు. మూడు రోజులుగా ఆయనకు హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూపు (హెచ్‌సీజీ) సభ్యులు రవీందర్, అనిల్ ఆతిథ్యమిచ్చారు. ఆ గ్రూప్ సభ్యులతో కలిసి చార్మినార్ సహా పలు ప్రాంతాలను సందర్శించిన ఎకెర్ట్‌ను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

తొలిసారిగా ఇండియాకు..

'ఇండియాకు రావడం ఇదే తొలిసారి. ఇక్కడకు రాక మునుపు ఈ దేశం గురించి యూరప్, ఇతర పశ్చిమ దేశాల మీడియాతో పాటు సామాజిక మాధ్యమాల్లో ఎన్నో వార్తలు చదివాను. అదో మురికి దేశం. జనాభా చాలా ఎక్కువ. ఎలా పడితే అలా ఉంటుంది. భద్రతపరంగా అంత గొప్ప దేశం కాదు లాంటి వార్తలవి. నా స్నేహితులు కూడా ప్రమాదంలో పడతావని హెచ్చరించారు కానీ, గత ఏడాది అక్టోబరులో ఇండియాలోకి అడుగుపెట్టిన తర్వాత ఆ వార్తలన్నీ అబద్ధమని తెలిసింది. ఇక్కడి ప్రజల ఆత్మీయత, ఆతిథ్యం.. అపూర్వం. మెకానికల్ ఇంజనీర్‌గా ఐదేళ్లు ఉద్యోగం చేశాను. యాత్ర ఆలోచన రాగానే నా అపార్ట్‌మెంట్‌ను అమ్మేశాను. ఆ డబ్బే ఖర్చు పెడుతున్నాను' అని ఆయన తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.